




ESTD: 1999

www.voodayam.com

# వుదయం








ఖమ్మం | 03-05-2026 ఆదివారం | సంపుటి : 13 | సంచిక : 293 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal

Follow us on


# పశ్చిమాసియా, యూరప్ ముక్కలయ్యేవి

**ఇరాన్‌పై దాడి చేసి ఆ దేశం అణ్వాయుధాన్ని**
**తయారు చేయకుండా అడ్డుకున్నాం**
**అలా చేయకపోయి ఉంటే**
**యూరప్ దేశాలు ముక్కలైపోయేవి**
**ఇరాన్ వైమానిక, నౌకాదళాలు**
**పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి**
**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**



*దాడుల ద్వారా ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయకుండా అడ్డుకున్నామంటూ పశ్చిమాసియా, యూరప్ దేశాలను తాము ఎలా కాపాడామో వివరించారు. ఇరాన్ అనే అందమైన దేశంలోకి వెళ్లి వారి వద్ద అణ్వాయుధాలు లేవని నిర్ధారించుకోవాలి. బీ2 బాంబర్లతో వారిని అడ్డుకున్నాం. అమెరికా అలా చేయకపోయి ఉంటే వారి వద్ద అణ్వాయుధాలు ఉండేవి. అప్పుడు ఇజ్రాయెల్, పశ్చిమాసియాతో సహా యూరప్ దేశాలు ముక్కలుగా పేలిపోయి ఉండేవి.* – ట్రంప్

**వుదయం డెస్క్, మే 2 :** తాను యుద్ధ వ్యతిరేకినని చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై యుద్ధాన్ని పదే పదే సమర్థించుకోవలసి వస్తోంది. తాము యుద్ధాన్ని చేపట్టడం వల్లనే పశ్చిమాసియా, యూరప్ దేశాలు ముక్కలు కాలేదని అన్నారు. తాము బీ2 బాంబర్లతో చేసిన దాడి వల్లనే ఇరాన్ నాయకత్వం బలహీనపడిందని,

మిగతా 2లో

# ఉద్యోగుల పక్షపాతి కాంగ్రెస్

## రెండేళ్లలో రాష్ట్రంలో 67,760 ఉద్యోగ నియామకాలు

**ఉద్యోగ సంఘాల జేఏసీ, ఎంప్లాయీస్**
**జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నేతలతో భేటీ**
**పీఆర్సీ అమలు, హెల్త్ కార్డుల జారీపై సానుకూల నిర్ణయం**
**రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి**
**వందరోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్**
**బెనిఫిట్స్ కోసం రూ. 6 వేల కోట్లు చెల్లిస్తాం**
**ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం, సమస్యలను పరిష్కరించే బాధ్యత మాది**

**సీఎం రేవంత్ రెడ్డి**



*...మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే తొలి నిర్ణయం తీసుకున్నాం. ప్రతి నెలా ఒకటో తేదీకే జీతాలు అందేలా చర్యలు చేపట్టాం. గత రెండేళ్లలో రాష్ట్రంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టినం. అలాగే రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. వంద రోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల కోసం రూ.6 వేల కోట్లు విడుదల చేస్తాం. పీఆర్సీ అంశంపై తక్షణమే నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించాం.*

సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మే 02 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కీలక ముందడుగు పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలు, డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ, ఎంప్లాయీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నేతలతో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న 13,100 మంది సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. అలాగే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అమలు, హెల్త్ కార్డుల జారీ వంటి ప్రధాన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఎంను కోరారు. వందరోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ. 6 వేల కోట్లు చెల్లిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. పీఆర్సీపై తక్షణమే రిపోర్టు అందించాలని అధికారుల కమిటీని ఆదేశించాం, రిపోర్టు ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని సిఎం చెప్పారు. జూన్ 1 లోగా ఆరోగ్య భద్రత కార్డులను ఉద్యోగులకు అందిస్తామని, ప్రతీ రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలు సమావేశమై సమస్యలపై ప్రభుత్వానికి రిపోర్టు అందించాలని తెలిపారు.

మిగతా 2లో



# అధికారులను ఎంపిక చేసే అధికారం ఇసికి ఉంది

## పరిశీలకుల నియామకాన్ని సవాల్ చేసిన టీఎంసీ పిటిషన్ కొట్టివేసిన సుప్రీం

**ఇటువంటి నియామకాల్లో రాజకీయ పార్టీల సమ్మతి పొందాల్సిన అవసరం లేదు**
**లెక్కింపు పర్యవేక్షకుడు, లెక్కింపు సహాయకుడు కేంద్ర ప్రభుత్వానికి చెందినవారై**
**ఉండవచ్చు లేదా రాష్ట్ర ప్రభుత్వానికి చెందినవారై ఉండవచ్చు అనే వెసులుబాటు ఉంది**
**ఈ నోటిఫికేషన్ నిబంధనలకు విరుద్ధమని మేము నిర్ధారించలేం : జస్టిస్ బాగ్చి**

*రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి సమక్షంలోనే ఓట్ల లెక్కింపు జరుగుతుందని న్యాయస్థానానికి హామీ ఇస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వ నామినీ అక్కడ ఉంటారని మేం చెబుతున్నాం. ఇదంతా జరగకముందే ఆ నిబంధన పాటిస్తారని ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు కోర్టుకి చెప్పారు. కాగా ఈసీఐ జారీ చేసిన సర్క్యులర్‌ను అక్షర స్ఫూర్తితో పాటించాలన్న నాయుడు విజ్ఞప్తిని మేం నమోదు చేస్తున్నామని సుప్రీం కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొన్నం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇద్దరూ ప్రభుత్వ అధికారుల విస్తృత వర్గంలోకి వస్తారని, కేవలం ఒక వర్గం నుంచే అధికారులను ఎంపిక చేయడాన్ని చట్టవిరుద్ధం అనలేమన్న సుప్రీం.*

**న్యూఢిల్లీ, మే 2 (వుదయం) :** పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల లెక్కింపు పరిశీలకుల నియామకాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శనివారం కొట్టివేసింది. అధికారులను ఎంపిక చేసే అధికారం ఎన్నికల సంఘానికి (ఈసీ) ఉందని కోర్టు పేర్కొంది. టీఎంసీ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ఈ ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేశారు. తమ పార్టీకిసకాలంలో సమాచారం ఇవ్వలేదని, ఇప్పటికే మైక్రో–అబ్జర్వర్లు ఉన్నప్పుడు అదనపు కేంద్ర ప్రభుత్వ అధికారుల అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సంఘం (ఈసీ) జారీ చేసిన సర్క్యులరే రాష్ట్ర ప్రభుత్వ అధికారుల భాగస్వామ్యాన్ని నిర్దేశించిందని, కానీ అటువంటి నియామకాలేవీ జరగలేదని సిబల్ వాదించారు. వాదనలకు స్పందిస్తూ, న్యాయమూర్తులు పి.ఎస్. నరసింహ, జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం, ఇటువంటి నియామకాల విషయంలో రాజకీయ పార్టీల సమ్మతి పొందాల్సిన అవసరం లేదని, నిబంధనల ప్రకారం అధికారులను ఎంపిక చేసే అధికారం ఈసీకి ఉందని పేర్కొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇద్దరూ ప్రభుత్వ అధికారుల విస్తృత వర్గంలోకి వస్తారని, కేవలం ఒక వర్గం నుంచే అధికారులను ఎంపిక చేయడాన్ని చట్టవిరుద్ధం అనలేమని కోర్టు వ్యాఖ్యానించింది. లెక్కింపు పర్యవేక్షకుడు, లెక్కింపు సహాయకుడు కేంద్ర ప్రభుత్వానికి చెందినవారై ఉండవచ్చు లేదా రాష్ట్ర ప్రభుత్వానికి చెందినవారై ఉండవచ్చు అనే వెసులుబాటు ఉంది. కనుక, అటువంటి వెసులుబాటు ఉన్నప్పుడు, ఈ నోటిఫికేషన్ నిబంధనలకు విరుద్ధమని మేము నిర్ధారించలేమని జస్టిస్ బాగ్చి పేర్కొన్నారు. వారిద్దరూ కేంద్రానికి చెందినవారేనని కూడా వారు చెప్పవచ్చు. కేవలం ఒకే సమూహం నుంచి ఎంపిక చేసుకోవడాన్ని తప్పుగా పరిగణించలేమని ఆయన అన్నారు.

మిగతా 2లో

**బెంగాల్ ఓట్ల లెక్కింపునకు అదనపు పరిశీలకులు**

భద్రతను కట్టుదిట్టం చేసిన ఈసిఐ ● 165 నియోజకవర్గాలకు అదనపు లెక్కింపు పరిశీలకులు
క్యూఆర్ కోడ్ ప్రవేశం, లెక్కింపు హాళ్లలో మొబైల్ నిషేధం

5

# విద్య వైద్యం ఫ్రీగా ఇవ్వకుంటే రాళ్లతో కొట్టండి

- **మా నాన్న కేసీఆర్‌ను తిట్టలేదు**
- **బీఆర్ఎస్ అధ్యక్షుడిని విమర్శించా**
- **వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించుతాం**
- **మీట్ ది ప్రెస్ లో టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్, మే 2 (ఎఎంఎస్) :** విద్య వైద్యం ఫ్రీగా ఇవ్వకుంటే రాళ్లతో కొట్టాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తాము ఇచ్చిన పాంచజన్యంలో పేర్కొన్న ఐదు అంశాలను అమలు చేయకుంటే గన్ పార్క్ లోని అమరుల స్థూపం స్తంభానికి కట్టేసి కొట్టాలని సూచించారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పాల్గొని జర్నలిస్ట్ లు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానాలు చెప్పారు. తన తండ్రి కేసీఆర్ తో తనకు పంచాయితీ లేదని బీఆర్ఎస్ అధ్యక్షుడిగానే ఆయనను విమర్శించానని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు వచ్చిన సరే తెలంగాణ ప్రజల కోసం తాను ముందుకే వెళ్తానన్నారు. తన టార్గెట్ సర్వోదయ తెలంగాణ సాధించటమేనని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలకు ఎవరైతే విలనో...తనకు కూడా వాళ్లే విలన్ అని చెప్పారు. కేసీఆర్ ను రాజకీయ నేతగానే విమర్శించానని తండ్రిగా ఆయనతో ఎలాంటి సమస్య లేదని చెప్పారు.

**రాళ్లతో కొట్టండి..** తెలంగాణ రక్షణ సేన ప్రకటించిన పాంచజన్యం లోని ఐదు అంశాలు, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాల విషయంలో తాను ఇచ్చిన మాట తప్పితే అమరవీరుల

మిగతా 2లో



## వ్యవసాయంలో టీజీ ఆర్గానిక్స్ విప్లవం

సేంద్రియ ఉత్పత్తుల క్రయవిక్రయాల కోసం ప్రత్యేక మొబైల్ యాప్
రేపు తాండూరులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ఆవిష్కరణ

2

## అమెరికాతో మరోసారి యుద్ధానికి సిద్ధమవుతున్న ఇరాన్

**అమెరికాపై ఇరాన్ అనుమానాలు**
**అమెరికాతో మళ్లీ యుద్ధం జరిగే అవకాశం ఉందంటున్న ఇరాన్**
**అమెరికా ఏ ఒప్పందాలకు, వాగ్దానాలకు కట్టుబడి ఉండటం లేదని ఆరోపణ**
**శత్రుదేశాలు చేసే ఎలాంటి దాడినైనా ఎదుర్కొంటామన్న ఇరాన్ సైనికాధికారి**

5

## ఛత్తీస్‌గఢ్ కాంకేర్ జిల్లాలో ఐఈడీ పేలుడు ముగ్గురు జవాన్ల మృతి

●మందుపాతరల తొలగింపు ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఈ దుర్ఘటన ●మావోయిస్టులు గతంలో అమర్చిన బాంబుని అనుమానించిన పోలీసులు ●రాష్ట్రాన్ని మావోయిస్టు రహితంగా ప్రకటించాక తొలి పేలుడు ●ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు మరణించగా, మరొకరికి గాయాలు

2

# మద్యం ధరలకు రెక్కలు

## పది రోజుల్లో లిక్కర్ ధరల పెంపు?

- భారీగా పెరగనున్న లిక్కర్ ధరలు
- రంగం సిద్ధం చేసిన సర్కార్
- మందుబాబులకు మరింత చిల్లు
- డిస్టలరీల ఒత్తిళ్లు, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం నేపథ్యంలో నిర్ణయం
- బీర్ల అమ్మకాల్లో 30 శాతం పెరుగుదల
- చివరగా 2023 మే నెలలో ధరలు పెంపు



**హైదరాబాద్, మే 02 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో మద్యం ధరలు పెంచేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఏడాది నుంచి డిస్టలరీల నుంచి వస్తున్న ఒత్తిళ్లు, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మరో పది రోజుల్లో లిక్కర్ ధరల పెంపుపై అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే.. ప్రీమియం బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై రూ.వంద వరకు పెరిగే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ వర్గాల సమాచారం. సాధారణంగా ప్రతి రెండేళ్లకోసారి ధరలను సవరించే ఆనవాయితీ ఉండగా.. 2023 మే నెలలో గత ప్రభుత్వం ధరలు పెంచింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు కంపెనీల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది.పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడం మద్యం తయారీపై తీవ్ర ప్రభావం చూపింది.

మిగతా 2లో

## వరుణుడు కరుణించినా ఉక్కపోత తప్పదా?

- **మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం**
- **ఏపి, తెలంగాణలో ఉరుములు, మెరుపుల వానలు**
- **వర్షాలతో తాత్కాలికంగా కొంత చల్లబడినా గరిష్ట ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండబోదు: వాతావరణ శాఖ**

**హైదరాబాద్, మే 2 (ఎఎంఎస్) :** మండుతోన్న ఎండలు.. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. వచ్చే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఉత్తర–దక్షిణ ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన జల్లులు పడతాయని, ముఖ్యంగా ఉత్తర కోస్తాలో గంటకు 50–60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

మిగతా 2లో

# ఫోన్లకు నమూనా సందేశం

భారత్ అత్యవసర హెచ్చరిక వ్యవస్థను పరీక్షించిన భారత్

హెచ్చరిక అందిన వెంటనే భయపడవద్దు : ప్రజలకు అధికారుల విన్నపం

ఏదైనా విపత్తు సంభవించినప్పుడు, హెచ్చరికలను తక్షణమే జారీ చేయడం ద్వారా పౌరులను అప్రమత్త చేయడం, వాస్తవ విపత్తు సమయంలో కీలక సమాచారాన్ని సకాలంలో వ్యాప్తి చేయడం, సమాచార ప్రసార వ్యవస్థల సంసిద్ధతను మెరుగుపరచడం దీని ఉద్దేశ్యం



**న్యూఢిల్లీ, మే 2 (వుదయం) :** భారత ప్రభుత్వం దేశవ్యాప్త సెల్ బ్రాడ్‌కాస్ట్ ఎమెర్జెన్సీ అలెర్ట్ సిస్టమ్ ( అత్యవసర అప్రమత్తత వ్యవస్థ)ను శనివారం పరీక్షించింది. ఈ క్రమంలో పౌరులకు వారి ఫోన్లపై అత్యంత తీవ్రమైన అలెర్ట్ సందేశం వచ్చింది. ఇది ఒక పరీక్ష మాత్రమే. ఏదైనా విపత్తు సంభవించినప్పుడు, హెచ్చరికలను తక్షణమే జారీ చేయడం ద్వారా పౌరులను అప్రమత్త చేయడం దీని లక్ష్యం.

మిగతా 2లో

# ఉక్కపోత తప్పదా?

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో నేడు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, సోమవారం నాటికి వీటి ప్రభావం మరికొన్ని ప్రాంతాలకు విస్తరించవచ్చని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. అటు ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర కోస్తా, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో కూడా వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ వర్షాలతో తాత్కాలికంగా కొంత చల్లబడినప్పటికీ, గరిష్ట ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండబోదని, ఉక్కపోత, వేడి వాతావరణం యథావిధిగా కొనసాగుతుందని వెదర్ రిపోర్ట్ స్పష్టం చేసింది.

## అధికారులను ఎంపిక చేసే
# అధికారం ఈసీకి ఉంది

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి సమక్షంలోనే ఓట్ల లెక్కింపు జరుగుతుందని సర్వోన్నత న్యాయస్థానానికి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ నామినీ అక్కడ ఉంటారని మేం చెబుతున్నాం. ఇదంతా జరగకముందే ఆ నిబంధన పాటిస్తారు, అని నాయుడు అన్నారు. ఈ ఎస్ ఎల్‌పి విషయంలో ఇకపై ఎటువంటి అదనపు ఆదేశాలూ అవసరం లేదు. ఈసీఐ జారీ చేసిన సర్క్యులర్‌ను అక్షర స్ఫూర్తితో పాటించాలన్న నాయుడు విజ్ఞప్తిని మేం నమోదు చేస్తున్నామని సుప్రీం కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు బార్ అండ్ బెంచ్ నివేదిక తెలిపింది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ అధికారులను మాత్రమే నియమించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయానికి వ్యతిరేకంగా టిఎంసి సుప్రీం కోర్టును ఆశ్రయించింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఓట్ల లెక్కింపు సోమవారం, మే 4న జరగనుంది.

# మద్యం ధరలకు రెక్కలు

మొదటి పేజీ తరువాయి

బాటిళ్ల తయారీకి వినియోగించే గ్యాస్ ధరలు, ముడి సరుకుల రవాణా ఖర్చులు పెరగడంతో లిక్కర్ కంపెనీలు గతేడాది మే నుంచే ధరల సవరణ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. ప్రభుత్వం అప్పట్లో ధరల పెంపును నిలిపివేసినప్పటికీ.. ఇప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో ధరల నిర్ధారణ కమిటీని రంగంలోకి దించింది. ముగ్గురు సభ్యులతో కూడిన ఈ కమిటీ వచ్చే వారం తొలిసారి సమావేశమై.. కంపెనీల ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించనుంది. ఇదిలా ఉండగా ధరలు విపరీతంగా పెంచితే సామాన్యుల నుంచి వ్యతిరేకత రావడమే కాకుండా.. గ్రామాల్లో గుడుంబా తయారీ పెరిగే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. అందుకే ప్రభుత్వం మధ్యేమార్గంగా ధరలను నిర్ణయించాలని యోచిస్తోంది. ఎక్సైజ్ వర్గాల ప్రచారం ప్రకారం.. సాధారణ బ్రాండ్ల ఫుల్ బాటిల్‌పై రూ.60, ప్రీమియం బ్రాండ్లపై రూ.వంద, అంతకంటే పై స్థాయి బ్రాండ్లపై రూ.120 వరకు పెరిగే అవకాశం ఉంది. ఈ ధరల పెంపు ద్వారా నెలకు రూ.250 కోట్లు.. ఏడాదికి సుమారు రూ.3వేల కోట్ల అదనపు ఆదాయం ప్రభుత్వ ఖజానాకు సమకూరుతుందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

### బీర్ల అమ్మకాల్లో 30 శాతం పెరుగుదల

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరగడంతో మందుబాబులు చల్లదనం కోసం బీర్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా మార్చి నెలలో బీర్ల విక్రయాలు గత ఏడాదితో పోలిస్తే అసాధారణ వృద్ధిని నమోదు చేశాయి. ఎక్సైజ్ శాఖ గణాంకాల ప్రకారం.. గత ఏడాది మార్చితో పోలిస్తే ఈసారి బీర్ల అమ్మకాల్లో 30 శాతం పెరుగుదల కనిపించింది. కేవలం ఒక్క నెలలోనే రికార్డు స్థాయిలో 50.78 లక్షల కేసుల బీర్లు అమ్ముడుపోయాయి. మండుతున్న ఎండలు, ఐపీఎల్ సీజన్ వంటి కారణాలు ఈ స్థాయి విక్రయాలకు ప్రధాన కారణాలు అయి ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# వ్యవసాయంలో టీజీ ఆర్గానిక్స్ విప్లవం

**హైదరాబాద్, మే 02 (వుదయం ప్రతినిధి) :** వ్యవసాయ రంగంలో మరో విప్లవాత్మక మార్పునకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. దేశంలోనే మొదటిసారిగా సేంద్రియ ఉత్పత్తుల క్రయవిక్రయాల కోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తేవాలని నిర్ణయం తీసుకుంది. 'టీజీ ఆర్గానిక్స్' పేరుతో రూపొందించిన ఈ యాప్‌ను ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక – వ్యవసాయ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 4న వికారాబాద్ జిల్లా తాండూరులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించనున్నారు. నకిలీ సేంద్రియ ఉత్పత్తుల బెడదను నివారించి, వినియోగదారులకు స్వచ్ఛమైన ఆహారాన్ని, రైతులకు గిట్టుబాటు ధరను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ ఈ వేదికను సిద్ధం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో సేంద్రియ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. జనవరి 2026 నాటికి సుమారు 10 వేల మంది రైతులు, 24 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కలిసి 50 వేల ఎకరాల్లో రసాయన రహిత సాగు చేస్తున్నారు. అయితే ప్రత్యేక మార్కెటింగ్ సౌకర్యాలు లేక రైతులు దళారులపై ఆధారపడటం లేదా దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. మరోవైపు మార్కెట్‌లో సేంద్రియం పేరుతో నకిలీ ఉత్పత్తులు విక్రయిస్తూ సామాన్య ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా.. ప్రభుత్వమే నేరుగా రైతులను, వినియోగదారులను అనుసంధానించేలా ఈ యాప్‌ను రూపొందించింది.

**ఉత్పత్తులు, రైతుల సమాచారం..** టీజీ ఆర్గానిక్స్ యాప్‌లో ప్రారంభ దశలో ప్రభుత్వ ధ్రువీకరణ పొందిన 100 రకాల ఉత్పత్తులు, 500 మంది రైతుల సమగ్ర సమాచారాన్ని పొందుపరిచారు. వినియోగదారులు తమకు 50 కిలోమీటర్ల పరిధిలో ఉన్న రైతుల వివరాలు, వారి చిరునామా, మొబైల్ నంబర్, లొకేషన్‌ను యాప్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చు. ధర నిర్ణయించే పూర్తి అధికారాన్ని రైతుకే ఇవ్వడంతో మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. భవిష్యత్తులో మరిన్ని ఉత్పత్తులను, ఎక్కువ రైతులను ఈ వేదికపైకి తీసుకువచ్చి.. తెలంగాణను సేంద్రియ ఉత్పత్తుల హబ్‌గా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## హైకోర్టు ఉత్తర్వులకుగుణంగానే
# కూల్చివేతలు
### హైడ్రా కమిషనర్ రంగనాథ్



**హైదరాబాద్, మే 02, (వుదయం ప్రతినిధి) :** చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేతల విషయంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను పాటిస్తూనే ముందుకు వెళ్తున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్లను మాత్రమే తొలగిస్తుందని, పెద్దవారిని వదిలేస్తుందని వస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ఈ ప్రచారంలో వాస్తవం లేదని, చట్టప్రకారమే చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. హైడ్రా పేదల మీదకు వెళ్తుంది.. పెద్దోళ్లను వదిలేస్తుందన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఇలాంటి పుకార్లను ప్రజలు నమ్మొద్దని కోరారు. బతుకమ్మ కుంటలో అసలు చెరువు లేదంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఆయన స్పందించారు. బసర్వే ఆఫ్ ఇండియా రికార్డుల ప్రకారం అక్కడ 10 ఎకరాల చెరువు ఉన్నట్లు స్పష్టంగా ఉందని రంగనాథ్ వెల్లడించారు. వరదల నివారణకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకునేందుకు హైకోర్టు తమకు అనుమతి ఇచ్చిందని తెలిపారు.

## విద్య వైద్యం ఫ్రీగా ఇవ్వకుంటే
# రాళ్లతో కొట్టండి



మొదటి పేజీ తరువాయి

స్థూపం వద్ద స్తంభానికి కట్టేసి కొట్టాలని కల్వకుంట్ల కవిత తెలిపారు. అన్ని విషయాల్లో సాధ్యాసాధ్యాలను పరిశీలించిన తర్వాతే హామీలు ఇచ్చానని చెప్పారు. గత 20 ఏళ్లుగా తనను చూస్తున్నారని ఇచ్చిన మాట, పట్టిన తోవను విడవకుండా ఉన్నానని అన్నారు. తెలంగాణలో విద్య, వైద్యం కోసమే ప్రజలు 60 శాతం డబ్బు ఖర్చు చేయాల్సిన దుస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కచ్చితంగా సంకల్పం తీసుకుంటే ఇది సాధ్యమేనని చెప్పారు. ఆరోగ్య శ్రీ ప్రారంభినప్పుడు, విద్యార్థులకు ఫ్రీ మీల్స్ పెట్టినప్పుడు కూడా ఇది సాధ్యమా అంటూ చాలా ప్రశ్నలు వచ్చాయన్నారు. కానీ ఇప్పుడు వాటిని అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పాంచజన్యంలోని ఐదు అంశాలను అమలు చేయటంపై ఆర్థిక నిపుణులతో చర్చలు జరిపానని కవిత చెప్పారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో లక్ష కోట్ల రూపాయలను తమ ప్రాధాన్యత అంశాలకు ఖర్చు చేయవచ్చన్నారు. ఆ విధంగా చూస్తే చేయాలన్న సంకల్పం ఉంటే చాలు ఇదంతా సాధ్యమేనని స్పష్టం చేశారు. తల్లిలా తాను పరిణితి చెందుతానంటే చాలా మంది విమర్శలు చేశారని కవిత గుర్తు చేశారు. కానీ తల్లి మాదిరి లాలన లేని కారణంగానే ఇవ్వాళ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక తల్లి మాదిరిగా ఆలోచిస్తే మాత్రమే ప్రజలకు మేలు చేయాలన్న సంకల్పం వస్తుందన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వానికి అది చేతకావటం లేదన్నారు. వెయ్యి రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక తల్లి మాదిరి పాలన చేస్తామన్నారు.

### రాజకీయ నేత కేసీఆర్ పైనే నా విమర్శలు

ఇటీవల కేసీఆర్ పై కవిత చేసిన విమర్శలపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు ఆమె స్పష్టంగా సమాధానం ఇచ్చారు. తన విమర్శలు కేవలం బీఆర్ఎస్ అధినేత, రాజకీయ నేత అయిన కేసీఆర్ పైనేనని చెప్పారు. తండ్రిగా ఆయనతో తనకు ఎలాంటి సమస్య లేదన్నారు. సిద్ధాంతపరమైన విభేదాలతోనే విమర్శలు చేశానని...రాజకీయ తప్పులపై భవిష్యత్ లోనూ విమర్శలు చేస్తానని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎంతో చేయాల్సి ఉన్నప్పటికీ కేసీఆర్ అది చేయలేకపోయారన్నారు. కృష్ణా, గోదావరి నీళ్లను సరిగా వాడుకొని ఉంటే రైతుల చేతిలో రెండున్నర లక్షల కోట్లు ఉండేవని చెప్పారు. లక్షా 21 వేల కోట్లు కాళేశ్వరం, పాలమూరు కోసం ఖర్చు చేసి కేవలం లక్ష ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇచ్చారని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చే క్రమంలో పెట్టిన పరీక్షల్లో పదిసార్లు పేపర్ లీక్ అవటాన్ని ప్రస్తావించారు. కేటీఆర్ లాంటి తెలివైన ఐటీ మినిస్టర్ ఉండగా ఎందుకు పేపర్ లీకైందంటూ ప్రశ్నించారు. కేసీఆర్ చర్యల కారణంగా రెండు జనరేషన్లు నష్టపోయారన్నారు. లాస్ట్ ఆపర్చునిటీ కాస్ట్ అనే విషయంలో కేసీఆర్ చేసిన తప్పులను మాత్రమే ప్రశ్నించానని స్పష్టం చేశారు.

### పార్టీ పేరు విషయంలో వ్యూహం పాటించాం

తెలంగాణ రాష్ట్ర సేన అని ముందు ప్రకటించిన తర్వాత తెలంగాణ రక్షణ సేన గా పేరు మార్చుకోవటాన్ని జర్నలిస్టులు ప్రశ్నించారు. ఐతే తమ పార్టీ పేరు విషయంలో చాలా కుట్రలు జరిగాయని కవిత చెప్పారు. వాటిని గమనించిన తర్వాతే పార్టీ పేరు విషయంలో వ్యూహత్మకంగా వ్యవహరించామని అన్నారు. కావాలనే రకరకాల పేర్లను ప్రచారంలోకి తెచ్చామని చెప్పారు. ఐతే టీఆర్ఎస్ అనే పేరు రావటం మాత్రం సంతోషంగా ఉందన్నారు. టీఆర్ఎస్ తనకు రాసిపెట్టి ఉండటం దైవ సంకల్పమేనని భావిస్తున్నానన్నారు. టీఆర్ఎస్ ఏర్పడిన కొత్తలో కూడ బస్సు, నాగలి గుర్తు అంటూ చాలా గందరగోళం జరిగిందని చెప్పారు. పార్టీ ఏర్పాటు చేసే క్రమంలో సాంకేతిక అంశాలు చాలా ఉంటాయన్నారు. వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు.

### విమర్శించే వాళ్లను పట్టించుకోం

కవిత పార్టీ ఏర్పాటును కాంగ్రెస్, బీజేపీ, సహా కేటీఆర్ తక్కువ చేసి మాట్లాడటంపై కవిత స్పందించారు. బీజేపీ నేతలు ముందు తెలంగాణకు మేలు చేసే పని చేయాలని సూచించారు. ఈ నెల 10 న రాష్ట్రానికి వస్తున్న మోడీని అడిగి పాలమూరు ప్రాజెక్ట్ కు జాతీయ హోదా తేవాలని, తెలంగాణకు ప్రత్యేకంగా నిధులు తేవాలని చెప్పారు. అది చేయకుండా తనను విమర్శిస్తే ఏమొస్తుందని ప్రశ్నించారు. సామాజిక న్యాయానికి బద్ధ విరోధి అయిన బీజేపీ, తెలంగాణకు అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీలు మాట్లాడే మాటలు పట్టించుకోనని చెప్పారు. ప్రజలకు మంచి చేసేందుకు పార్టీ పెట్టే ప్రయత్నం చేసేప్పుడు ఇలాంటి చాలా మాటలే వస్తాయన్నారు. అసలు ప్రజాస్వామ్యంలో పార్టీ ఉండటమే పవర్ అని చెప్పారు. పార్టీ అధికారంలోకి వస్తుందా లేదా అన్నది ఆ పార్టీ నడిపే వ్యక్తి సిన్సియారిటీని బట్టి ఉంటుందన్నారు. ఒక పార్టీ గురించి తక్కువ చేసి మాట్లాడుతున్న వాళ్లు వారి మాటలను ప్రజలు గమనిస్తారని గుర్తుంచుకోవాలని కేటీఆర్ ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ పెట్టినప్పుడు జెండా మోసే వాళ్లు కూడా లేరన్నారు. చిన్న పార్టీగా మొదలై వటవృక్షంలా టీడీపీ, బీఆర్ఎస్ లు ఎదిగాయని గుర్తుచేశారు. ఎవరెన్ని విమర్శలు చేసిన దాన్ని మేము మనసు మీదకు తీసుకోమని చెప్పారు. తెలంగాణ ప్రజల సమస్యలపై పోరాటమే తమ లక్ష్యమని చెప్పారు.

### తెలంగాణ కు విలన్ ఎవరో నాకు వాళ్లే విలన్

తన టార్గెట్ సర్వోదయ తెలంగాణ అని కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ తనకు టార్గెట్ కాదన్నారు. తెలంగాణకు ఎవరు విలన్ ఉంటే తనకు వాళ్లే విలన్ అని చెప్పారు. తన పర్సనల్ అజెండాను ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లనని స్పష్టం చేశారు. తాను ఎన్నో కష్టాలు పడ్డానని చెప్పారు. పర్సనల్ కష్టాలు, రాజకీయ కష్టాలు ఉన్నాయన్నారు. రాజకీయ కష్టాలను మాత్రమే ప్రజలకు చెబుతానని అన్నారు. తన వెనుక ఎవరు లేరని మరోసారి తేల్చిచెప్పారు. నిప్పుల నుంచి నడిచి వచ్చిన తనకు ప్రపంచాన్ని ఎదుర్కొనే శక్తి ఉందని తేల్చిచెప్పారు.

### పురుషుల కన్నా గొప్పగా నడుపుతాం

తమ పార్టీని పురుషులు నడిపే పార్టీ కన్నా గొప్పగా నడుపుతామని కవిత చెప్పారు. దేశంలో ఎంతో మంది మహిళలు సమర్థవంతంగా పరిపాలించారని గుర్తు చేశారు. వారి స్ఫూర్తితో పార్టీని నడుపుతామన్నారు. తమ పార్టీలో కచ్చితంగా మహిళలకు ప్రాధాన్యం ఉంటుందని కవిత చెప్పారు. మహిళ బిల్లు పాసైన కాకపోయిన సరే తాము మాత్రం 33 శాతం సీట్లు మహిళలకు కేటాయిస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేసే ముందు కనీసం వివరణ అడగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఆరోపణలు ఎదుర్కొంటోన్న రోహిత్ రెడ్డి కి మాత్రం షోకాజ్ నోటీసులు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజా క్షేత్రంలో ఉండాలని భావించే తనకు బీజేపీ డీఎన్ఏ తో సరిపోలదన్నారు. తెలంగాణకు అన్యాయం చేసేంది కాంగ్రెస్ అని చెప్పారు. అలాంటి పార్టీల్లో ఉండలేనని చెప్పారు. బిఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయ్యాక ప్రజల మధ్యలో ఉండాలనే ఉద్దేశంతోనే పార్టీ పెట్టానని స్పష్టం చేశారు. అభివృద్ధి, సామాజిక న్యాయం జోడెద్దులుగా తాము ముందుకు వెళ్తామన్నారు.

### అన్ని రాష్ట్రాలకు ఈక్వల్ పవర్ ఉండాలి

తమ పార్టీ భావసారూప్యం గల పార్టీలతో ప్రీ పోల్స్ అలయెన్స్ పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తే అందుకు సిద్ధంగా ఉందన్నారు. ఐతే భావ సారూప్యం లేని వారితో మాత్రం పొత్తులు పెట్టుకునేది లేదన్నారు. పోస్ట్ పోల్ అలయెన్స్ అవసరం ఉంటుందని భావించటం లేదన్నారు. తెలంగాణ ప్రజలకు తమకు పూర్తి స్థాయిలో మెజార్టీ ఇస్తారని భావిస్తున్నానని కవిత చెప్పారు. ప్రస్తుతం తమ దృష్టి అంత కూడా తెలంగాణ రాజకీయాలపైనే ఉందన్నారు. జాతీయ అంశాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే స్పందిస్తామని చెప్పారు. డీలిమిటేషన్ విషయంలో తమకు స్పష్టమైన వైఖరి ఉందని చెప్పారు. అమెరికాలో సెనేట్ కు ఉన్న పవర్స్ మాదిరిగా రాష్ట్రాలకు పవర్ ఇవ్వాలన్నారు. ప్పారు.

### మాజీ మావోయిస్టులు పార్టీల్లో చేరాలి

సొంత ప్రజలను డెడ్ లైన్ పెట్టి చంపుతున్నది కేంద్ర ప్రభుత్వమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం చేపట్టిన దుర్మార్గాన్ని ముందుగా ఖండించింది తనేనని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులు ఏదో ఒక పార్టీలో చేరాలని కోరారు. తెలంగాణ రక్షణ సేన వారికి స్వాగతం పలుకుతుందన్నారు. ఇష్యూ బేస్డ్ గా పాదయాత్ర చేస్తామని చెప్పారు. జర్నలిస్టులు, మైనార్టీలు, బీసీ అన్ని వర్గాల కోసం పోరాటం చేస్తామని కవిత చెప్పారు.

### ప్రజలు కొత్తదనాన్ని ఆదరిస్తారు

ప్రజల కోసం ముందుకు వస్తున్న తమకు కచ్చితంగా ప్రజల ఆదరణ ఉంటుందని కవిత ధీమా వ్యక్తం చేశారు. ఐతే తన నడవడిక, ఆచరణ చూశాక ప్రజలు తనను నమ్ముతారని తెలుసన్నారు. ఐతే గతంలో కొత్తదనాన్ని ఆహ్వానించిన చరిత్ర ఈ నేలకు ఉందన్నారు.

# ఫోన్లకు నమూనా సందేశం

మొదటి పేజీ తరువాయి

ఈ పరీక్ష అన్ని సరిహద్దు ప్రాంతాలు, ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ పరీక్ష జరిగింది. ఈ సందర్భంగా పౌరులకు వారి ఫోన్లపై పెద్ద శబ్దం లేదా వైబ్రేషన్‌తో అలర్ట్ నోటిఫికేషన్లు వచ్చాయి. ఈ వ్యవస్థ ప్రభావాన్ని పరీక్షించడం కోసం ఈ వ్యాయామాన్ని చేపడుతున్నట్టు అధికారులు ఇంతకు ముందు తెలిపారు. వాస్తవ విపత్తు సమయంలో కీలక సమాచారాన్ని సకాలంలో వ్యాప్తి చేయడం, సమాచార ప్రసార వ్యవస్థల సంసిద్ధతను మెరుగుపరచడం దీని ఉద్దేశ్యం. హెచ్చరిక అందిన వెంటనే భయపడవద్దని అధికారులు ప్రజలను కోరారు. దేశవ్యాప్తంగా విపత్తు సమాచార వ్యవస్థలను బలోపేతం చేసేందుకు, టెలికమ్యూనికేషన్ల శాఖ, జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ భాగస్వామ్యంతో మొబైల్ అలర్ట్ డ్రిల్స్‌ను నిర్వహించింది. పీఐబీ నివేదిక ప్రకారం, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ రూపొందించిన 'సాచెట్' ఇంటిగ్రేటెడ్ అలర్ట్ సిస్టమ్ ద్వారా ఈ హెచ్చరికలు పంపుతున్నారు. ఈ వ్యవస్థ ద్వారా అధికారులు భౌగోళికంగా నిర్దిష్ట ప్రాంతాల వారీగా అత్యవసర సందేశాలను మొబైల్ వినియోగదారులకు ఎస్ఎంఎస్‌ల ద్వారా పంపగలరు. ఈ వ్యవస్థ ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో పనిచేస్తోంది. పరీక్షా దశలో, సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్‌లు ఎనేబుల్ చేసిన మొబైల్ పరికరాలలో ప్రజలు ఇంగ్లీష్, హిందీ, ప్రాంతీయ భాషలలో పరీక్షా సందేశాలను అందుకోవచ్చు. అన్ని నెట్‌వర్క్‌లలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుందని నిర్ధారించుకునే ప్రక్రియలో భాగంగా, వినియోగదారులు ఒకటి కంటే ఎక్కువ అలర్ట్‌లను అందుకోవచ్చు. విజయవంతంగా పరీక్షించిన తర్వాత, వినియోగదారులకు హెచ్చరికలను సమర్థవంతంగా చేరవేసేందుకు, టెస్ట్ ఛానెల్‌లతో సంబంధం లేకుండా అన్ని మొబైల్ హ్యాండ్‌సెట్‌లలో బహుళ భారతీయ భాషలలో హెచ్చరికలను ప్రకటించడానికి సిబిని ఉపయోగిస్తారు.

# కలలు కను.. అనవసర కబుర్లు చెప్పకు

**కవితకు ఎమ్మెల్యే దానం హితవు**

**నీది స్వార్ధ రాజకీయం**

**తండ్రిని, ఇంటి సమస్యలను**

**వీధిలోకి తీసుకురావడం సరికాదు**

**చురుగ్గా ఉండాల్సిన కేసీఆర్‌ను నీ మాటలతో మానసికంగా బలహీనపరుస్తున్నవ్**

**కేసీఆర్ ఓ మాస్ లీడర్**

**ప్రజల్లోకి ఎప్పుడు రావాలో**

**ఆయనకు బాగా తెలుసు**



**హైదరాబాద్, మే 02 (వుదయం ప్రతినిధి) :** కవిత కలలు కనొచ్చు కానీ అనవసరమైన కబుర్లు చెప్పడం మానుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హితవుపలికారు. కవిత తన రాజకీయ స్వార్థం కోసం తండ్రిని, ఇంటి సమస్యలను వీధిలోకి తీసుకురావడం సరికాదని సూచించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ ప్రస్థానం, కుటుంబ వ్యవహారాలపై కవిత చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా ప్రత్యర్థులను విమర్శించడం తప్పుకాదన్నారు. కానీ పదే పదే సొంత తండ్రిని టార్గెట్ చేస్తూ మాట్లాడటం తగదని ఆయన పేర్కొన్నారు. మరో పదేళ్ల పాటు ఆరోగ్యంగా, చురుగ్గా ఉండాల్సిన కేసీఆర్‌ను కవిత తన మాటలతో మానసికంగా బలహీనపరుస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ఒక మాస్ లీడర్ అన్నారు. ప్రజల్లోకి ఎప్పుడు రావాలో ఆయనకు బాగా తెలుసని దానం వ్యాఖ్యానించారు. సందర్భాన్ని బట్టి ఆయన తప్పకుండా బయటకు వస్తారని చెప్పారు. ఈ విషయంలో కవిత అనవసర ఆందోళన వ్యక్తం చేయాల్సిన పనిలేదని అన్నారు. బీఆర్ఎస్ నేతలకు ఈ మధ్య కాలంలో ఆందోళన ఎక్కువైందన్నారు. అందుకే ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడిన వారే ఇప్పుడు తిరిగి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని దానం నాగేందర్ అన్నారు. ట్యాపింగ్ చేసిన వారే నీతులు చెప్తుంటే నవ్వు వస్తోందని ఎద్దేవా చేశారు. ఎవరినీ వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని దానం స్పష్టం చేశారు. రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం ఉన్నప్పటికీ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తూ ముందుకు వెళ్తోందని వివరించారు. సంక్షేమ పథకాల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన పునరుద్ఘాటించారు.

# పూడిక తీతతో జలాశయాలు నింపాలి

**చెరువుల పునరుద్ధరణకు జిల్లా**

**స్థాయిలో కమిటీల ఏర్పాటు ఆవశ్యకత ఉంది**

**చెరువుల అక్రమణలపై సర్కార్ ఉక్కుపాదం**

**తక్షణమే ఎఫ్.టి.ఎల్ లెవల్ ను గుర్తించాలి**

**జూరాల,మూసి ప్రాజెక్టుల పూడిక తీతకు**

**ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

**చిన్న నీటిపారుదల చెరువుల పై**

**ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, మే 02 (వుదయం ప్రతినిధి) :** వేసవికాలంలో రాష్ట్ర వ్యాప్తంగా పూడికతీత పనులు చేపట్టి చిన్న తరహా చెరువులన్నింటిని పునరుద్ధరించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పూడికతీత తో పునరుద్ధరించిన చెరువుల్లో వచ్చే వర్షాకాలంలో జలాశయాలతో కళకళలాడేలా చూడాలని ఆయన సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చిన్ననీటి పారుదల చెరువులపై సీనియర్ కాంగ్రెస్ నేత తెలంగాణా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ అధ్యక్షుడు యం.కోదండ రెడ్డి ఆధ్వర్యంలో రూపొంచిన నివేదిక అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ నివేదికను తదుపరి చర్యల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పంపనున్నట్లు ఆయన వెల్లడించారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల పూడికతీత పనులపై ఎర్రమంజిల్ కాలనీలోని నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖాధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పూడికతీత పనులు చేపట్టి చెరువులు పునరుద్ధరణకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీల ఆవశ్యకతను ఆయన వివరించారు.కొత్తగా ఏర్పాటు చేసే కమిటీలు సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా విధి విధానాలు రూపొంచాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా చెరువులు ఆక్రమణలకు గురైతే తక్షణమే చర్యలు చేపట్టి స్వాధీనం చేసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఐఈ విషయంలో అధికారులు కఠినంగా వ్యవరించాలన్నారు. దానితో పాటుగా ఎఫ్.టి.ఎల్ లెవల్ ను గుర్తించి సరిహద్దులు నిర్ణయించాలన్నారు.ఇందుకు గాను నీటిపారుదల శాఖాధికారులు రేవిన్యూ, వ్యవసాయ శాఖాధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. పూడిక తీతకు ఇప్పటికే మార్గదర్శకాలు ఉన్నందున తక్షణమే వాటిని అమలులోకి తీసుకొచ్చి పనులు ప్రారంభించేయాలన్నారు. జూరాల,మూసి ప్రాజెక్టుల పూడిక తీతకు సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే రూపొంచాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో ఐఈడీ పేలుడు, ముగ్గురు జవాన్ల మృతి

**వుదయం డెస్క్, మే 2 :** ఛత్తీస్‌గఢ్ మావోయిస్టు రహితమైనా, వారి ఆనవాళ్లు ఇంకా మిగిలే ఉన్నాయి. భద్రతా దళాలను నిలువరించేందుకు గతంలో మావోయిస్టులు పాతిన మందుపాతరలు ఇప్పుడు భద్రతా దళాలకు ప్రాణాంతకంగా మారుతున్నాయి. వాటి తొలిగింపు కోసం యత్నిస్తున్న వారి ప్రాణాలు బలి గొంటున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో గతంలో మావోయిస్టులు పాతిన శక్తిమంతమైన ఐఈడీ (ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్) పేలడంతో ముగ్గురు డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో జవాను తీవ్రంగా గాయపడ్డాడు. మందుపాతరలు తొలగించే ఆపరేషన్ నిర్వహిస్తుండగా శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, కాంకేర్–నారాయణ్‌పూర్ జిల్లాల సరిహద్దుల్లో భద్రతా బలగాలు డీమైనింగ్, ఏరియా డామినేషన్ ఆపరేషన్లు చేపట్టాయి. ఇందులో భాగంగా ఛోటే బేతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో డీఆర్‌జీ బృందం మావోయిస్టులు అమర్చిన బాంబులను గుర్తించి నిర్వీర్యం చేసే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో ఒక ఐఈడీ ఊహించని విధంగా పేలింది. ఈ పేలుడులో ఇన్‌స్పెక్టర్ సుఖ్‌రామ్ వట్టి, కానిస్టేబుల్ కృష్ణ కోమ్రా, కానిస్టేబుల్ సంజయ్ గఢ్‌పాలే అక్కడికక్కడే మృతి చెందారు. మరో కానిస్టేబుల్ పర్మానంద్ కోమ్రా తీవ్రంగా గాయపడగా, అతనికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పట్టిలింగం స్పందించారు. ఇటీవలి కాలంలో లొంగిపోయిన మావోయిస్టులు, నిఘా వర్గాల సమాచారంతో వందలాది ఐఈడీలను గుర్తించి నిర్వీర్యం చేశాం. కానీ, నేటి దురదృష్టకర ఘటనలో ఓ ఐఈడీని నిర్వీర్యం చేస్తున్న సమయంలో అది పేలింది అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ల కోసం డీఆర్‌జీ దళాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మార్చి 31న రాష్ట్రాన్ని సాయుధ మావోయిస్టు రహితంగా ప్రకటించిన తర్వాత ఇదే మొదటి పేలుడు కావడం గమనార్హం.

## ఇరాన్‌పై యుద్ధం చేయకుంటే
# పశ్చిమాసియా, యూరప్ ముక్కలయ్యేవి

మొదటి పేజీ తరువాయి

ఆ దేశ సైనిక సామర్థ్యం గణనీయంగా క్షీణించిందని పేర్కొన్నారు. తమ దాడుల ద్వారా ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయకుండా అడ్డుకున్నామని కూడా అన్నారు. ఫ్లోరిడాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పశ్చిమాసియా, యూరప్ దేశాలను తాము ఎలా కాపాడామో చెప్పుకొచ్చారు. ఇరాన్ అనే అందమైన దేశంలోకి వెళ్లి వారి వద్ద అణ్వాయుధాలు లేవని మనం నిర్ధారించుకోవాలని వ్యాఖ్యానించారు. బీ2 బాంబర్లతో వారిని అడ్డుకున్నట్లు చెప్పారు. అమెరికా అలా చేయకపోయి ఉంటే వారి వద్ద అణ్వాయుధాలు ఉండేవని, అప్పుడు ఇజ్రాయెల్, పశ్చిమాసియాతో సహా యూరప్ దేశాలు ముక్కలుగా పేలిపోయి ఉండేవని వ్యాఖ్యానించారు. తమ సైనిక చర్యతో ఇరాన్ నాశనమైందని అన్నారు. వారి వైమానిక, నౌకాదళాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయని అన్నారు. శాంతిచర్చలు తాను ఆశించినవిధంగా జరగడం లేదని అన్నారు. యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగాయని, యుద్ధం ఆగిపోతే తగ్గుతాయని పేర్కొన్నారు. ఇరాన్ తమతో ఒప్పందం చేసుకోవాలనుకుంటోందని కానీ వారి ప్రతిపాదన సంతృప్తికరంగా లేదని అన్నారు. ఇరాన్‌లో నాయకత్వం విచ్ఛిన్నం అయిందని, అక్కడ నాలుగైదు గ్రూపులు ఉన్నాయని, అందుకే ఒప్పందం విషయంలో గందరగోళం నెలకొందని అన్నారు.

## రేవంత్, ఉత్తమ్ కేసీఆర్ ను
# కాపాడుతున్నారు

**అందుకే కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ పై చర్యలు లేవు**

**ఇరిగేషన్ శాఖలో ఉద్యోగులు కేసీఆర్ కోవర్టులు**

**ఉత్తమ్ శాఖలో కాళేశ్వరం కంటే భారీ అవినీతి**

**నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్**



**హైదరాబాద్, మే 02 (వుదయం ప్రతినిధి) :** కాళేశ్వరం అవినీతిలో మాజీ సీఎం కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతున్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. కేసీఆర్ కోవర్ట్ అని ఆరోపించారు. ఇరిగేషన్ తర్వాత అత్యంత అవినీతి జరుగుతున్నది సివిల్ సప్లయ్స్ శాఖలోనే అని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కేసీఆర్ కోవర్టులనే ఉద్యోగులుగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం కంటే భారీ అవినీతి.. ఉత్తమ్ శాఖలో జరుగుతోందని ఆరోపించారు.

# ఉద్యోగుల పక్షపాతి కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి



ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం... మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత మాది అని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఉద్యోగుల పట్ల తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే తొలి నిర్ణయం తీసుకున్నామని, ప్రతి నెలా ఒకటో తేదీకే జీతాలు అందేలా చర్యలు చేపట్టామని వెల్లడించారు. గత రెండేళ్లలో రాష్ట్రంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు సీఎం వివరించారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని సీఎం పేర్కొన్నారు. వంద రోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల కోసం రూ.6 వేల కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనకు ఉపశమనం లభించే అవకాశం ఉంది. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పీఆర్సీ అంశంపై తక్షణమే నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు సీఎం వెల్లడించారు. ఆ నివేదిక ఆధారంగా పీఆర్సీపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. దీంతో ఉద్యోగుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ముఖ్యంగా పీఆర్సీ, హెల్త్ కార్డులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి అంశాలపై స్పష్టమైన హామీలు రావడంతో ఉద్యోగ సంఘాల నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు.



# గ్రేటర్ హైదరాబాద్



## మైనారిటీ అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



**కుత్బుల్లాపూర్, మే 2 (వుదయం ప్రతినిధి ):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం సందర్భంగా కొంపల్లి లోని కె.వి.ఆర్ ఫంక్షన్ హాల్‌లో సీఈఓ కాంతమ్మ అధ్యక్షతన నిర్వహించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నేరుగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని పేదలు, రైతులు, మహిళలు, యువత, మైనారిటీ వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రత్యేకంగా మైనారిటీ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని, మైనారిటీ యువతకు ఉచిత స్కూటీలు, మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు అందించడం ద్వారా వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ స్వావలంబన దిశగా ప్రభుత్వం ముందుకెళ్తోందని స్పష్టం చేశారు. ఈ పథకాలు మైనారిటీ కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఇప్పటివరకు మైనారిటీ మహిళలకు సుమారు 400 ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కుట్టుమిషన్లు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, వారి కుటుంబాల ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగుపరచడంలో కీలకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించడమే ప్రజా పాలన యొక్క ముఖ్య ఉద్దేశమని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, అన్ని శాఖల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## కొండ విశ్వేశ్వర్ రెడ్డికి వినతి

**చేవెళ్ల మే 2 (వుదయం) :** చేవెళ్ల మండల పరిధిలోని ఖానాపూర్ గేట్ వద్ద నేషనల్ హైవేపై అండర్‌పాస్‌తో పాటు రెండు వైపులా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు శనివారం నాంచేరి గ్రామ సర్పంచ్ అశోక్, బీజేపీ సీనియర్ నాయకులు జయశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి కి మరియు నేషనల్ హైవే అధికారులకు వినతిపత్రం సమర్పించారు.నాంచేరి, ఖానాపూర్, ఆలూరు గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను వివరించారు. రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలను దృష్టిలో పెట్టుకొని రైతులకు రాకపోకలు సులభం అయ్యేలా సర్వీస్ రోడ్లు అవసరమని పేర్కొన్నారు.అలాగే బస్ స్టాప్ వద్దకు చేరుకోవడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన సదుపాయాలు కల్పించాలని కోరారు.



ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, చేవెళ్ల మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు అత్తిలి అనంత్ రెడ్డి, నాయకులు మాణిక్యరెడ్డి, శరవలింగం, ఉమా శంకర్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిపై రక్షణ కోరుతూ వినతి

**హైదరాబాద్, ఏప్రిల్ 02 (వుదయం):** సురారం మెయిన్ రోడ్, 02 068/1/NR వద్ద ఉన్న నా వ్యక్తిగత ఆస్తికి సంబంధించిన ఒక ముఖ్యమైన విషయంలో మీ తక్షణ జోక్యం కోరుతూ ఈ వినతిని సమర్పిస్తున్నాను. పై పేర్కొన్న ఆస్తికి నేను చట్టబద్ధమైన యజమానిని. నా వద్ద రిజిస్ట్రే హో అన్ని చట్టబద్ధమైన పత్రాలు ఉన్నాయి. అవసరమైతే సంబంధిత అధికారులకు ధృవీకరణ కోసం అన్ని పత్రాలను సమర్పించడానికి నేను సిద్ధంగా ఉన్నాను.



అయితే, నా ఆస్తికి సంబంధించి ప్రస్తుతం నాకు తీవ్రమైన వేధింపులు మరియు అక్రమ ఒత్తిడి ఎదురవుతోంది. ఎమ్మెల్యే శ్రీ కే.పీ. వివేకానంద గారు కోంపల్లి / జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులపై ఒత్తిడి తెచ్చి, నా ఆస్తి అక్రమమని తప్పుడు ఆరోపణలు చేస్తూ, నా కాంపౌండ్ వాల్/ ఆస్తిని కూల్చివేయాలని ఆదేశిస్తున్నారని మీ దృష్టికి తీసుకువస్తున్నాను.

ఈ ఒత్తిడి కారణంగా, టౌన్ ప్లానింగ్ అధికారులు చట్టపరమైన విధానాలను పాటించకుండా బాహ్య ప్రభావానికి లోనై పనిచేస్తున్నారు. సరైన నోటీసు, విచారణ, పత్రాల పరిశీలన లేకుండా ఏదైనా కూల్చివేత చర్య తీసుకోవడం చట్టవిరుద్ధం మరియు నా కుటుంబానికి అపరిమిత నష్టం కలిగిస్తుంది. కాబట్టి, ఈ విషయంలో మీ తక్షణ జోక్యం చేసి క్రింది చర్యలు తీసుకోవాలని వినయపూర్వకంగా కోరుతున్నాను.

సరైన చట్టపరమైన ధృవీకరణ మరియు విధానం లేకుండా ఎటువంటి కూల్చివేత చర్యలు తీసుకోకూడదు. ఏ చర్యకు ముందు నా సేల్ డీడ్ మరియు ఇతర పత్రాలను పూర్తిగా పరిశీలించాలి. అధికారులు చట్టప్రకారం మాత్రమే వ్యవహరించేలా, బాహ్య ఒత్తిడికి లోబడకుండా ఆదేశాలు ఇవ్వాలి. నా ఆస్తి హక్కులను అక్రమ జోక్యం నుండి రక్షించాలి. స్థానిక అధికారులపై జరుగుతున్న ఒత్తిడిపై నిష్పాక్షిక విచారణ జరపాలి. మీ కార్యాలయానికి అవసరమైన అన్ని అసలు పత్రాలను సమర్పించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఈ విషయంలో నాకు తక్షణ రక్షణ మరియు న్యాయం కల్పించాలని వినయపూర్వకంగా కోరుతున్నాను.

## టీఎన్జీవో అధ్యక్షుడికి ఘన సన్మానం



**షాద్ నగర్, ఏప్రిల్ 02 (వుదయం):** టీఎన్జీవో షాద్‌నగర్ తాలూకా అధ్యక్షుడిగా ఎన్నికైన హెల్త్ ఎడ్యుకేటర్ జక్కుల శ్రీనివాసులకు సాయిబాబా కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 6వ వార్డు పరిధిలో గల సాయిబాబా కాలనీలోని శివాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాలనీవాసులు, పెద్దలు, యువకులు భారీ సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేశారు.

కార్యక్రమానికి కమిటీ అధ్యక్షుడు మంగ శంకర్ (ఎఎస్ ఎస్ జి) అధ్యక్షత వహించగా, సమన్వయకర్త డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి గ్రామ శ్రీనివాసులు సమగ్రంగా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమ ప్రారంభంలో అతిథులను ఆహ్వానించి, అనంతరం జక్కుల శ్రీనివాసులకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానం నిర్వహించారు.

ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, జక్కుల శ్రీనివాసులు తాలూకా అధ్యక్ష పదవికి అర్హుడని, ఆయనకు ఉన్న సేవాభావం, నిబద్ధత, ప్రజల పట్ల ఉన్న కట్టుబాటు ఆయనను ఈ స్థాయికి చేర్చాయని కొనియాడారు. ముఖ్యంగా సమన్వయకర్త డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు మాట్లాడుతూ, శ్రీనివాసులు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజలకు చేరువయ్యారని, ఉద్యోగులతో పాటు సాధారణ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని తెలిపారు.

కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఏ. ఆంజనేయులు గౌడ్, మాజీ అధ్యక్షులు బోర్వెల్ శ్రీరాములు గౌడ్, అమర్నాథ్ రెడ్డి, నాట్కో చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ న్యాయవాది బెన్నూరి చంద్రయ్య, టిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు 26వ వార్డు కౌన్సిలర్ బి శివ (ఎస్ పి), రామిరెడ్డి, డీసీఎం సుధాకర్ రెడ్డి, ఐటి రాజేష్‌కుమార్, గుంటి రమేష్, మందారం నరసింహులు, రిటైర్డ్ ఆర్టీసీ బాలస్వామి, రమణారెడ్డి, పురుషోత్తం రెడ్డి, క్యాషియర్ శ్రీశైలం, పోలీస్ రవి, విష్ణు (లడ్డు), సతీష్, కుమార్, అజయ్, బోల్ట్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి దీపాల ఏర్పాటు

**షాద్ నగర్, ఏప్రిల్ 02 (వుదయం):** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సౌకర్యార్థం మరో కీలక అభివృద్ధి కార్యక్రమం చేపట్టారు. 1వ మరియు 12వ, 13వ వార్డు పోలిమేర ప్రాంతంలో ఐమ్యాక్స్ వీధి దీపాలను ఏర్పాటు చేసే పనులు వర్కింగ్ ప్రెసిడెంట్ ముబారక్ అలీ ఖాన్ మరియు 12వ వార్డు కౌన్సిలర్ కల్యాంకర్ దిలీప్ ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల భద్రత మరియు సౌకర్యం దృష్ట్యా వీధి దీపాల ఏర్పాటు ఎంతో అవసరమని నాయకులు తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో చీకటి కారణంగా ఎదురయ్యే ఇబ్బందులను తొలగించేందుకు ఈ చర్యలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేస్తూ, తమ ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కొనసాగుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇలాంటి కార్యక్రమాలు మరింతగా చేపట్టాలని వారు కోరారు.

మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు.



## కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక

### గుమ్మడిదల మున్సిపాలిటీకి నలుగురు ఏకగ్రీవం



**గుమ్మడిదల, మే 02 (వుదయం):** గుమ్మడిదల మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఇందులో సద్ది విజయ భాస్కర్ రెడ్డి, మహమ్మద్ ఫయాజ్, లూజహన్, కాలమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లందరూ ఏకాభిప్రాయానికి రావడంతో ఎలాంటి పోటీ లేకుండానే ఈ ఎంపిక జరిగింది. ఎన్నికైన కొత్త సభ్యులకు మున్సిపల్ కమిషనర్ దశరథ్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కొత్త సభ్యులు కూడా తోడవడంతో మున్సిపాలిటీ అభివృద్ధిని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ సంధ్య రెడ్డితో పాటు పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కొత్త సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.


**దక్షిణ మధ్య రైల్వే**

మమ్మల్ని అనుసరించండి X @SCRailwayIndia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల యొక్క వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

**టెండరు నెం.జిటిఎల్-ఇఎం-08-2026-27 తేది: 30.04.2026** PUB/158

భారత రాష్ట్రపతి తరపున మరియు కొరకు వ్యవహరిస్తున్న సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/నిర్వహణ/ గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

టెండరు నెం.: జిటిఎల్-ఇఎం-08- 2026-27, పని పేరు: గుంతకల్ డివిజన్: 1. ఎఆర్‌టి గుంతకల్ కొరకు రూము యొక్క ఒపెన్ లైన్ నిర్మాణంలో విపత్తు నిర్వహణ రోలింగ్ స్టాక్ సదుపాయాలు అప్‌గ్రేడ్ చేయుట/ పెంపు/ కల్పించుట- విద్యుత్ ఏర్పాట్లు. 2. జిటి ఎల్ డివిజన్‌లో విపత్తు నిర్వహణ రోలింగ్ స్టాక్ సదుపాయాలు అప్‌గ్రేడ్ చేయుట/ పెంపు/కల్పించుట-విద్యుత్ ఏర్పాట్లు. సుమారు విలువ: (₹) 9,67,860.02

ముగింపు తేదీ మరియు సమయం: 21.05.2026న 15.00 గం.లు.

టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in నకు లాగాన్ కండి. టెండరుకు ఏదేని సవరణ ఉంటే ఆన్‌లైన్ మాత్రమే జారీ చేయబడును. టెండరు డాక్యుమెంట్‌ను ఉచితము గా టెండరుదారులు http:// www.ireps.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనగలరు.

గమనిక: ఇట్టి ఇ-టెండరులో పాల్గొనుటకు / బిడ్ చేయుటకు టెండరుదారు చెల్లుబాటయ్యే డిఎస్‌సి (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్) కలిగి ఉండాలి.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్వహణ, గుంతకల్**

**టెండరు నోటీసు నెం.జి/ఇ.29/టిఆర్./ టెండరు నోటీసు/07/2026-27, తేది :28.04.2026** PUB/159

భారత రాష్ట్రపతి తరపున మరియు కొరకు వ్యవహరిస్తున్న సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ట్రాక్షన్/గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

టెండరు నెం.: జిటిఎల్-టిఆర్‌డి-29-ఇటిఎన్ - 20-2026-27, పని పేరు: గుంతకల్ డివిజన్ : ట్రాక్షన్ సబ్‌స్టేషన్ల వద్ద పవర్ ఫ్యాక్టర్ యొక్క మెరుగుపర్చుట కొరకు పిఎస్‌ఐ మౌలికసదుపాయాలు మార్పు చేయుట. సుమారు విలువ : రూ. 2,75,54,024.00 ఇఎండి : రూ.5,51,100.00

టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 20.05.2026న 15.00 గం.లు.

గమనిక : 1. టెండరు డాక్యుమెంట్‌ను టెండరుదారులు ఉచితముగా www.ireps.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనగలరు. టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు https://www.ireps.gov.in నకు లాగాన్ కంది. ఏదేని సవరణ ఉంటే ఆన్‌లైన్ మాత్రమే జారీ చేయబడును.

**సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్**

**నెం.సిఎన్(జిఎస్)/61//ఎల్‌సి-249/ఆర్‌ఓబి జిఎన్‌టి, తేది : 30.04.2026** PUB/162

భారత రాష్ట్రపతి తరపున చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, (నిర్మాణం) దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు టెండరింగ్ యొక్క సింగిల్ ప్యాకెట్ సిస్టంలో దిగువ పనుల కొరకు ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 01 ఎన్ఐటి నెం.: టెండరు నెం.01-2026-2027-ఇ-జిఎస్-సిఎన్-బిజెడ్ఎ, పని పేరు: విద్యుత్ నిర్మాణం/బిజెడ్ఎ : -గుంటూరు డివిజన్ -గుంటూరు - తెనాలి సెక్షన్ యొక్క రైల్వే కి.మీ.22/10-11 వద్ద గుంటూరు టౌన్ పరిధిలో మరియు గుంటూరు జిల్లాలో గుంటూరు - హనుమాన్‌పాలెం రోడ్డు యొక్క కి.మీ.1/6 వద్ద ఎల్‌సి నెం.249 బదులుగా కొత్తగా నిర్మించిన ఆర్‌ఓబి కొరకు విద్యుత్ ఏర్పాట్లు మరియు 33కెవి/11కెవి హెచ్‌టి ఓవర్ హెడ్‌లైన్స్ మార్చుట/ఆధునీకరణ వివరాలు : అంచనా విలువ: రూ. 96,94,941.80 ఇఎండి : రూ.1,93,900.00 టెండరు డాక్యుమెంట్ ధర : లేదు, పూర్తి చేయు కాలం: 06 (ఆరు) నెలలు. ముగింపు తేది: 22.05.2026న 15.00 గం.లు.

1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కొరకు దయచేసి వెబ్‌సైట్ http://ireps.gov.in నకు లాగిన్‌కండి.

2) బిడ్ సెక్యూరిటీ/ఇఎండి IREPS లో ఈ-చెల్లింపు గేట్‌వే ద్వారా నగదు రూపంలో గానీ జమచేయవలెను లేదా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నుండి ఎఫ్ఏ & సిఏఓ/సి/ఎస్‌సి వారి పేరున బ్యాంకు గ్యారంటీ బాండుగా లేదా టెండరు డాక్యుమెంట్లలో పేర్కొన్న విధముగా సమర్పించాలి. బ్యాంక్ గ్యారంటీ బాండ్ అనుబంధం-VIA ప్రకారం ఉండాలి మరియు బిడ్ చెల్లుబాటు కాలం 120 రోజుల పైగా కాల వ్యవధి కొరకు చెల్లుబాటు కావాలి.

3) టెండరుదారు టెండరు ముగింపునకు 15 రోజుల కాలవ్యవధి అయిన టెండరు సమర్పించు కాలంలో వారి ఆఫరును ఆన్‌లైన్‌లో సమర్పించాలి.

4) టెండరుదారు టెండరు సమర్పించు కాల వ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును) కొరకు దయచేసి గమనించగలరు.

**చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ నిర్మాణం/ సికింద్రాబాద్**

**టెండరు ప్రకటన నెం.05/2026 తేది: 01.05.2026** PUB/163

**స్టోర్స్ ఐటంల సరఫరా ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

దిగువ తెలిపిన టెండర్లు ఆన్‌లైన్ ద్వారా ప్రకటించబడినవి. టెండరుదారులు వెబ్‌సైట్ www.ireps.gov.in దర్శించి మరియు వారి ఆఫర్లను ఆన్‌లైన్‌లో సమర్పించవలసినదిగా కోరడమైనది. టెండరు వివరణ, పరిమాణం, ఇఎండి, ఎస్‌డి లను వెబ్‌సైట్‌లో చూడగలరు. స్వయంగా సమర్పించిన ఆఫర్లు అంగీకరించబడవు. పోస్టుద్వారా పంపిన ఆఫర్లు అనుమతించబడవు. టెండరు గడువు తేదీన టెండరు ముగింపు సమయం 14.30 గం.లు. అన్ని దేశీయ ప్రతిపాదనల కొరకు ఇఎండి www.ireps.gov.in లో అందుబాటులో గల ఆన్‌లైన్ విధానంలో మాత్రమే అంగీకరించబడును.

| టెండరు నెం. | సంక్షిప్త వివరణ |
|---|---|
| 25264824 | ఫింగర్ కాంటాక్ట్ మరియు ఫ్లెక్సిబుల్ షంట్ అసెంబ్లీ |
| 29261087 | ఆయిల్ కూలింగ్ బ్లోయర్ కొరకు ఇంపెల్లర్ |
| 37255004ఎ | సిఎస్‌ఎన్‌యుబి 22ఆర్‌ఎఫ్‌టి యొక్క వేగన్ల కొరకు స్ప్రింగ్‌ల సెట్ |
| ఎస్‌సిఆర్ 26సిఎపి టిసిటిటి | క్యాపిటల్ స్పేర్స్ టంగ్‌స్టన్ కార్బైడ్ ట్యాంపింగ్ టూల్స్ (టిసిటిటి) యొక్క సరఫరా కొరకు ఆరో |
| 76261290 | ఐఆర్‌ఎస్-ఎం46-2020 తరగతి-VIనకు ఎంఐజి/ఎంఎజి వెల్డింగ్ ఫిల్లర్ వైర్ |
| 672450 15సి | 15 టన్నుల సామర్థ్యం గల ఐఒటి క్రేన్ డిజైన్ తయారీ సరఫరా మరియు అమర్చుట, పని చేయించుట |
| 6026 పిటి018 | టి-10070నకు 1 ఇన్ 16టి/ఓ/ పిఎస్‌సి స్లీపర్లు |
| 6026 పిటి023 | 02 సంవత్సరాల చెల్లుబాటుతో 6.2 మి.మీ సైజు యొక్క సిజిఆర్‌ఎస్‌52కెజి టి-8327 కొరకు ప్రైస్ ఏర్పాటు |
| 45261037 | సెట్ 1 & 2, రేటెడ్ ఓల్టేజ్ 1000వి ఎసి కొరకు కాంట్రాక్టర్ |
| 6026 పిటి024 | ఎండ్‌కట్ హెచ్‌విఎస్ లైనర్ల యొక్క వివిధ రకాల సేకరణ |
| 38265007 | కాస్ట్ స్టీల్ బోల్‌స్టర్ |

**గమనిక: టెండరు తెరచుట కొరకు గడువు తేదీలు**

క్ర.సం.01 తేది: 18.05.2026, క్ర.సం.02 నుండి 04 తేది: 22.0-05.2026, క్ర.సం. 05 తేది: 25.05.2026, క్ర.సం. 06 తేది: 26.05.2026, క్ర.సం. 07 తేది: 01.06.2026, క్ర.సం. 08 తేది: 02.06.2026, క్ర.సం. 09 తేది: 04.06.2026, క్ర.సం. 10 తేది: 08.06.2026, క్ర.సం. 11 తేది: 11.06.2026.

**సవరణ**

టెండరు ప్రకటన నెం.40 తేది: 24.04.2024, టెండరు నెం. 6026పిటి020, గడువు తేది: 26.05.2026 మరియు 66265800 కొరకు గడువు తేది :25.05.2026గా చదువుకొనగలరు.

పైన పేర్కొన్న టెండర్లే కాక రూ. 50 లక్షల పైన విలువగల ఇతర టెండర్లు కూడా కలవు. వివరాల కొరకు పై రైల్వే వెబ్‌సైట్ దర్శించవలెను.

**ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్/ సికింద్రాబాద్**

A181

తదుపరి టెండరు షరతులు/వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దయచేసి వెబ్‌సైట్ http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.


## రూ.147.84 కోట్ల చెక్కు పంపిణీ



**చేవెళ్ల, మే 2 (వుదయం) :** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని కేజీఆర్ గార్డెన్‌లో శనివారం నిర్వహించిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" నియోజకవర్గ స్థాయి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య మరియు మున్సిపల్ చైర్పర్సన్ దేవరి సమత వెంకట్ రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు .ఈ కార్యక్రమం అనంతరం ద్వారా మహిళా సంఘాలకు విడుదలైన రూ.147 కోట్ల 84 లక్షల 38 వేల విలువైన చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలు వంటి కీలక అంశాలపై చర్చలు జరిగాయి.

## నీటి సమస్యను పరిష్కరించాలి

### మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్



**బాచుపల్లి, మే 2 (వుదయం ప్రతినిధి):** నిజాంపేట్ సర్కిల్ పరిధిలో మంచి నీటి సమస్యను పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యంలో నిజాంపేట్ వాటర్ బోర్డు డీజీఎం వినాయక్ కు బాచుపల్లి సిపిఐ మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతు పేద ప్రజల దాహాన్ని తీర్చవలసిన అధికారులు సరైన సమయానికి మంచి నీళ్లు అందియక పోవడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేదల నోరు కొట్టి పెద్దలకు నీటి సరఫరా చేస్తున్నారని అన్నారు. నిజాంపేట్ సర్కిల్ లోని రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ ఇల్లులు, డబుల్ బెదురూమ్ లో తగినంత వాటర్ సప్లయ్ చేయడం లేదని సబ్ లైన్లు వేసి అన్ని కాలనీలకు సమానంగా నీళ్ల వచ్చే విధంగా చర్యలు తిసుకోవాలని, అలాగే వేసవి కాలంలో నీళ్ల ఇబ్బంది లేకుండా నీటి సమస్యను పరిష్కారం చేయవలసిందిగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఇందిరమ్మ కార్యదర్శి పొన్నకంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల డివిజన్‌లో ప్రజావాణి

### ప్రజల సమస్యలకు వేగవంత పరిష్కారం

**చేవెళ్ల మే 2 (వుదయం) :** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేవెళ్ల డివిజన్ పరిధిలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు "ప్రజావాణి" కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు చేవెళ్లలోని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కార్యాలయంలో జరుగుతుంది.ఈ కార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.డివిజన్ పరిధిలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు డిఎల్పిఓ, డీఎంహెచ్ఓ, ఎడిఏ, టీజీడిస్కం, ఆర్&బి, ఆర్‌డబ్ల్యూఎస్ఎస్, హౌసింగ్, సీడీపీఓ, ఏఎస్‌డీఓ, ఏటిడీఓ, ఏఎండబ్ల్యూఓ తదితరులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరిస్తారు.

ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నేరుగా సమర్పించుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభిస్తుంది. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపించి, 30 రోజుల్లోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు.అందువల్ల చేవెళ్ల డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలను తెలియజేయాలని అధికారులు కోరుతున్నారు.

## ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ

### ఉపాధ్యాయ సంఘాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎంఈఓ హామీ



**శంకర్‌పల్లి, మే 2 (వుదయం)** శంకర్‌పల్లి మండల నూతన మండల విద్యాధికారిగా (ఎంఈఓ) రవీందర్ రావు శనివారం విద్యాశాఖ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులతో పరిచయ సమావేశం నిర్వహించి మండలంలోని విద్యా పరిస్థితులపై ప్రాథమికంగా చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు నూతన ఎంఈఓ రవీందర్ రావును ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకో

కల్పన, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, విద్యార్థుల హాజరు వంటి అంశాలపై దృష్టి సారించాలని నాయకులు కోరారు. విద్యాశాఖ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొని నూతన ఎంఈఓకు అభినందనలు తెలిపారు.

అనంతరం ఎంఈఓ రవీందర్ రావు మాట్లాడుతూ మండల పరిధిలోని విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల సమస్యలను సమగ్రంగా తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల భద్రత, బోధన నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టి మండల విద్యా అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా

## స్వీయ ప్రజ్ఞతో వర్ధిల్లిన వర్ధిని

### డాక్టర్ పట్టా అందుకున్న ఈరని ప్రజ్ఞా వర్ధిని

**షాద్ నగర్, ఏప్రిల్ 02 (వుదయం):** గుర్రంపల్లి గ్రామానికి చెందిన ఈరని చెన్నయ్య ఈరని నవనీతల కూతురు ప్రజ్ఞ వర్ధిని షాద్ నగర్, ఏప్రిల్ 02 (వుదయం): అక్షరాలే ఆయుధంగా లక్ష్యం వైపు అడుగులు వేసింది.. అంకిత భావంతో చదివి అనుకున్న విజయ తీరాలకు చేరింది.. పల్లె సీమ నుంచి పట్టణం వైపు సాగి ఎంబిబిఎస్ పట్టా పుచ్చుకొని తన పల్లె వాసులు గర్వంగా తల ఎత్తుకునేలా చేసింది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం జిల్లేడు చౌదరిగుడా మండలం గుర్రంపల్లి గ్రామానికి చెందిన ఈరని చెన్నయ్య, ఈరని నవనీతల కూతురు ఈరని ప్రజ్ఞా వర్ధిని సాధించిన ఘనత ఇది.

**ఇలా చదువుల వైపు..**

గుర్రంపల్లి గ్రామానికి చెందిన ఈ యువతి 1 నుంచి 5వ తరగతి వరకు షాద్ నగర్ పట్టణంలోని ఠాగూర్ ఉన్నత పాఠశాలలో చదివింది. ఆ తరువాత ఆరు నుంచి పదవ తరగతి వరకు హైదరాబాదులోని గచ్చిబౌలి లో గల జవహర్ నవోదయ విద్యా సమితి లో పూర్తి చేసింది. ఇంటర్మీడియట్లో బైపిసి గ్రూప్ ఎంచుకొని హైదరాబాదులోని ఎస్ ఆర్ కాలేజీలో చదువు పూర్తి



ఎన్నికై గాంధీ మెడికల్ కళాశాలలో తన ఎంబిబిఎస్ సభను పూర్తి చేసింది. కార్యక్రమానికి హాజరైన ప్రముఖుల మధ్యన నిన్న రాత్రి డాక్టర్ పట్టా పుచ్చుకుంది. గ్రామీణ స్థాయి నుంచి ఒక్క అడుగు ముందుకు వేసుకుంటూ వెళ్లి తను అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్న యువతిని గ్రామస్తులు అభినందిస్తున్నారు. తమ గ్రామానికి మంచి పేరు తీసుకు వచ్చిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రజ్ఞా వర్ధిని స్పందిస్తూ తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, తనకు చదువు చెప్పిన గురువులు ఇచ్చిన ప్రోత్సాహంతోనే తాను అనుకున్న లక్ష్యాన్ని చేరగలిగానని చెప్తుంది. డాక్టర్ ప్రజ్ఞ వర్ధినినీ గుర్రంపల్లి గ్రామ సర్పంచ్ ఈరని జంగయ్య


**IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JDUGE. AT: HYDERABAD**
**O.S NO 1040 OF 2026**

**Between:**
Banda Gopal,
**...Plaintiff**

**AND**

The Tahsildar, Khairathabad Mandal,
Hyderabad District, Telangana State
All Concerned
**...Defendants**

TTo
All Concerned.
This is to inform to general public that the Plaintiff has filed suit for declaration to declare him as Legal Heir of his deceased Father and Mothers i.e. Declare the Plaintiff Nos. 1 as the Legal Heirs of Late Sri late. Devendar Banda passed away on.20.06.2020 and late Banda Vijayamma passed away on 14.11.2022 Sri late. Devendar Banda passed away on.20.06.2020 and late Banda Vijayamma passed away on 14.11.2022 respectively. As such general public are hereby informed you that if anybody having any objection kindly appear before the above Hon'ble Court on 11-05-2026 at 10.30 A.M. either in person or through advocate, failing which matter will be decided as per law.

***(BY ORDER OF THE COURT)***

**Sd/-**
**M/s B. Parshuram, K. Sandeep, T. Naresh & M. Sai Kiran**
**Advocates and Associates**
**Office at: H. No. 1-9-129/17/A/2, Ram Nagar, Hyderabad – 500 044.**
**Ph. No. 9701305487.**



"చట్టబద్ధ పాలనను సమర్థించిన గౌరవనీయ సుప్రీంకోర్టుకు, సకాలంలో, దృఢంగా జోక్యం చేసుకున్న అభిషేక్ సింఘ్వీకి, ఏఐసిసి న్యాయ విభాగానికి నా ధన్యవాదాలు. నాకు బెయిల్ లభించడం అనేది కేవలం ఒక వ్యక్తిగత విజయం, ఉపశమనమే కాదు, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంగా మనం కొనసాగినంత కాలం, రాజకీయ కక్ష సాధింపుల కోసం వ్యక్తిగత స్వేచ్ఛను బలిపెట్టలేమని, ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేసేవారికి ఇది ఒక హెచ్చరిక కూడా. అసత్యం ఎంత శక్తివంతంగా కనిపించినప్పటికీ, అంతిమంగా గెలిచేది సత్యమే. సత్యమేవ జయతే!"

* – పవన్ ఖేరా, కాంగ్రెస్ నాయకుడు

## వే'మన'పద్యం

అలను బుగ్గ పుట్టినప్పుడే క్షయమౌను
గలను గాంచులక్ష్మి గనుటలేదు
ఇలను భోగభాగ్య మీతీరు గాదొకో
విశ్వదాభిరామ వినురవేమ.



## సంపాదకీయం

# సామాన్యులతో క్రూర పరిహాసం!

కొండంత రాబందుకు ఆకలేస్తే ఒక వూరు వాడ చాలవు. అందుకే ప్రభుత్వాలు తమ ఆకలి తీర్చుకోడానికి సామాన్య జనం మీద పడతాయి. ప్రతి ఒక్కరి జేబు ఖాళీ చేస్తేగాని ఊరట చెందవు. 75–80 శాతం మంది ప్రజలు పేదలుగా ఉన్న దేశంలో తరచూ వారి జేబులు కొల్లగొట్టే దుర్మార్గం ఎంత మాత్రం హర్షించదగినది కాదు,బడ్జెట్ లోనూ బయట కూడా సామాన్యుల చాలీ చాలని రాబడి మీదనే గురిపెట్టడం ఎంత మాత్రం జనహిత పాలన కాబోదు. ఎన్నికలు ముగియగానే మోడీ ప్రభుత్వం ధరలు పెంచి తీరుతుందని ఇటీవల అదే పనిగా వెలువడిన రాజకీయ జోస్యాలకు అనుగుణంగానే అటం బాంబు వంటి నిర్ణయం ఊడిపడింది. వాణిజ్య అవసరాల గ్యాస్ సిలిండర్ ధరను ఉన్నపళంగా రూ 994 పెంచేశారు. ఎవరైనా ఎంత నిరంకుశ పాలకులైనా ఒకేసారి ఇంత పెద్ద ఎత్తున గ్యాస్ ధర ఎలా పెంచగలుగుతారు, ఇదేమైనా లోకమా అడివా అనే ప్రశ్న తలెత్తదా? ఈ పెంపు కూడా కార్మికులు ఆనందోత్సాహాల్లో ఉండే మే 1వ తేదీన చిత్తగించారు, వారి కళ్ళల్లో సంతోష బాష్పాలు చూడడం ఇష్టం లేక కావొచ్చు. ఈ అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే ద్రవ్యోల్బణం పెరుగుతుందని, మొట్టమొదటి దెబ్బ గ్యాస్ పైన ఆ తర్వాతది పెట్రోల్, వంట గ్యాస్ పైన పడతాయని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ముందే అన్నారు.అసెంబ్లీ ఎన్నికల అనంతరం పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయనేది అబద్ధమని అవి నకిలీ వార్తలని పెట్రోలియం సహజవాయువు కేంద్ర మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు మొన్న ఏప్రిల్ 28 న తీవ్రంగా ఖండించారు. ఈ హామీ ఈ రోజున అబద్ధమని తేటతెల్లమైపోయింది. రాహుల్ గాంధీ చెప్పింది నిజమని నిరూపణ అయింది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఓట్ల కోసం అబద్దాలు ఆడడం అంతలోనే దొరికిపోవడం బాధాకరం.రూ 994 పెంచిన తర్వాత ఢిల్లీలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ 3071.50 అయ్యింది. ఇంతేసి పోసి గ్యాస్ కొనలేక చాలామంది హోటళ్ళు, రెస్టారెంట్లు, వీధి ఆహారవ్యాపారులు దుకాణాలు, హాస్టళ్ళు మూసేసుకున్నారు.ఆ కుటుంబాలు ఎదుర్కొనే కష్టాలు ఎన్నని చెప్పాలి?వాణిజ్య సిలిండర్లు వాడే హోటళ్ళు రెస్టారంట్లు పెరిగిన సిలిండర్ ధరను తమ వద్ద తినే కస్టమర్ల మీదకు తోసేయవచ్చు కదా అని అంటారు. అది జరిగిన చోట జనం హాహాకారాలు మిన్నంటుతాయి. కాని పరిమిత ధరలకు మాత్రమే హోటళ్లలో తినగలిగేవారు ఇక హోటళ్లలో తినడం మానేస్తారు. అర్ధాకలికి మారిపోతారు. గ్యాస్ వాడకం మానేసి కట్టెల పొయ్యిని ఆశ్రయించడం అప్పుడే ప్రారంభమైపోయింది. ఈ ఒత్తిడికి వాటి ధర కూడా పెరిగిపోతుంది.వాణిజ్య వంట గ్యాస్ ధరలు పెంచి ఎన్నాళ్ళో కాలేదు. గత ఫిబ్రవరి నుంచి కేవలం మూడు మాసాల్లో రూ 1380 పెరిగింది. అంటే 81 శాతం అధికమైంది. సామాన్యులతో ఇంతకంటే క్రూరపరిహాసం ఉంటుందా? యుద్ధం వల్ల సరఫరా గొలుసు దెబ్బ తిన్న కారణంగా ధర పెంచామనడానికి ఆస్కారం ఉంది. ఆ మాటే ప్రభుత్వం చెప్పుకోవొచ్చు, ధరలు పెరగవు అని ఘంటా పథంగా చెప్పిన రెండు రోజుల్లోనే వాటిని ఆకాశానికి అంటించడం క్రూరాతిక్రూరం. పెట్రోల్, డీజిల్ ధరలు రూ 100 కి చేరుకున్న తర్వాత వాటిని తగ్గించడానికి అందివచ్చిన ఏ ఒక్క అవకాశాన్ని అయినా సద్వినియోగం చేసి ఒక్కసారైనా ప్రజలకు ఊరట కలిగించిన సందర్భం లేదు. ముఖ్యంగా చాలా కాలం పాటు రష్యా నుంచి చవగ్గా క్రూడాయిల్ లభించినప్పుడు ఆ సౌకర్యాన్ని వినియోగించుకుని దేశంలో రిటైల్ ధరలు తగ్గించిన పాపాన పోలేదు. రిలయన్స్ వారు ఆ ఆయిల్ ను శుద్ధి చేసి యూరపుకి అమ్ముకోడానికి అవకాశం కలిగించిన సంగతి అందరికీ తెలిసిందే.కాకులను కొట్టి గద్దలకు వేయడమంటే ఇదే.




## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# సర్ పెట్టిన చిచ్చు ప్రజాస్వామ్యానికి పెనుముప్పు

సర్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించే కార్యక్రమం దేశం నలుమూలలా ఒక పెను సంచలనంగా మారిన విషయం తెలిసిందే; మరీ ముఖ్యంగా ఇతర దేశాలతో సరిహద్దు ఉన్న రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం తీవ్ర దుమారం రేపుతుంది. ఈ కార్యక్రమం ఎన్నికలకు కొన్ని నెలల ముందు చేపట్టటం అనేక అనుమానాలకు తావిస్తుంది. ఇలాంటి కసరత్తు చెయ్యటం ఇది మొదటిసారి కాదు. 1951 నుంచి 2004 వరకు 8 సార్లు జరిగింది ఇటువంటి పరిశీలన. 2004 తరువాత మళ్ళీ ఇప్పుడు అంటే 21 ఏళ్ళ తరువాత ఈ కార్యక్రమం చేపట్టింది ఎన్నికల సంఘం. ఇంతకు మునుపు లేని గందరగోళం, దుమారం ఇప్పుడే ఎందుకు లేస్తుంది అనేది అందరిని వేధిస్తున్న ప్రశ్న.ఈ SIR పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితాలనుంచి తొలగించటం ప్రజల్లో భయాందోళన కలిగిస్తుంది. ఓటు రాజ్యాంగం ప్రతి పౌరుడికీ

*పొట్టకూటికోసం వలస వెళ్ళేవాళ్ళను నియోజకవర్గంలో ఉండటంలేదు అన్న నెపంతో ఓటరు జాబితా నుంచి తొలగించటం సహేతుకం కాదు.మన ప్రజాస్వామ్యంలో వున్న గొప్ప విషయం ఏమిటంటే ఓటు వేసేవారిలో ఎక్కువమంది పేద, బడుగు బలహీన వర్గాల వారే. కోటీశ్వరుడైనా కూటికిలేనివాడైనా ఇద్దరూ ఒకే వరుసలో నిలబడి ఓటు వేస్తారు. అందరి వేలికి అదే రంగు వేస్తారు. ప్రజలు అందరూ సమానం అనేదానికి ఇదొక చక్కని ఉదాహరణ. పేద వాళ్ళ ఓటు తీసివెయ్యటం ఈ స్ఫూర్తికి కీడు చేస్తుంది. ఎన్నికల సంఘం సమాజంలో దానిమీద వున్న అభిప్రాయాన్ని పెడచెవిన పెట్టటం దురదృష్టం. మును పెన్నడూ లేని విధంగా ఎన్నికల సంఘం ప్రధాన అధికారిమీద పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం పెట్టటాన్ని సదరు అధికారి, ప్రభుత్వ పెద్దలూ విస్మరించకూడదు. రాజ్యాంగ వ్యవస్థల మీద ప్రజలకు విశ్వాసం కోల్పోవటం చాలా తీవ్రమైన విషయం. సకాలంలో అరికట్టకపోతే ఇది అనేక దుష్పరిణామాలకు దారితీయవచ్చు.*

కల్పించిన హక్కు. ఒకసారి ఓటర్ గా నమోదైతే జీవితకాలం వుండే హక్కు అది. ఒక పేరును ఓటరు జాబితా నుంచి తొలగించటం అనేది ఓటరు మరణించితేనే చెయ్యాలి. ఓటు అనేది సంక్షేమం పథకం కాదు; ఇప్పుడు అర్హులు భవిష్యత్తులో అనర్హులవటం, లేక ఇప్పుడు అనర్హులు భవిష్యత్తులో అర్హులవటం. సంక్షేమ పథకాలకు ఆదాయంతో ముడిపడి ఉంటుంది. ఓటు ఆదాయంతో నిమిత్తం లేదు. మరి ఏ కారణంతో జాబితాలో వున్న పేరును తొలగిస్తారు? ఒక నిర్దిష్టమైన కారణం సదరు ఓటరు మరణిస్తే. మరొక కారణం ఒక మనిషి పేరుమీద రెండు ఓట్లు ఉండటం. ఇవి సహేతుకమైన కారణాలు. వీటిమీద ఎవరికీ అభ్యంతరం వుండకూడదు. కానీ విచిత్రం ఏమిటంటే, ఈ ప్రక్రియలో పాల్గొన్న అధికారుల పేర్లు కూడా తొలగించటం, మరియు వారు ముస్లిం మతానికి చెందిన వారే ఉండటం. బెంగాల్ లో జరిగింది సరిగ్గా ఇదే! ఇంతకన్నా ఘోరం ఏముంటుంది? ఢిల్లీలోని నిర్వాచన్ సదన్ లో జరిగే నిర్వాకాలు అలాంటివి మరి. దీనికి ఎన్నికల సంఘం నుంచి సరైన సమాధానం లేదు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కు. ఇది ఎన్నికల సంఘం కల్పించే వసతి కాదు. ఓటు లేని అర్హులందరినీ ఓటరు జాబితాలో చేర్చవలసిన ఎన్నికల సంఘం ఒక్క బెంగాల్ లో 90 లక్షల మందిని ఓటరు జాబితా నుంచి తొలగించారు. అందులో చట్టంలో లేని అంశం, 'లాజికల్ డిస్క్రిపాన్సీ' అనే సాకును నెపంగా చూపి 27 లక్షల మంది పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించింది ఎన్నికల సంఘం SIR కింద. ఒక మనిషికి ఒకటే ఆధార్ కార్డు ఉంటుంది. ఒక మనిషికి ఒకే పాన్ కార్డు ఉంటుంది. ఒక మనిషికి ఒకే పాస్ పోర్ట్ ఉంటుంది. ఒక మనిషికి ఒకే ఓటు ఉండేలా చేయటం సాధ్యం కాదా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి? ఆ మాత్రం ఆలోచనా జ్ఞానం ఉండదా తెలివితేటలు మా సొంతం అని విర్రవీగే ఐఏఎస్ అధికారులకు? ప్రభుత్వ పింఛను పొందేవారు ఏడాదికి ఒకసారి జీవించి ఉన్నామని నిరూపించుకోవాలి పింఛను ఇచ్చే సంస్థకి. దానినే లైఫ్ సర్టిఫికేట్ అంటారు.

అరవై ఏళ్ళు నిండిన ప్రతి ఓటరు ఐదు ఏళ్ళకొకసారి, ఆన్లైన్ లో జీవించి ఉన్నామని నిరూపించుకునే వెసులుబాటు కల్పించలేమా? బ్యాంకు ఖాతా, పాన్ కార్డు ఆధార్ తో అనుసంధానం చేసినట్టు ఓటరు కార్డు కూడా ఆధార్ తో అనుసంధానం చేయలేమా? ఎన్నికల్లో బయో మెట్రిక్ ఆధారంగా ఓటు వేసేవిధానం తీసుకురాలేమా? ఓటరు జాబితాను పునీతం చేయాలన్న మూర్ఖత్వంతో ఎన్నికల సంఘం ప్రజాస్వామ్య ప్రక్రియను పూర్తిగా నిర్వీర్యం చేసే పాపానికి ఒడిగట్టిందని మాజీ ఎన్నికల అధికారి అశోక్ లావాసా మాటలను హెచ్చరికగా పరిగణించాల్సిన సమయం ఆసన్నమైంది. కేంద్ర హోం మంత్రి కూడా ఓటరు జాబితాను పునీతం చేయవలసిన అవసరం వుంది అంటున్నారు! ఇది హోం మంత్రి బాధ్యతా? ఎన్నికల సంఘం పనితీరు ప్రభుత్వానికి అతీతంగా ఉండాలి. కానీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఒకే భాష మాట్లాడటం ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి మీద అనేక అనుమానాలకు తేరలేపుతుంది. రాష్ట్రాలు రాజకీయ పార్టీల అభిప్రాయాలను ఎన్నికల సంఘం ఎందుకు పరిగణనలోకి తీసుకోవటం లేదు ఈ ప్రక్రియలో?Page 221 ఏళ్ళ తరువాత చేస్తున్న ఈ ప్రక్షాళనలో మరణించిన వారి పేర్లను తొలగించటం ఎవరికీ అభ్యంతరం వుండకూడదు. 21 ఏళ్ళ వ్యవధి సుదీర్ఘ వ్యవధి. ఈ వ్యవధిలో దేశం మొత్తంలో ఎన్నో కోట్ల మంది చనిపోయి ఉండవచ్చు. ఇక్కడ చనిపోయిన వారిగురించి కాదు సమస్య. జీవించి వున్న లక్షలమంది ఓటర్లను జాబితాల నుంచి తొలగించటం. ఎందుకు జరుగుతుంది ఇలా? ఎంత మంది రెండు ఓట్లు కలిగి వుంటారు? అది ఏదైనా ఒక రాష్ట్రంలో లక్షల్లో ఉంటుందా? ఇహ ఓటు హక్కుకు అనర్హులంటే ఎవరు? అర్హులుగా నిరూపించుకోవటానికి చట్టపరమైన మార్గాలు ఏమిటి అనేవి ఈ సందర్భంగా తలెత్తే ముఖ్యమైన అంశాలు. ఈ సందర్భంగా పౌరసత్వం అనే విషయం కూడా తెరమీదకు వస్తుంది. ప్రథమంగా ఓటరు భారతీయ పౌరుడై ఉండాలి. ఎంతమంది భారతీయులు తాము పౌరులమని నిరూపించుకోగలరు? పౌరుడు అనేదానికి ఖచ్చితమైన రుజువు పాసుపోర్టు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు ఇచ్చిన సమాచారం ప్రకారం 2024 ఫిబ్రవరి రెండు నాటికి జారీ చేసిన పాస్పోర్టులు 9 కోట్ల 26 లక్షల 24 వేల ఆరువందల అరవైఆరు. గడచిన రెండు ఏళ్ళు కలుపుకున్నా మొత్తం పాస్పోర్టులు 10 కోట్లకు మించి వుండవు. మరి మిగిలిన వారందరూ ఈ దేశ పౌరులుగా నిరూపించుకోవటానికి నిర్దిష్టమైన ఆధారం ఏముంది? ఇదొక సమాధానంలేని పెద్ద ప్రశ్న!ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి హక్కు, మరియు ఓటు వెయ్యటం ప్రతి పౌరుడి బాధ్యత. ఇది అందరూ చెబుతున్న మాటే. ప్రస్తుతానికి ఓటు వెయ్యటం అనేది ఐచ్ఛిక బాధ్యతగా వుంది. ఇష్టం వున్నవాళ్ళు వేస్తారు, ఇష్టం లేని వాళ్ళు వెయ్యరు. తప్పనిసరిగా ఓటు వెయ్యాలి అనే నిబంధన ఏమీ లేదు. అయినా కూడా ప్రతి పౌరుడు తన ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని చెబుతుంది ప్రభుత్వం, మీడియా, మేధావులు, స్వచ్ఛంద సంస్థలు. ఈ నేపథ్యంలో వున్న ఓటును తొలగించటం అనే అంశం మీద సరైన అభిప్రాయం, అవగాహన ఇంకా రాలేదు దేశంలో. ఓటరు జాబితా ప్రక్షాళన అనేది ఎన్నికలకు కొద్ది రోజుల ముందు హడావిడిగా చేపట్టటం అనేక అనుమానాలకు తావిస్తుంది. ఈ కార్యక్రమం కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరుగుతుంది. ఓటులేని వాళ్ళను గుర్తించి, అట్టివారికి ఓటు హక్కు కల్పించడమే అనివార్యమైన చర్య. కానీ ఓటు వున్న వాళ్ళను గంపగుత్తుగా తొలగించటం సముచితం కాదు. అది ఎవరికీ ఆమోదయోగ్యం కాదు. మరి ఎన్నికల సంఘం ఎందుకు చేస్తుంది ఇలా? ఇక్కడ ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం ఒకే భాష మాట్లాడటం. ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థ. అది చేసే పనులు కేంద్రానికి సమ్మతిగా ఉండటం, రాష్ట్రాలకు సమ్మతిగా లేకపోవటం ఒక తీవ్రమైన అంశం. దాని చర్యలు చూస్తుంటే కేంద్రంలో అధికారంలో వున్న వాళ్ళ అభీష్టం మేరకు పనిచేస్తుందన్న అనుమానానికి తావిస్తోంది. రాజ్యాంగ వ్యవస్థలు ధర్మ బద్ధంగా పని చేయటమే కాదు, పని చేస్తున్నట్లు కనిపించాలి కూడా. కానీ ప్రస్తుతం ఈ రెండు లక్షణాలు కనుమరుగవుతున్నాయి. బాధితులకు చివరి ఆస్త్రం న్యాయస్థానం. కానీ న్యాయవ్యవస్థ తీరు చాలా మందికి విస్మయం కలిగిస్తుంది. అందుకే న్యాయవ్యవస్థను జవాబుదారీ చేయాలన్న మాట పదేపదే తెరమీదకు వస్తుంది. ఇది అవసరం కూడా!ఎన్నికల సంఘం ఎన్నికల జాబితాల్లో మార్పులకు కొన్ని కారణాలు చెబుతుంది. అవి: తరచూ వలస వెళ్ళటం, ఒకే మనిషి వేరువేరు చోట్ల ఓటు కలిగి ఉండటం, చనిపోయినవారిని తొలగించకపోవటం, విదేశీయులను పొరపాటున ఓటరుగా గుర్తించటం. ఇవి అన్నీ సహేతుకమైన కారణాలు కావు. ఉపాధి నిమిత్తం తరచూ వలస వెళ్ళేవాళ్ళకి ఓటు ఎక్కడ ఉండాలి? ఎక్కడ ఉంటుంది? అది స్పష్టతలేదు. అయితే పొట్ట నింపుకోవటానికి అనేక ప్రాంతాలకు పని కోసం పోయేవారికి శాశ్వత చిరునామా ఎక్కడ ఉంటుంది? స్వస్థలం లోనే ఉంటుంది, వారు అక్కడ నివాసం ఉంటున్నా లేకపోయినా కూడా. తరచుగా వలస వెళ్ళే కార్మికులు ఎక్కడికి వెళితే అక్కడ చట్టబద్ధమైన చిరునామా ఉండదు. తాత్కాలికంగా నివాసం వుండే చోట బ్యాంకు ఖాతా ఉండదు, అక్కడి చిరునామాతో ఆధార్ ఉండదు. ఆధార్ కార్డులో అడ్రస్ అనేది మరో వివాదాస్పద అంశం. ఆధార్ కార్డు జారీ చేసే సంస్థ అనేక సార్లు చెప్పింది ఆధార్ అనేది వ్యక్తిగత గుర్తింపుకి రుజువే కానీ, చిరునామాకు రుజువు కాదు అని. అయినా ప్రతి ఆధార్Page 3కార్డులో చిరునామా ఉంటుంది. అది అనేక చిక్కులకు దారితీస్తుంది. ఆధార్ కార్డు చిరునామాకు రుజువు కానప్పుడు, మరి కార్డులో చిరునామా అవసరం ఏముంది? చిరునామా తొలగిస్తే పోలా? బీహార్, బెంగాల్, అస్సాం వంటి రాష్ట్రాల్లో ఓటరు జాబితా ప్రక్షాళన పేరుతో ఎక్కువగా ముస్లింలను తొలగిస్తున్నారన్న అభియోగం వుంది. ఇది చాలా తీవ్రమైన విషయం.

పొట్టకూటికోసం వలస వెళ్ళేవాళ్ళను నియోజకవర్గంలో ఉండటంలేదు అన్న నెపంతో ఓటరు జాబితా నుంచి తొలగించటం సహేతుకం కాదు.మన ప్రజాస్వామ్యంలో వున్న గొప్ప విషయం ఏమిటంటే ఓటు వేసేవారిలో ఎక్కువ మంది పేద, బడుగు బలహీన వర్గాల వారే. కోటీశ్వరుడైనా కూటికిలేనివాడైనా ఇద్దరూ ఒకే వరుసలో నిలబడి ఓటు వేస్తారు. అందరి వేలికి అదే రంగు వేస్తారు. ప్రజలు అందరూ సమానం అనే దానికి ఇదొక చక్కని ఉదాహరణ. పేద వాళ్ళ ఓటు తీసివెయ్యటం ఈ స్ఫూర్తికి కీడు చేస్తుంది. ఎన్నికల సంఘం సమాజంలో దానిమీద వున్న అభిప్రాయాన్ని పెడచెవిన పెట్టటం దురదృష్టం. మునుపెన్నడూ లేని విధంగా ఎన్నికల సంఘం ప్రధాన అధికారిమీద పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం పెట్టటాన్ని సదరు అధికారి, ప్రభుత్వ పెద్దలూ విస్మరించకూడదు. రాజ్యాంగ వ్యవస్థల మీద ప్రజలకు విశ్వాసం కోల్పోవటం చాలా తీవ్రమైన విషయం. సకాలంలో అరికట్టకపోతే ఇది అనేక దుష్పరిణామాలకు దారితీయవచ్చు. అది దేశానికి మంచిది కాదు. ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీలకు ఎన్నికలు ముగిశాయి. మరో రెండు రోజుల్లో ఫలితాలు కూడా వస్తాయి. భవిష్యత్తులోనైనా SIR కార్యక్రమం సక్రమంగా జరిగేటట్టు ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలి, దాని గౌరవాన్ని కాపాడుకోవాలంటే. దాని గౌరవాన్ని స్వతంత్ర ప్రతిపత్తిని గాలికి వదిలి పాలకుల ప్రయోజనాలకోసం పాకులాడటం చాలా విషాదకరం. ఒకసారి విశ్వసనీయత కోల్పోతే తిరిగి పొందటం బహు కష్టం.



*అరవై ఏళ్ళు నిండిన ప్రతి ఓటరు ఐదు ఏళ్ళకొకసారి, ఆన్లైన్ లో జీవించి ఉన్నామని నిరూపించుకునే వెసులుబాటు కల్పించలేమా? బ్యాంకు ఖాతా, పాన్ కార్డు ఆధార్ తో అనుసంధానం చేసినట్టు ఓటరు కార్డు కూడా ఆధార్ తో అనుసంధానం చేయలేమా? ఎన్నికల్లో బయో మెట్రిక్ ఆధారంగా ఓటు వేసేవిధానం తీసుకురాలేమా? ఓటరు జాబితాను పునీతం చేయాలన్న మూర్ఖత్వంతో ఎన్నికల సంఘం ప్రజాస్వామ్య ప్రక్రియను పూర్తిగా నిర్వీర్యం చేసే పాపానికి ఒడిగట్టిందని మాజీ ఎన్నికల అధికారి అశోక్ లావాసా మాటలను హెచ్చరికగా పరిగణించాల్సిన సమయం ఆసన్నమైంది. కేంద్ర హోం మంత్రి కూడా ఓటరు జాబితాను పునీతం చేయవలసిన అవసరం వుంది అంటున్నారు! ఇది హోం మంత్రి బాధ్యతా? ఎన్నికల సంఘం పనితీరు ప్రభుత్వానికి అతీతంగా ఉండాలి. కానీ కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఒకే భాష మాట్లాడటం ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తి మీద అనేక అనుమానాలకు తేరలేపుతుంది. రాష్ట్రాలు రాజకీయ పార్టీల అభిప్రాయాలను ఎన్నికల సంఘం ఎందుకు పరిగణనలోకి తీసుకోవటం లేదు ఈ ప్రక్రియలో?Page 221 ఏళ్ళ తరువాత చేస్తున్న ఈ ప్రక్షాళనలో మరణించిన వారి పేర్లను తొలగించటం ఎవరికీ అభ్యంతరం వుండకూడదు. 21 ఏళ్ళ వ్యవధి సుదీర్ఘ వ్యవధి.*



గుమ్మడిదల రంగారావు

# కాకతీయుల గనుల నుండి బ్రిటిష్ కిరీటం వరకు: కోహినూర్ అలుపెరుగని ప్రయాణం

భారతదేశ చరిత్ర కేవలం రాజులు, రాజ్యాల కథ మాత్రమే కాదు; అది అపారమైన సంపదకు, సామ్రాజ్య వైభవానికి, వలసవాద దోపిడీకి మరియు చెక్కుచెదరని జాతీయ ఆత్మగౌరవానికి నిలువుటద్దం. ఈ పరిణామాలన్నింటికీ ఏకైక మూగసాక్షిగా, 'కోహినూర్' వజ్రం కాలగమనంలో ఒక అరుదైన చిహ్నంగా నిలిచింది. పర్షియన్ భాషలో 'కోహ్-ఇ-నూర్' అంటే 'వెలుగుల పర్వతం' అని అర్థం. ఈ పేరుకు తగ్గట్టే, ఈ వజ్రం తన కాంతితో ప్రపంచ పాలకులను ఆకర్షించింది, తన వైభవంతో సామ్రాజ్యాల మధ్య యుద్ధాలకు కారణమైంది, చివరకు వలసవాద పాలనలో ఒక జాతి సాంస్కృతిక ఆవేదనకు ప్రతీకగా మిగిలిపోయింది. నేడు లండన్ టవర్‌లోని బ్రిటిష్ రాజకుటుంబ కిరీట ఆభరణాల్లో అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తున్న ఈ వజ్రం, భారతదేశ చారిత్రక వారసత్వాన్ని పునరుద్ధరించాలనే కోట్లాదిమంది భారతీయుల ఆకాంక్షకు ప్రతిరూపం. ఈ అపురూప రత్నం యొక్క మూలాలు దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుంటూరు జిల్లాలోని కొల్లూరు గనులతో విడదీయలేని విధంగా ముడిపడి ఉన్నాయి. కృష్ణా నదీ తీరంలోని ఈ ప్రాంతం ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యుత్తమ వజ్రాలకు నిలయంగా ఉండేది. క్రీస్తుశకం 13వ శతాబ్దంలో కాకతీయుల పాలనలో ఈ వజ్రం వెలుగులోకి వచ్చిందని చరిత్రకారులు స్పష్టం చేస్తున్నారు. వరంగల్ కోటలోని భద్రకాళి అమ్మవారి నేత్రంగా ఈ వజ్రం వెలిగిందని జనశ్రుతి. ఆ సమయంలో దీని అసలు బరువు సుమారు 793 క్యారెట్లుగా ఉండేదని, నాటి ప్రపంచంలోనే ఇది అతిపెద్ద వజ్రంగా గుర్తింపు పొందిందని విశ్లేషకులు భావిస్తారు. ప్రస్తుత కొలతల ప్రకారం, ఈ వజ్రం 105.602 క్యారెట్ల బరువుతో, 3.6 సెంటీమీటర్ల పొడవు, 3.2 సెంటీమీటర్ల వెడల్పు, మరియు 1.3 సెంటీమీటర్ల లోతును కలిగి ఉంది. దీనికి 66 ముఖాలు ఉండటం వల్ల దీని పరావర్తన కాంతి అద్వితీయంగా ఉంటుంది. 1980లో స్టీఫెన్ హోవర్త్ తన 'ది కోహినూర్ డైమండ్ – ది హిస్టరీ అండ్ ది లెజెండ్' అనే గ్రంథంలో ఈ వజ్రం కొల్లూరు గనుల్లోనే దొరికిందని ఆధారాలతో నిరూపించారు.

కోహినూర్ ప్రయాణం భారత ఉపఖండంలో జరిగిన రాజకీయ కుట్రలకు, దండయాత్రల చరిత్రకు ప్రతిబింబం. 1323లో ఢిల్లీ సుల్తానేట్ సేనలు ఉలుగ్ ఖాన్ నాయకత్వంలో వరంగల్‌పై దాడి చేసి కాకతీయ సామ్రాజ్యాన్ని కూల్చినప్పుడు, ఈ వజ్రం మొదటిసారిగా దక్షిణ భారతాన్ని విడిచి ఢిల్లీకి తరలించబడింది. అనంతరం ఇది ఖిల్జీలు, తుగ్లక్‌లు, సయ్యద్‌లు మరియు లోడీ వంశాల చేతులు మారి చివరకు మొఘల్ సామ్రాజ్య వ్యవస్థాపకుడైన బాబర్ హస్తగతమైంది. బాబర్ తన స్వీయ చరిత్ర 'బాబర్నామా'లో ఈ వజ్రం విలువ గురించి ప్రస్తావిస్తూ, "ప్రపంచం మొత్తానికి ఒక రోజుకు అయ్యే ఖర్చును ఈ ఒక్క వజ్రం తీర్చగలదు" అని అభివర్ణించాడు. మొఘల్ చక్రవర్తి షాజహాన్ హయాంలో అత్యంత విలాసవంతమైన 'పీకాక్ థ్రోన్' (మయూర సింహాసనం) లో ఈ వజ్రాన్ని పొందుపరిచారు. అంటే, ఇది కేవలం ఒక ఆభరణం కాదు, సార్వభౌమాధికారానికి అసలు సిసలైన నిదర్శనంగా మారింది. మొఘల్ సామ్రాజ్యం క్షీణదశకు చేరుకున్న సమయంలో, 1739లో పర్షియా పాలకుడు నాదిర్ షా ఢిల్లీపై దండెత్తి అపారమైన సంపదతో పాటు ఈ వజ్రాన్ని కూడా తన వెంట తీసుకెళ్ళాడు. ఆ వజ్రం యొక్క అద్భుత మెరుపును చూసి నిశ్చేష్టుడైన నాదిర్ షా, దానిని మొదటిసారిగా 'కోహ్-ఇ-నూర్' అని సంబోధించాడు. నాదిర్ షా మరణానంతరం, ఈ వజ్రం ఆఫ్ఘాన్ పాలకుడైన అహ్మద్ షా దురానీకి దక్కింది. సుమారు ఎనిమిది దశాబ్దాల పాటు ఆఫ్ఘానిస్థాన్‌లో ఉన్న ఈ రత్నం, 1813లో అప్పటి ఆఫ్ఘాన్ రాజు షా షుజాను సిక్కు సామ్రాజ్య స్థాపకుడు మహారాజా రంజిత్ సింగ్ రక్షించినప్పుడు కృతజ్ఞతాపూర్వకంగా తిరిగి భారత్‌కు చేరింది. రంజిత్ సింగ్ దీనిని తన బాహువుకు ధరించి, సిక్కు రాజ్య అచంచల వైభవానికి చిహ్నంగా మార్చాడు. రంజిత్ సింగ్ మరణం తర్వాత పంజాబ్‌లో నెలకొన్న రాజకీయ అస్థిరతను బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ అత్యంత చాకచక్యంగా వాడుకుంది. రెండో ఆంగ్లో-సిక్కు యుద్ధం తర్వాత 1849లో కుదిరిన 'లాహోర్ ఒప్పందం' ద్వారా అప్పటి పదేళ్ల బాలుడు, సిక్కు రాజు మహారాజా దులీప్ సింగ్ చేత బ్రిటిష్ వారు బలవంతంగా కోహినూర్‌ను విక్టోరియా రాణికి అప్పగింపజేశారు. ఈ ఒప్పందంపై సంతకం చేసే సమయంలో దులీప్ సింగ్ వయస్సు మరియు ఆయనపై ఉన్న రాజకీయ ఒత్తిడిని గమనిస్తే, ఇది స్వచ్ఛందంగా ఇచ్చిన బహుమతి కాదని, వలసవాద ఆధిపత్యం చేసిన దోపిడీ అని స్పష్టమవుతుంది. 1850లో కోహినూర్‌ను బ్రిటన్‌కు తరలించి, క్వీన్ విక్టోరియాకు బహూకరించారు. అయితే, బ్రిటన్ వాతావరణంలో దీని మెరుపు తక్కువగా ఉందని భావించి, 1852లో డచ్ వజ్రాల నిపుణులచే దీనిని తిరిగి చెక్కించారు. ఈ ప్రక్రియలో వజ్రం బరువు 186 క్యారెట్ల నుండి 105.6 క్యారెట్లకు తగ్గిపోయింది. అయినప్పటికీ, దీని చారిత్రక ప్రాధాన్యం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947 నుంచే ఈ వజ్రాన్ని తిరిగి రప్పించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. 1953లో క్వీన్ ఎలిజబెత్-2 పట్టాభిషేక సమయంలో భారత ప్రభుత్వం దీనిపై అధికారిక విన్నపం చేసింది. ఆ సమయంలో రాజ్యసభలో 50 మంది ఎంపీలు సంతకాలు చేసి దీనిని తిరిగి భారత్‌కు తేవాలని తీర్మానం చేయడం గమనార్హం. 1976లో పాకిస్థాన్ మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో కూడా ఈ వజ్రంపై హక్కును ప్రకటించగా, ఆఫ్ఘానిస్థాన్ కూడా దీనిని తమదిగా క్లెయిమ్ చేసింది. కానీ, వజ్రం వెలికి తీయబడిన గోల్కొండ గనులు, కాకతీయ మరియు సిక్కు సామ్రాజ్యాల వారసత్వం భారతదేశ వాదనకు తిరుగులేని చారిత్రక ప్రాతిపదికను కల్పిస్తున్నాయి.

సమకాలీన కాలంలో 2009లో మహాత్మా గాంధీ మనవడు తుషార్ గాంధీ కోహినూర్ వెనక్కి రావాలని డిమాండ్ చేయగా, 2013లో అప్పటి బ్రిటిష్ ప్రధాని డేవిడ్ కామెరూన్ ఆ విన్నపాన్ని తోసిపుచ్చారు. 2016లో భారత సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తొలుత దీనిని "బహుమతి"గా ఇచ్చారని పేర్కొనడం తీవ్ర వివాదానికి దారితీసింది. అయితే, ప్రజా వ్యతిరేకతను గుర్తించిన కేంద్రం వెంటనే తన వైఖరిని సవరించుకుని, కోహినూర్‌ను తిరిగి తీసుకువచ్చేందుకు దౌత్యపరమైన చర్యలు ముమ్మరం చేస్తామని ప్రకటించింది. నేడు 2026 నాటికి అంతర్జాతీయ రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తున్నాయి. పాత వలస రాజ్యాల నుంచి అక్రమంగా తరలించబడిన కళాఖండాలను తిరిగి అప్పగించాలనే నైతిక ఒత్తిడి ఐరోపా దేశాలపై పెరుగుతోంది. నైజీరియాకు చెందిన 'బెనిన్ బ్రాంజెస్' వంటి వస్తువులను జర్మనీ తిరిగి ఇచ్చేయడం ఒక కొత్త ఒరవడికి నాంది పలికింది. న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ వంటి ప్రముఖులు ఈ అంశంపై గొంతు ఎత్తడం, బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్‌తో జరిగే చర్చల్లో దీనికి ప్రాధాన్యత లభించడం ఆశాజనకమైన పరిణామాలు. కోహినూర్ విలువను ఆర్థికంగా లెక్కకట్టడం అసాధ్యం. దీని విలువ సుమారు $200 మిలియన్ల నుండి $1 బిలియన్ల వరకు ఉండవచ్చని అంచనా వేసినప్పటికీ, దీని చారిత్రక మరియు సాంస్కృతిక విలువ వెలకట్టలేనిది. భారతదేశం వజ్రాల ఉత్పత్తిలో ప్రపంచానికి నాయకత్వం వహించిన కాలానికి ఇది ఒక అద్భుతమైన సాక్ష్యం. బ్రిటన్ వాదన ప్రకారం ఇది లాహోర్ ఒప్పందం ద్వారా లభించినది కావచ్చు, కానీ ఒక చిన్నారి పాలకుడిని నిర్బంధించి బలవంతంగా కుదుర్చుకున్న ఒప్పందం నైతికంగా ఏమాత్రం చెల్లదు. కోహినూర్ తిరిగి రావడం అంటే కేవలం ఒక రత్నం రావడం కాదు, వలసవాద కాలంలో జరిగిన సాంస్కృతిక దోపిడీకి వ్యతిరేకంగా ఒక దేశం సాధించే చారిత్రక విజయం. ఇది కోట్లాది మంది భారతీయుల ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్న అంశం. 'ఆపరేషన్ కోహినూర్' వంటి అధికారిక ప్రయత్నాల ద్వారా ఈ 'వెలుగుల పర్వతం' తన పుట్టినగడ్డకు, కృష్ణా నదీ తీరానికి చేరుతుందనే ఆశ ప్రతి భారతీయుడిలోనూ సజీవంగా ఉంది. భవిష్యత్తులో దౌత్యపరమైన వ్యూహాలు ఫలించి, ఈ అపురూప రత్నం భారతదేశపు మకుటంలో మళ్ళీ చేరాలని ఆశిద్దాం.





సంగనబట్ల
9440595494



# జాతీయం-అంతర్జాతీయం



## వాతావరణ శాఖ చల్లని మాట

**మే 14 లేదా 15న అండమాన్‌ను తాకనున్న రుతుపవనాలు**



**ఢిల్లీ, మే 2 (వుదయం) :** దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. పలు రాష్ట్రాలలో ఉష్ణోగ్రతలు కూడా అత్యధికంగా నమోదవుతున్నాయి. పక్కనే ఉన్న ఇరాన్ యుద్ధం కారణంగా ఎల్ నినో ప్రభావం అంటూ పలువురు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే జూన్ లో కూడా వేసవి తాపాన్ని అనుభవించాల్సి వస్తుందంటూ పేర్కొన్నారు. ఎన్నడూలేని విధంగా ఏప్రిల్ రెండవ వారం నుంచే ఎండలు భగ్గుమంటూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ (ఐఎండి) నైరుతి రుతుపవనాలు ముందే వస్తాయంటూ లస్తోంది. రుతుపవనాలు ఈ నెల 14 లేదా 15న అండమాన్‌ను తాకొచ్చని వాతావరణ శాఖ అంచనా. అంతేకాదు, దేశవ్యాప్తంగా సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని కూడా పేర్కొంది. దక్షిణ, పశ్చిమ భారతంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈశాన్య రాష్ట్రాల్లో తక్కువగా వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని ఐఎండీ వెల్లడించింది. పంజాబ్, హర్యానా, చండీగఢ్, రాజస్థాన్‌లో మే 7 వరకు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు, 3040 కిమీ వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్‌లో మే 4 నుండి మే 7 మధ్య వర్షాలు, ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముందని ఐఎండీ తెలిపింది.

ఆదివారం, సోమవారం (మే 3,4) జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో వడగండ్ల వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్‌మణిపూర్‌మిజోరంత్రిపుర ప్రాంతాల్లో మే 3 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళలో మే 4 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. తెలంగాణలో సాధారణంగా మే రెండో వారం తర్వాత తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ ఈసారి ఏప్రిల్ రెండో వారం నుంచే ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 డిగ్రీల నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకు అధిక ఉష్ణోగ్రతలు వరుసగా నమోదు కావడాన్ని హీట్‌వేవ్‌గా పరిగణిస్తారు.

ఈ లెక్కన రాష్ట్రంలో ఏప్రిల్ 14 నుంచి వరుసగా చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే 2 డిగ్రీల నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. దీంతో ఏప్రిల్‌లోనే ఏకంగా 14 రోజులపాటు హీట్‌వేవ్ ప్రభావం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఇక మేలో తొలిరోజునే 42 డిగ్రీల నుంచి 45 డిగ్రీల మేర సగటు ఉష్ణోగ్రతలు నమోదవగా ఈ నెలలో ఇంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. వడగాడ్పుల రోజులు సైతం అత్యధికంగా ఉండే అవకాశం ఉందని అంటున్నారు.

## సుప్రీం ఉపశమనంతో అదనపు పరిశీలకుల నియామకం

**శాంతియుత, పారదర్శక లెక్కింపు కోసమే ఈ చర్యలన్న ఇసిఐ**

**వుదయం డెస్క్, మే 2 :** శాసనసభ ఎన్నికలలో ఓట్ల లెక్కింపునకు పర్యవేక్షణ, భద్రతను పటిష్టం చేసేందుకు భారత ఎన్నికల సంఘం పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా 165 మంది అదనపు లెక్కింపు పరిశీలకులను, 77 మంది పోలీసు పరిశీలకులను నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా సురక్షితమైన, శాంతియుతమైన, పారదర్శకమైన లెక్కింపు ప్రక్రియను నిర్ధారించడానికి ఎన్నికల సంఘం చర్యలను ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో, లెక్కింపు రోజుకు ముందు ఈ చర్య తీసుకుంది.

**165 నియోజకవర్గాలకు అదనపు లెక్కింపు పరిశీలకులు**

ఎన్నికల సంఘం ప్రకారం, ఒకటి కంటే ఎక్కువ లెక్కింపు కేంద్రాలు ఉన్న 165 అసెంబ్లీ నియోజకవర్గాలకు అదనపు లెక్కింపు పరిశీలకులను నియమించారు. ఈ అధికారులు లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించడంలో నియమిత లెక్కింపు పరిశీలకులకు సహాయపడతారు.

**లెక్కింపు కేంద్రాల చుట్టూ భద్రతను పర్యవేక్షించేందుకు 77మంది పోలీసు పరిశీలకులు**

ఓట్ల లెక్కింపు కేంద్రాల చుట్టూ భద్రత, శాంతిభద్రతల ఏర్పాట్లను పర్యవేక్షించడానికి కమిషన్ 77 మంది పోలీసు పరిశీలకులను కూడా నియమించింది.



భద్రతా ఏర్పాట్లు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండేలా, అలాగే లెక్కింపు పరిశీలకులు, ఇతర ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పని చేసేలా వీరు చూస్తారు. అయితే, ఓట్ల లెక్కింపు రోజున ఏ పరిస్థితుల్లోనూ పోలీస్ పరిశీలకులు లెక్కింపు హాల్‌లోకి ప్రవేశించరని కమిషన్ స్పష్టం చేసింది.

**రాజ్యాంగ అధికారాల కింద జరిగిన నియామకాలు**

భారత రాజ్యాంగంలోని అధికరణ 324, ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 20బి కింద ఈ నియామకాలు జరిగాయి.

వారి మోహరింపు సమయంలో, తమ విధులలో ఉన్నప్పుడు, పరిశీలకులు ఎన్నికల సంఘానికి డిప్యుటేషన్‌పై ఉన్నట్లుగా పరిగణిస్తారు. వీరు సంఘం పర్యవేక్షణ, నియంత్రణల క్రింద విధులు నిర్వర్తిస్తారు.

**క్యూఆర్ కోడ్ ప్రవేశం, లెక్కింపు హాళ్లలో మొబైల్ నిషేధం**

ఈసీఐనెట్ ద్వారా రిటర్నింగ్ అధికారులకు జారీ చేసిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఫోటో ఐడి కార్డు ద్వారా లెక్కింపు కేంద్రాలలో ప్రవేశాన్ని కఠినంగా నియంత్రిస్తున్నట్టు ఎన్నికల కమిషన్ తెలిపింది. రిటర్నింగ్ అధికారులకు, లెక్కింపు సిబ్బందికి, అభ్యర్థులకు, వారి ఏజెంట్లకు ఈసీఐనెట్ మాడ్యూల్ ద్వారా గుర్తింపు కార్డులను జారీ చేస్తారు. లెక్కింపు కేంద్రంలో లెక్కింపు పరిశీలకులు, రిటర్నింగ్ అధికారి మినహా మరెవరూ మొబైల్ ఫోన్‌ను కలిగి ఉండటానికి అనుమతించకూడదని కమిషన్ ఆదేశించింది.

**పరస్పర ధృవీకరణ చర్యల ఏర్పాటు**

పారదర్శకతను నిర్ధారించేందుకు, కంట్రోల్ యూనిట్ల నుంచి లెక్కింపు ఫలితాలను కలిగి ఉండే ఫారం 17సి2ని, లెక్కింపు ఏజెంట్ల సమక్షంలో లెక్కింపు పర్యవేక్షకులు రూపొందించి, వారి సంతకాల కోసం వారికి అందజేస్తారు. లెక్కింపు ఏజెంటు కోరితే ఈ ప్రక్రియను పునరావృతం చేస్తారు.

అదనంగా, ప్రతి లెక్కింపు బల్ల వద్ద గల మైక్రో అబ్జర్వర్లు కంట్రోల్ యూనిట్‌పై ప్రదర్శించిన ఫలితాన్ని స్వతంత్రంగా నమోదు చేసి, ప్రతి రౌండ్ తర్వాత పరస్పర ధృవీకరణ కోసం దీనిని లెక్కింపు పరిశీలకునికి అందిస్తారు.

**శాంతియుత, పారదర్శక లెక్కింపు కోసమే ఈ చర్యలు - ఇసిఐ**

సురక్షితమైన, శాంతియుతమైన, బెదిరింపులు లేని, పారదర్శకమైన వాతావరణంలో లెక్కింపు జరిగేలా చూడటానికే అదనపు బలగాల మోహరింపు, విధానపరమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు కమిషన్ తెలిపింది.

## రెబెల్ ఎంపీ సందీప్ పాఠక్‌పై పంజాబ్‌లో 2 ఎఫ్ఐఆర్‌లు

**ఆరెస్టును తప్పించుకునేందుకు అధికారిక నివాసం నుంచి వెళ్లిపోయిన సందీప్**



**వుదయం డెస్క్, మే 2 :** పంజాబ్‌లో రెండు ఎఫ్ ఐఆర్‌లు నమోదైన నేపథ్యంలో, రాజ్యసభ ఎంపీ సందీప్ పాఠక్ అరెస్టును ఎదుర్కోవచ్చనే వార్తల నడుమ, జాతీయ రాజధానిలోని తన అధికారిక నివాసాన్ని విడిచి శనివారం ఆయన వెళ్లిపోయారు.

నివేదికల ప్రకారం, ఈ కేసులు బెయిల్ ఇవ్వడానికి వీలులేని నేరాలకు సంబంధించినవి. పాఠక్ నివాసం వెలుపల భద్రతను కట్టుదిట్టం చేసిన దృశ్యాలు కనిపించగా, ఆయన వెనుక ద్వారం గుండా ఒక వాహనంలో బయలుదేరి వెళ్తున్న దృశ్యాలు కూడా ఫుటేజ్‌లో రికార్డయ్యాయి. ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉందని, ఆయన తెలియని ప్రదేశానికి వెళ్లిపోయారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ని వీడి భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలలో పాఠక్ ఒకరు. ఈ బృందంలో రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, రాజేందర్ గుప్తా, స్వాతి మాలివాల్, విక్రమ్‌జిత్ సాహ్నీ ఉన్నారు.

మాలివాల్ మినహా, వీరందరూ రాజ్యసభలో పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 10 మంది ఆప్ ఎంపీలలో ఏడుగురు తమ విధేయతను మార్చుకోవడంతో, ఈ బృందం బలం సభలో మూడింట రెండు వంతులుగా ఉంది. ఈ బలం వారిని ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత నుండి కాపాడవచ్చు.

**'రాజకీయ కక్ష' అని బీజేపీ ఆరోపణ, స్పందించని ఆప్**

రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడానికి ఆప్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను, బలగాలను దుర్వినియోగం చేస్తోందని పంజాబ్ బీజేపీ వర్కింగ్ అధ్యక్షుడు అశ్వనీ శర్మ ఆరోపించారు. పాఠక్ బీజేపీలో చేరిన వెంటనే ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేశారని, ఇది రాజకీయ కక్షకు నిదర్శనమని ఎక్స్‌పై చేసిన ఒక పోస్టులో శర్మ పేర్కొన్నారు. నాన్ బెయిలబుల్ నిబంధనలను ఉపయోగించడం, తక్షణ చర్యల బెదిరింపులు అన్నీ కూడా అసమ్మతిని అణచివేసే ప్రయత్నమని ఆయన ఆరోపించారు. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పంజాబ్‌ను పోలీస్ రాజ్యంగా మారుస్తున్నారని ఆయన నిందించారు. శిరోమణి అకాలీ దళ్ నాయకుడు బిక్రమ్ సింగ్ మజీతియా కూడా ఈ కేసులు పెట్టిన సమయాన్ని ప్రశ్నిస్తూ, పాఠక్ పార్టీ మారిన తర్వాత ఆయనను ఎంపిక చేసి లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. పాఠక్ గతంలో ఆప్ నాయకత్వంతో సన్నిహితంగా ఉండేవారని గుర్తుచేస్తూ, ఒకవేళ తప్పు జరిగి ఉంటే ఇతరులపై ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై ఆప్ నాయకత్వం నుండి తక్షణ స్పందన ఏదీ రాలేదు.

## బీజేపీ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డ రాహుల్

**న్యూఢిల్లీ, మే2 (వుదయం) :** కాంగ్రెస్ ఎంపీ జెనిబెన్ ఠాకూర్‌పై బీజేపీ గుజరాత్ అధ్యక్షుడు చేసిన ఆరోపిత అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో, ఆ పార్టీ వైఖరిపై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శనివారంనాడు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సంఘటన అధికార పార్టీ ప్రసిద్ధ 'నారీ వందన' (మహిళల పట్ల గౌరవం) నినాదాన్ని సమర్థవంతంగా బట్టబయలు చేసిందని, వారి మహిళా వ్యతిరేక భావజాలాన్ని బహిర్గతం చేసిందని ఎక్స్‌పై చేసిన ఒక పోస్టులో రాహుల్ పేర్కొన్నారు.

మహిళల పట్ల బీజేపీ నిబద్ధతను గాంధీ ప్రశ్నించారు. వారి గౌరవం షరతులతో కూడుకున్నదని, ఒక మహిళ వారి అధికారాన్ని సవాలు చేసిన క్షణంలోనే వారి గౌరవం మాయమవుతుందని సూచించారు.



నారీ వందన ముసుగు తొలగిపోయింది, అని గాంధీ వ్యాఖ్యానించారు. ఇది కేవలం సిగ్గుచేటు మాత్రమే కాదు, ఇది బీజేపీ మనువాద, మహిళా వ్యతిరేక భావజాలపు అసలు స్వరూపం. అధికారాన్ని ప్రశ్నించే మహిళలంటే వారికి ఏమాత్రం సహనం ఉండదన్నారు.

ప్రధానమంత్రి స్వయంగా చేసిన వ్యాఖ్యలనే ప్రస్తావిస్తూ, మహిళల స్మృతి, గౌరవానికి సంబంధించి నరేంద్ర మోడీ గతంలో చేసిన ప్రకటనలను గాంధీ ఆయనకు గుర్తుచేశారు.

ఎన్నికల, సామాజిక పరిణామాల గురించి తీవ్ర హెచ్చరికతో ఆ ప్రకటన ముగిసింది. బీజేపీ ప్రభంజనానికి వ్యతిరేకంగా తన సీటును గెలుచుకుని ప్రసిద్ధి చెందిన గుజరాత్‌లోని ప్రముఖ నాయకురాలు జెనీబెన్ ఠాకూర్‌కు జరిగిన అవమానాన్ని ఓటర్లు మరచిపోరని గాంధీ ఉద్ఘాటించారు.

మహిళా వ్యతిరేక బీజేపీ ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి, గుజరాత్ మహిళలు, దేశవ్యాప్తంగా ఉన్న మహిళలతో కలిసి, ప్రతి అవమానానికి తగిన విధంగా చెంపదెబ్బ కొడతారు, అని ఆయన హెచ్చరించారు.

గుజరాత్‌లో రెండు పార్టీల మధ్య రాజకీయ ఘర్షణలు తీవ్రమవుతున్న తరుణంలో ఈ వివాదం తలెత్తింది. జెనీబెన్ ఠాకూర్ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఒక ముఖ్యమైన నాయకురాలిగా ఎదిగారు. ఆ పార్టీ ఇప్పుడు ఈ ఆరోపిత వ్యాఖ్యలను దేశ మహిళల గౌరవంపై జరిగిన విస్తృత దాడిగా చిత్రీకరిస్తోంది. ఈ అంశం తమ రాబోయే రాజకీయ ప్రచారాలలో ప్రధానాంశంగా ఉంటుందని ఇది సూచిస్తోంది.

పాలన్‌పూర్‌లోని చడోతార్‌లో జరిగిన విజయ్ విశ్వాస్ సమ్మేళన్లో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ విశ్వకర్మ, జెనిబెన్ ఠాకూర్ పై ఒక వివాదాస్పద వ్యాఖ్య చేశారు.

నారీ వందన చట్టం విషయంలో దేశంలోని 70 కోట్ల మంది మహిళలకు మీరు చేసిన అవమానాన్ని బనాస్ సోదరీమణులు ఎప్పటికీ మర్చిపోరు. రాబోయే రోజుల్లో, మన తల్లులు, సోదరీమణులు దీనికి తగిన గుణపాఠం చెబుతారు; మీ కంచుకోటల నుండి, మీ చీర కొంగుల నుండి మీ స్థానాలను లాగేసుకుంటారపి ఆయన అన్నారు.

## బ్రిట్నీ స్పియర్స్‌పై ఛార్జిషీట్

**వుదయం డెస్క్, మే 2 :** అమెరికా పాప్ గాయని బ్రిట్నీ స్పియర్స్ పై మద్యం, మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించి ఛార్జిషీట్ నమోదు చేసినట్లు కాలిఫోర్నియాలోని వెంచూరా కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయం గురువారం తెలిపింది. అయితే ఆమె ఏ మద్యం తాగారు.. ఎంత మోతాదులో డ్రగ్స్ తీసుకున్నారు అనే వివరాలు అందులో పేర్కొనలేదు. బ్రిట్నీ స్పియర్స్ కాలిఫోర్నియాలోని తన ఇంటి సమీపంలో మార్చి 4న బీఎండబ్ల్యూ కారును వేగంగా, నిబంధనలకు విరుద్ధంగా నడుపుతుండడంతో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. మద్యం, మాదకద్రవ్యాలు తీసుకుని ఆమె వాహనం నడుపుతున్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం ఆమె బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ విషయంలో పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి మార్చి 23న నివేదిక సమర్పించారు. కోర్టులో ఈ కేసు విచారణ సోమవారం జరగనుందని అధికారులు తెలిపారు.

## ప్రసార భారతి నూతన చైర్మన్ ప్రసూన్ జోషి

**వుదయం డెస్క్, మే 2 :** ప్రముఖ బాలీవుడ్ పాటల రచయిత, కమ్యూనికేషన్ నిపుణుడు ప్రసూన్ జోషి ప్రసార భారతి నూతన చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. సాహిత్యం, ప్రకటనలు, సినిమా రంగాల్లో విశేష అనుభవం ఉన్న ప్రసూన్ జోషి నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది.

ప్రసూన్ జోషి నియామకంపై కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ హర్షం వ్యక్తం చేశారు. "ప్రసూన్ జోషికి హృదయపూర్వక అభినందనలు. ఆయన ఒక అరుదైన సృజనశీలి. ఆయన మాటల్లో భారతీయత ఉట్టిపడుతుంది. ఆయన నాయకత్వంలో ప్రసార భారతి కొత్త ఉత్తేజంతో, లోతైన లక్ష్యంతో ముందుకు సాగుతుంది" అని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.



ఈ నియామకానికి ముందు, ప్రసూన్ జోషి 2017 ఆగస్టు నుంచి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. గతంలో మెక్‌కాన్ వరల్డ్ గ్రూప్ ఇండియా సీఈఓగా, మెక్‌కాన్ ఆసియా పసిఫిక్ చైర్మన్‌గా కూడా ఆయన పనిచేశారు. కాగా, 1990 ప్రత్యేక చట్టం ప్రకారం ఏర్పాటైన ప్రసార భారతి సంస్థ, 1997 నుంచి భారతదేశంలో ప్రభుత్వ రంగ ప్రసార సేవలను అందిస్తున్న స్వయంప్రతిపత్తి గల సంస్థగా పనిచేస్తోంది.

## మరోసారి యుద్ధానికి సిద్ధమవుతున్న ఇరాన్

- **అమెరికాతో మళ్లీ యుద్ధం జరిగే అవకాశం ఉందంటున్న ఇరాన్**
- **అమెరికా ఏ ఒప్పందాలకు, వాగ్దానాలకు కట్టుబడి ఉండటం లేదని ఆరోపణ**
- **శత్రుదేశాలు చేసే ఎలాంటి దాడినైనా ఎదుర్కొంటామన్న ఇరాన్ సైనికాధికారి**

**వుదయం డెస్క్, మే 2 :** ఒకవైపు కాల్పుల విరమణ సాగుతున్నప్పటికీ, ఇరాన్‌కు మాత్రం అమెరికా, ఇజ్రాయెల్‌పై అసలు నమ్మకం లేదని తెలుస్తోంది. ఇందుకు, ఇరాన్ సైనిక్ కేంద్ర



కార్యాలయ డిప్యూటీ అధికారి మహమ్మద్ జాఫర్ అసదీ చేసిన వ్యాఖ్యలే తార్కాణం, అమెరికా, ఇజ్రాయెల్ తమ దేశంపై మరోసారి దాడులకు దిగే అవకాశం ఉందని ఆయన ఆరోపించారు. కాల్పుల విరమణ కొనసాగుతున్న పరస్పరం ఉన్న విశ్వాసరాహిత్యం కారణంగా అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఏ మాత్రం తగ్గడం లేదు. శాంతి ఒప్పందం పేరుతో రెండు దేశాలూ రాజీపడకుండా డిమాండ్లు చేస్తుండడంతో అది కుదిరే అవకాశాలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలోనే అసదీ చేసిన వ్యాఖ్యలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

తమ ప్రతిపాదనలను ట్రంప్ తిరస్కరించిన నేపథ్యంలో అమెరికా మాట మీద నిలబడటం లేదని ఆయన ఆరోపించారు. ఏ ఒప్పందాలకు, వాగ్దానాలకు కట్టుబడి ఉండటం లేదని అన్నారు. చమురు ధరలు తగ్గించడం, తాము సృష్టించుకున్న గందరగోళం నుంచి బయటపడేలా అమెరికా అధికారుల ప్రకటనలు ఉన్నాయని విమర్శించారు. ఈ క్రమంలో తమ దేశంపై మరోసారి దాడులకు దిగే అవకాశం ఉందని ఆయన ఆరోపించారు. శత్రుదేశాలు చేసే ఎలాంటి దాడినైనా తాము ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

**షిప్పింగ్ సంస్థలకు అమెరికా హెచ్చరిక**

హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ టోల్ ఫీజు వసూలు చేస్తున్నట్లు వార్తలు రావడంతో అమెరికా స్పందించింది. ఇరాన్ విధించే టోల్ చెల్లిస్తే ఆయా షిప్పింగ్ సంస్థలు తమ ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని యూఎస్ ట్రెజరీ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. టోల్ చెల్లింపులతో సహా ఇరాన్ సైన్యానికి మద్దతిచ్చే వారిపై కూడా తాము చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని అన్నారు.

## మెజారిటీ మాదే : మమత

**వుదయం డెస్క్, మే 2 :** భాజపా ఎన్ని కుట్రలు చేసినా ఎన్నికల్లో విజయం సాధించేది తమ పార్టీనే అని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విశ్వాసం వ్యక్తం చేశారు. 200లకు పైగా సీట్లు గెలిచి, రాష్ట్రంలో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. స్టాక్ మార్కెట్‌ను తారుమారు చేయడానికి తప్పుడు ఎగ్జిట్ పోల్స్‌ను సృష్టించారని ఆరోపించారు. 2021, 2024లోనూ భాజపా ఇదే విధంగా చేసిందని.. ఇప్పుడు కూడా అదే స్ట్రాటజీ ఉపయోగిస్తున్నారని అన్నారు. వర్చువల్‌గా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ..మమత ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారాలు, పోలింగ్ సమయంలో పార్టీ కోసం కృషి చేసిన కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల సమయంలో బెంగాల్‌లో మోహరించిన కేంద్ర బలగాలు టీఎంసీ కార్యకర్తలతో క్రూరంగా ప్రవర్తించారని..ప్రజలను భయపెడుతున్నారని ఆరోపించారు. మే 4న నిర్వహించే ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి ఆ రోజున అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు, పార్టీ నేతలకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని లెక్కింపు కేంద్రాల్లో 24 గంటలు నిఘా పెట్టాలన్నారు.

కాగా, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు ఒక అత్యంత కఠినమైన ఎన్నికల యుద్ధాన్ని ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అసాధారణ స్థాయిలో బలపడి అధికార పీఠాన్ని కైవసం చేసుకునేందుకు సవాలు విసురుతోంది. ఒకపక్క తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి అట్టడుగు స్థాయిలో బలమైన సంస్థాగత నిర్మాణం, ప్రజల ఆదరణ ఇప్పటికీ స్థిరంగా కొనసాగుతున్నప్పటికీ, తాజాగా వస్తున్న ఎగ్జిట్ పోల్స్, అలాగే సట్టా మార్కెట్ ధోరణులు చూస్తుంటే, రెండు పార్టీల మధ్య నరాలు తెగే హోరాహోరీ పోరు తప్పదని స్పష్టమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని ఓటు బ్యాంకును కాపాడుకుంటూనే, పట్టణ ప్రాంతాల్లో విస్తరిస్తున్న బీజేపీని మమతా ఏ మేరకు అడ్డుకోగలరనేదే ప్రధానాంశం కానుంది.

## గాజా సహాయ నౌకాదళ కార్యకర్తలను ప్రశ్నించనున్న ఇజ్రాయెల్

**వుదయం డెస్క్, మే 2 :** గాజాకు వెళ్తున్న సహాయ నౌకా సముదాయాన్ని ఈ వారం ఇజ్రాయెల్ బలగాలు అడ్డుకున్నారు. ఈ సహాయ నౌకలో భాగస్వాములైన ఇద్దరు కార్యకర్తలను విచారణ నిమిత్తం ఇజ్రాయెల్‌కు తీసుకువచ్చినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది.

స్పెయిన్‌కు చెందిన సైఫ్ అబు కెషెక్, బ్రెజిల్‌కు చెందిన థియాగో అవిలా ఇజ్రాయెల్‌లో ఉన్నారని, వారిని భద్రతా అధికారుల విచారణ నిమిత్తం బదిలీ చేస్తారని మంత్రిత్వ శాఖ ఎక్స్‌పై చేసిన పోస్టులో తెలిపింది. అంతేకాకుండా, ఈ ఇద్దరు కార్యకర్తలు యూఎస్ ట్రెజరీ ఆంక్షలకు గురైన ఒక సంస్థతో సంబంధం కలిగి ఉన్నారని కూడా పేర్కొంది.

ఆ కార్యకర్తలు పాపులర్ కాన్ఫరెన్స్ ఫర్ పాలస్తీనియన్స్ అబ్రాడ్ (పిసిపిఎ) అనే సంస్థతో సంబంధం కలిగి ఉన్నారని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సంస్థ హమాస్ తరపున రహస్యంగా పనిచేస్తోందని వాషింగ్టన్ ఆరోపించింది.

పాలస్తీనా భూభాగంపై ఇజ్రాయెల్ విధించిన సముద్ర దిగ్బంధనాన్ని ఛేదించే లక్ష్యంతో గాజా వైపు వెళ్లే పౌర నౌకాదళాలను నిర్వహించడంలో ఈ సంస్థ పాలుపంచుకుందని పేర్కొంటూ, జనవరిలో అమెరికా ట్రెజరీ ఆ సంస్థపై ఆంక్షలు విధించింది. అబు కేశెక్ పిసిపిఎలో ఒక ప్రముఖ సభ్యుడని, ఆ సంస్థతో సంబంధం ఉన్న అవిలాపై చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడతున్నట్టు అనుమానం ఉందని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

గత సంవత్సరం, నావికా దిగ్బంధం ఉన్నప్పటికీ గాజాకు సహాయం అందించడానికి ప్రయత్నించిన నౌకా శ్రేణి నిర్వాహకులలో అవిలా ఒకరు. ఆ ప్రయత్నాన్ని కూడా ఇజ్రాయెల్ బలగాలు అడ్డుకున్నాయి.



ప్రస్తుత నౌకా శ్రేణి 50కి పైగా నౌకలతో కూడి ఉంది. గాజాపై ఉన్న దిగ్బంధాన్ని ఛేదించి, పాలస్తీనా ప్రాంతానికి మానవీయ సహాయాన్ని అందించాలనే లక్ష్యంతో ఇది ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీలోని రేవుల నుంచి ప్రయాణాన్ని ప్రారంభించింది. గాజాలోకి ప్రవేశించే అన్ని మార్గాలను ఇజ్రాయెల్ నియంత్రిస్తుంది. 2023 అక్టోబర్‌లో హమాస్ ఇజ్రాయెల్‌పై జరిపిన దాడితో చెలరేగిన యుద్ధం నేపథ్యంలో గాజాలో కీలకమైన సామాగ్రి కొరత ఏర్పడింది, కొన్ని చోట్ల ఇజ్రాయెల్ సహాయ సరఫరాను పూర్తిగా నిలిపివేసింది. గాజా స్ట్రిప్ 2007 నుండి ఇజ్రాయెల్ దిగ్బంధంలో ఉంది.

గురువారం నాడు, 20కి పైగా నౌకల నుంచి సుమారు 175 మంది కార్యకర్తలను తమ దేశ సైన్యం తరలించిందని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇంతకుముందు తెలిపింది. అయితే, 211 మంది కార్యకర్తలు అపహరణకు గురయ్యారని నౌకా శ్రేణి నిర్వాహకులు ఆరోపించారు.

గాజా స్ట్రిప్ నుండి 1,000 కిలోమీటర్లకు పైగా దూరంలో ఇజ్రాయెల్ ఈ ఆపరేషన్‌ను చేపట్టిందని నిర్వాహకులు తెలిపారు. ఇజ్రాయెల్ అధికారులకు మద్దతు తెలుపుతూ, ఈ నౌకాదళాన్ని ఒక విన్యాసం అని అమెరికా పేర్కొంది. 2025 వేసవి, శరదృతువులలో, గ్లోబల్ సుముద్ ఫ్లోటిల్లా మధ్యధరా సముద్రం మీదుగా గాజా వైపు చేసిన తొలి ప్రయాణం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. అక్టోబర్ నెల ఆరంభంలో ఈజిప్ట్, గాజా స్ట్రిప్ తీరాల వద్ద ఆ నౌకాదళంలోని పడవలను ఇజ్రాయెల్ అడ్డగించింది. స్వీడన్ కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్‌తో సహా సిబ్బందిని అరెస్టు చేసి, ఆ తర్వాత బహిష్కరించింది.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు



## నల్గొండ గౌతమ్ స్కూల్ విద్యార్థిని అద్భుత ఘనత

- ఎస్ఎస్సీ ఫలితాల్లో 583 మార్కులు
- గౌతమ్ స్కూల్స్ చైర్మన్ నంబూరి రమేష్ రెడ్డి కరెస్పాండెంట్ ఎన్. శిరీష రెడ్డి.

**నల్గొండ జిల్లా మే 02**

నల్గొండ: నల్గొండలోని గౌతమ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మరోసారి తమ విద్యా ప్రమాణాలను చాటుకుంది. ఇటీవల విడుదలైన తెలంగాణ ఎస్ఎస్సీ (పదో తరగతి) ఫలితాల్లో ఈ పాఠశాల విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారు. ముఖ్యంగా, పాఠశాల విద్యార్థిని జయంతి మొత్తం 600 మార్కులకు గాను 583 మార్కులు సాధించి, టాప్ స్కోరర్‌గా నిలిచారు. టాప్ స్కోరర్ జయంతి ఘనత:జయంతి సాధించిన ఈ ఘనత పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణంగా మారింది. ఆమె కష్టపడి చదవడం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం మరియు పాఠశాల అందించిన నాణ్యమైన విద్యే ఆమె విజయానికి కారణమని యాజమాన్యం తెలిపింది.మెరుగైన ఫలితాలు:జయంతి విజయంతో పాటు, పాఠశాలలోని ఇతర విద్యార్థులు కూడా అద్భుత ఫలితాలను సాధించారు. మొత్తం 60 మంది విద్యార్థుల్లో, ఐదుగురు విద్యార్థులు 560 కంటే ఎక్కువ మార్కులు సాధించగా, 12 మంది విద్యార్థులు 550 కంటే ఎక్కువ మార్కులు సాధించారు. ఈ విజయాలతో పాఠశాల 100% ఉత్తీర్ణత సాధించింది.ఛైర్మన్ మరియు కరెస్పాండెంట్ అభినందనలు:విద్యార్థుల విజయాలను అభినందిస్తూ, గౌతమ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఛైర్మన్ నంబూరి రమేష్ రెడ్డి మరియు కరెస్పాండెంట్ ఎన్. శిరీష రెడ్డి మాట్లాడుతూ, "విద్యార్థుల కష్టానికి ఇది తగిన ప్రతిఫలం లభించింది. ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు ముఖ్యంగా విద్యార్థులకు మా అభినందనలు" అని అన్నారు

## అర్హులైన ప్రతి ఒక్కరికి భూ హక్కు పట్టాలిప్పిస్తాం

**రైతులకు అండగా నిలబడతాం**
**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**
**భూపాలపల్లి మే 02**
**(వుదయం విలేకరి)**

వ్యవసాయం దండగ కాదు పండగ చేస్తూ రైతులకు అండగా నిలబడుతున్నామని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో 30 వేల ఎకరాలకు భూమి హక్కులు లేక రైతుల ఇబ్బందులు పడుతున్నారని సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి భూ హక్కు పట్టాలిస్తామని తెలిపారు. సాదా బైనామా భూములకు కూడా పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులకు పట్టాలిస్తే రైతు కంట ఆనందం వెల్లివిరుస్తుందని పేదలు దున్నుకునే భూములకు పట్టాలు ఇచ్చేందుకు సీఎం అంగీకరించారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్నట్లయితే అటువాటికి శాశ్వత భవనాలు నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అట్టి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు నిర్వహించుకొని వైద్య సేవలు పొందాలని తెలిపారు. వ్యాధులు వచ్చిన తర్వాత మందులు



వాడే దానికంటే ముందుగానే ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకొని జాగ్రత్త పడటం మంచిదని సూచించారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో 12 కోట్లతో ఎమ్మారై, 3.40 కోట్లతో సిటీ స్కాన్, 40 లక్షలతో వెంటి లేటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 165 రకాల పరీక్షలు చేసే పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నూతనంగా క్యాజువాలిటీ నిర్మాణానికి అలాగే 1.90 కోట్లతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాలు మున్సిపాలిటీ అభివృద్ధికి ఆదాయాన్ని సమకూర్చుకొని ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పన పనులు చేపట్టాలని తెలిపారు. అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. 26 కోట్లతో నర్సింగ్ కళాశాల నిర్మిస్తున్నామని, అలాగే 50 కోట్లతో ఏటీసీ భవనం నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 600 ఏటిసి కేంద్రాల నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి 70 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించి 2,700 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని రానున్న రోజుల్లో జాబ్ మేళా నిర్వహించి మరి కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. జిల్లా కేంద్రంలో సింగరేణి సౌజన్యంతో 36 కోర్సుల్లో వృత్తి నైపుణ్యం శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 12వ తేదీన పాఠశాలలు పునప్రారంభం రోజున విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్ని సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు 200 శాతం డైట్ చార్జీలు, 40% కాస్మోటిక్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం పనులు చేపట్టామని, 18 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. కొడవటంచ దేవాలయాన్ని మరో యాదగిరిగుట్ట లాగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దేందుకు జిల్లా యంత్రాంగం ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేయాలని ఆయన స్పష్టం చేశారు. పార్టీలు కచ్చితంగా జిల్లాను అభివృద్ధి చేయాలని అభివృద్ధిలో మనందరం పోటీ పడాలని ఆయన స్పష్టం చేశారు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం జిల్లాలో దిగ్విజయంగా జరుగుతున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి నుండి గ్రామీణ ప్రాంతం వరకు ఈ కార్యక్రమాలు అమలు జరుగుతున్నట్లు తెలిపారు. వార్డు సభ్యులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అవగాహన కల్పించామని అన్నారు. చేపట్టిన కార్యక్రమాలను అన్ని శాఖలలో అమలు చేశామన్నారు. ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లో గ్రామసభలు నిర్వహించి శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేసి అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా హెల్త్ కార్యక్రమాలు నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ రమణా శాఖ ద్వారా అరైవ్ ... అలైవ్ కార్యక్రమం నిర్వహించి రోడ్డు భద్రతపై కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో రోడ్డు సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. క్రైమ్ కంటే రహదారి ప్రమాదంలో చాలామంది మరణిస్తున్నారని ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రానున్న రోజుల్లో జరగనున్న రైతు వారం, సంక్షేమ వారోత్సవాలు, చైల్డ్ సేఫ్టీ, నో డ్రగ్స్, వ్యవసాయం, యువజన సర్వీసులు, విద్య, మహిళలు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఉన్నాయని విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. క్షేత్రస్థాయి వరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, అభివృద్ధి కోసం ఇన్నోవేషన్ ఐడియాలు అమలు చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పి నరేష్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య , అన్ని శాఖల జిల్లా ధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, కౌన్సిలర్లు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాల్లో జాప్యం లేకుండా సేవలు అందించాలి

* రైతులతో ముచ్చటించిన కలెక్టర్ – సమస్యలపై వెంటనే స్పందన
* ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ
* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మే 02**
**(వుదయం ప్రతినిధి) :**

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధ్యానం కొనుగోళ్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం జిల్లాలోని లింగాల ఘనపురం మండలంలోని చీటూరు, కుందారం గ్రామ పంచాయతీల పరిధిలో గల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా కేంద్రాల్లో జరుగుతోన్న కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కేంద్రాల్లో టోకెన్ల జారీ, తూకం, తేమ పరీక్షలు సరైన విధంగా వేగంగా జరుగుతున్నాయా అనే విషయాలను పరిశీలించారు.

ధాన్యం బస్తాల లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగంగా పూర్తయ్యేలా తగిన హమాలీలు, వాహనాల ద్వారా సకాలంలో సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎటువంటి ఆలస్యం కాకుండా చూడాలని, రైతులు ఎక్కువ సేపు వేచి ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రతి రైతు, ధ్యానం కొనుగోళ్ల వివరాలను వెంటనే ట్యాబ్‌లో నమోదు చేసి, చెల్లింపులు 48 గంటల లోగా జరిగేలా చూడాలన్నారు.

అదే విధంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కేంద్రాల్లో మౌలిక వసతులను సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, రైతులు, కేంద్ర నిర్వాహకులు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా కొనుగోలు కేంద్రాల నిర్వహణ ఉండాలని కేంద్ర నిర్వాహకులకు తెలిపారు.

ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం!




**పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్ డ్రగ్స్‌పై భారీ అవగాహన ర్యాలీ**
**హనుమకొండ, మే 02**
**(వుదయం ప్రతినిధి) :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో రోజున భాగంగా శనివారం హనుమకొండలో మాదకద్రవ్యాల వ్యతిరేక చైతన్య యాత్ర ఉత్సాహంగా సాగింది. పోలీస్, ఎక్సైజ్ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అదాలత్ సెంటర్ నుండి కలెక్టరేట్ (IDOC) వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిటీ పోలీస్ కమిషనర్ర్యాలీని ఉద్దేశించి వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో యువత సోషల్ మీడియా మరియు సినిమాల ప్రభావంతో తప్పుదారి పట్టే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.గ్రామీణ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రజలను చైతన్య పరిచేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోంది. ఏదైనా ఆపద కలిగితే వెంటనే 100 లేదా 1098 నంబర్లకు సమాచారం అందించాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు.సామాజిక బాధ్యత: నేర రహిత సమాజం కోసం ప్రతి పౌరుడు ఒక బాధ్యతాయుతమైన సైనికుడిలా స్పందించాలని పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాను సంపూర్ణ డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూడటంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు.

మానవహారం ప్రతిజ్ఞ

ర్యాలీ అనంతరం ఐడిఓసీ కార్యాలయం వద్ద అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలిసి మానవహారం నిర్వహించారు. "మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటాం.. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడతాం" అంటూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ ప్రభాకర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీడబ్ల్యుఓ విశ్వజతో పాటు పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

### – మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 02**
**(వుదయం ప్రతినిధి)**

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు.ముందుగా దుమ్ముగూడెం మండలం బండిరేవు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన, సమగ్ర విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదన్నారు. యంగ్ ఇండియా పథకం కింద నిర్మించనున్న ఈ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు వసతి, పోషకాహారం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆధునిక తరగతి గదులు, సైన్స్ మరియు కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, హాస్టల్ వసతులతో ఈ విద్యాసంస్థ నిర్మించబడుతుందని పేర్కొన్నారు. ఈ పాఠశాల నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చి వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు.అనంతరం దుమ్ముగూడెం మండలంలోని చింతగుప్ప గ్రామం నుండి బురదమడుగు వరకు బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే కాకుండా ప్రజల రాకపోకలకు సౌలభ్యం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ రహదారి పూర్తయిన తర్వాత చింతగుప్ప, బురదమడుగు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు గణనీయమైన ఉపయోగం ఉంటుందని పేర్కొన్నారు. ములకపాడు గ్రామంలోని మినీ స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్‌తో కూడిన మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామీణ యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మినీ ఇండోర్ స్టేడియంలో కల్పించిన సదుపాయాలను జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టులో



మంత్రి, కలెక్టర్ కలిసి షటిల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు గృహ సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని, మొదటి విడత విజయవంతంగా పూర్తయిందని, రెండో విడతను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమంపై మాట్లాడుతూ ధాన్యం మరియు మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహిస్తూ వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు.

రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని సమగ్రంగా ముందుకు తీసుకెళ్లే దిశగా రహదారులు, విద్య, ఆరోగ్యం, క్రీడా రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశల వారీగా అందిస్తూ సమగ్ర అభివృద్ధి సాధనలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ దుమ్ముగూడెం మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల, రహదారి, క్రీడా వసతుల అభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్య, రవాణా, క్రీడా రంగాల్లో పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు నిజంగా పేదల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని తెలిపారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం ద్వారా జిల్లాలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ఈ పాఠశాలలో సుమారు 2,000 నుండి 2,500 మంది విద్యార్థులు ఒకేచోట విద్యనభ్యసించే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా కొనసాగుతోందని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాలలో ఎస్పి రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణల్ శ్రేష్ఠ సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఎన్నికల హామీలను విస్మరించిన ప్రభుత్వాలు

**ప్రజా సంక్షేమం ముసుగులో రాజకీయాలతో తగవు.**
**ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్.**
**వరంగల్ జిల్లా మే 02**
**(వుదయం ప్రతినిధి) :**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజా సంక్షేమం పేరిట రాజకీయాలు చేయడం తగదని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ విమర్శించారు. రైతులు పండించిన మొక్కజొన్న, వరి ధాన్యాన్ని మద్దతు ధరకు భేషరతుగా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నర్సంపేటలో జరిగిన ఎంసిపిఐ(యు) డివిజన్ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు పేద, మధ్య తరగతి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు.

ఈ సందర్భంగా మార్క్సిస్టు నాయకుడు కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ ముగింపు సభను ఈ నెల 12న నర్సంపేట సిటిజన్ క్లబ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ సభకు వామపక్ష నేతలు, సామాజిక వేత్తలు హాజరుకానున్నారని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారమే ఇళ్ల మంజూరు

**ఖమ్మం, మే 02**
**(వుదయం ప్రతినిధి) :**

బీపీఎల్ కుటుంబానికే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గృహం మంజూరు చేసినట్లు, అసత్య ప్రచారాలను నమ్మవద్దనీ హౌసింగ్ పీడీ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణలో లబ్ధిదారు కుటుంబం బీపీఎల్ వర్గానికి చెందినదిగా నిర్ధారించబడింది అని, వారి కుటుంబానికి ప్రస్తుతం ఎటువంటి భూమి యాజమాన్యం లేదని తేలిందన్నారు. ఫీల్డ్ విజిట్ సమయంలో గమనించిన నివాస గృహం గతంలో పాడు బడిన స్థితిలో ఉన్నట్లు గుర్తించారు.ఇందిరమ్మ కమిటీతో పాటు సంబంధిత అధికారుల సిఫార్సుల మేరకు గృహం మంజూరు చేపట్టినట్లు, కుటుంబ నేపథ్యం పరిశీలించగా, పిల్లి మల్లయ్య వృత్తిరీత్యా మత్స్యకారుడు కాగా, నీలమ్మ దినసరి కూలి కార్మికురాలిగా జీవనం సాగిస్తున్నారని తెలిసింది.

గతంలో జీవనోపాధి అవసరాల కోసం కొంత భూమిని విక్రయించినట్లు, అలాగే ఒక సంతానాన్ని విదేశాలకు పంపేందుకు కొంత మొత్తం రుణం తీసుకున్నట్లు విచారణలో వెల్లడైందనీ, కుటుంబంలోని కుమార్తె ఇంజినీరింగ్ ) పూర్తి చేసినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగంలో లేరనీ తెలిపారు. ఇంకా, కుటుంబంలోని కుమారుడు ఉన్నత విద్య కోసం లండన్‌కు వెళ్లిన సందర్భంలో, మొత్తం 16,560 పౌండ్ల ట్యూషన్ ఫీజులో 16,000 పౌండ్లు యూనివర్సిటీ ఆఫ్ సాల్ఫోర్డ్ మాంచెస్టర్ నుండి గ్లోబల్ గోల్డ్ ఎక్సెలెన్స్ స్కాలర్‌షిప్ రూపంలో లభించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఇది విద్యార్థి ప్రతిభను ప్రతిబింబించే అంశమని హౌసింగ్ పీడీ పేర్కొన్నారు.విచారణ సందర్భంగా శ్రీమతి పిల్లి నీలమ్మ మాట్లాడుతూ తాను మొదటిసారి వేదికపై మాట్లాడడంతో పొరపాటు పడ్డానని తెలిపారు. తమ కుమారుడు *ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన తర్వాతే లండన్‌కు వెళ్లారని, కుమారుడిని విదేశాలకు పంపేందుకు రుణం, తమ అత్త మామలకు సంబంధించిన సుమారు 1.25 గుంటల భూమిని అమ్మి బంధువులు డబ్బులు సమకూర్చారని వివరించారు.తమ కుమార్తె ఇంజినీరింగ్ (EEE) పూర్తి చేసి ప్రైవేట్ రంగంలో పని చేస్తోందని, ప్రభుత్వ ఉద్యోగంలో లేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం ఎన్నో కష్టాలు అనుభవించిందని, కొన్నిసార్లు ఆహారం కూడా లేక ఇబ్బందులు పడ్డామని, భర్త మత్స్యకారుడిగా పనిచేస్తుండగా తాను కూలి పనులు చేసి పిల్లలను చదివించామని, ఎవరినీ మోసం చేయలేదని, దయచేసి తమపై తప్పుడు ప్రచారం చేయవద్దని ఆమె కోరారు.ఈ విషయంపై అసత్య ప్రచారాలను నమ్మవద్దని హౌసింగ్ పీడీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.



## ప్రతి సోమవారం డివిజనల్ స్థాయిలో ప్రజావాణి ప్రోగ్రాం

*** జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**
**మహబూబాబాద్, మే 02**
**(వుదయం ప్రతినిధి) :**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఇకపై జిల్లా స్థాయితో పాటు రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయి (ఆర్డీఓ కార్యాలయాలలో) కూడా నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోనీ మహబూబాబాద్ డివిజన్ (మహబూబాబాద్ పట్టణం) తొర్రూరు డివిజన్ (తొర్రూరు ఆర్డీవో కార్యాలయంలో) ఇకపైన ప్రతి సోమవారం ఉదయం 10.30 నుండి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టుగా, ఈ ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అన్ని డివిజనల్ స్థాయి విభాగాల డివిజనల్ అధికారులు పాల్గొంటరని తెలిపారు. సంబంధిత డివిజన్, మండలాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం నిమిత్తం దరఖాస్తులను వారి సమీపంలో గల రెవెన్యూ డివిజనల్ అధికారి (RDO) కార్యాలయములలో కూడా సమర్పించ వచ్చునని, తగు రసీదు ను పొందవచ్చునని కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రగతి ప్రణాళికతోనే సంక్షేమం చేరువ!

- ప్రజలతో మమేకమై అభివృద్ధి సాధించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్ జి

**ములుగు, మే 02 (వుదయం ప్రతినిధి):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్ జి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఆర్డీవో వెంకటేష్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మహేందర్ జి మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పని చేయాలని సూచించారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.




ముఖ్యంగా ప్రజాపాలన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరుగుతున్న 'జనగణన సెల్ఫ్ ఎన్యుమరేషన్' ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు రూపొందించుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారం ముందుకు సాగాలని, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చడంలో అలసత్వం వహించకూడదని పేర్కొన్నారు.

మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ మాట్లాడుతూ.. నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో పట్టణ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. వేసవి దృష్ట్యా మున్సిపాలిటీలో కొత్తగా రెండు బోర్‌వెల్స్ వేయించామని, పాత వాటిని పునరుద్ధరించామని చెప్పారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు 5 చలివేంద్రాలను ఏర్పాటు చేశామని, 20 వార్డుల్లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.అంతకుముందు, వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి వివరాలను పిపిటి (PPT) ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రవీందర్, మున్సిపాలిటీ వైస్ చైర్పర్సన్ ఆసియా షాహిన్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలలో భాగంగా ఘనంగా లక్షమల్లెల పూజ

**సూర్యాపేట జిల్లా మే:02(వుదయం ప్రతినిధి)**

జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుచున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం ఘనంగా లక్షమల్లె పుష్పార్చన నిర్వహించారు

ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి శ్రీ విష్ణు సహస్రనామాలతో భక్తులందరూ స్వామివారిని కీర్తించుచుండగా లక్ష మల్లెలతో స్వామివారిని అర్చనలతో ఆరాధించారు. తదనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్న ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం పట్టణంలోని పురవీధులలో గరుడ వాహన సేవ నిర్వహించారు. కోలాటాల బృందాలతో భజనలతో మంగళ వాయిద్యాలతో పట్టణ పురవీధులలో స్వామి ఘనంగా ఊరేగారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక





### పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష... ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్

### స్థానిక సంస్థల అదన కలెక్టర్ బి రాజా గౌడ్

జగిత్యాల మే 02
(వుదయం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జగిత్యాల పట్టణంలోని విరుపాక్షి గార్డెన్స్ లో నిర్వహించిన జగిత్యాల నియోజకవర్గ స్థాయి సమావేశంలో జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్ తో కలిసి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యం విద్య వ్యవసాయం యువత క్రీడలు విద్యుత్ పిల్లల భద్రత తదితర రంగాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వారికి మద్దతుగా అధికారులు ప్రజలు పని చేయాలని సూచించారు డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ టీమ్ సమర్థంగా పని చేస్తోందని పేర్కొంటూ నేటి యువత దేశానికి వెన్నెముక అని అన్నారు గ్రామాల్లో వైకుంఠ ధామాలు పల్లె ప్రకృతి పార్కుల పరిశుభ్రత పచ్చదనం పెంపుపై సర్పంచులు కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు డ్రైనేజీ నిర్మాణాలతో పాటు ఇంకుడు గుంతల ఏర్పాటు చేపట్టి మురుగు నీరు చెరువుల్లో కలవకుండా చూడాలని ఆదేశించారు తడి పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని ప్రజలను చైతన్య పరచాలని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు లేకపోతే డంపింగ్ యార్డులు సరిపోవని హెచ్చరించారు గ్రామాలు పట్టణాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఉండేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు జగిత్యాల నియోజకవర్గంలో సుమారు 78 వేల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు సన్న బియ్యం ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు వంటి పలు సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు అవుతున్నాయని పేర్కొన్నారు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు ఎంపీడీవోలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కార్యక్రమ షెడ్యూల్ ను ముందుగానే తెలియజేయాలని సూచించారు అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంను సమర్థవంతంగా అమలు చేయడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు గ్రామాలు పట్టణాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత కాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు ప్రజలకు అందే సేవల్లో పారదర్శకత నాణ్యత ఉండేలా కట్టుదిట్టమైన పర్యవేక్షణ అవసరమని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కె రాజ్ కుమార్ మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ జిల్లా స్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్లు తహసీల్దార్ లు ఎంపిడివోలు మండల స్థాయి అధికారులు మార్కెట్ కమిటీ చైర్మన్ లు కౌన్సిలర్లు సర్పంచులు స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక

### సంక్షేమ ఫలాల సత్వర అందజేతే లక్ష్యం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా 2 మే
(వుదయం ప్రతినిధి)

శనివారం, ఖానాపూర్ పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్ వేదికగా "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" నియోజకవర్గ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, తెలంగాణ గీతాలాపనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే ఫలాలు ప్రజలకు మెరుగ్గా అందించటమే "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామీణ పట్టణ ప్రాంతాలలో 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్, విద్య, వైద్యం, అరైవ్ అలైవ్ వారోత్సవాల కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించమని అన్నారు. వచ్చేవారం రైతు వారోత్సవాలు, తదితర కార్యక్రమాలు ప్రణాళిక అనుగుణంగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వం పేదల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు పరుస్తుందని, త్వరలోనే ఇందిరమ్మ జీవిత బీమా, ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్, తదితర మరిన్ని నూతన పథకాల అమలుకు శ్రీకారం చుట్టబోతుందని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో, డివిజన్ స్థాయిలలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తుల పరిష్కారానికి నిర్దిష్ట గడువు ఉంటుందని చెప్పారు. ఇటీవల వెల్లడైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే ఉత్తమ స్థానంలో నిలిచిందని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని మంచి ఫలితాలు సాధిస్తామని తెలిపారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుంది:



ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ప్రభుత్వం ప్రజలతో మమేకం అయ్యేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అనే 99 రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమాన్ని అమలుపరుస్తుందని వివరించారు. ప్రభుత్వము అమలు పరుస్తున్న పథకాల వల్ల ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ఖానాపూర్ నియోజకవర్గానికి 6 వేల 155 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని అన్నారు. 53 వేల కుటుంబాలకు 200 యూనిట్ల సబ్సిడీ విద్యుత్ అందుతుందని వివరించారు. కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రైతు రుణమాఫీ తదితర ఎన్నో పథకాల ద్వారా పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వం గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలు మొదలుకొని యూనివర్సిటీల వరకు విద్యాభివృద్ధికి చొరవ చూపుతోందని చెప్పారు. ఖానాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అధికారుల తోడ్పాటు అవసరం అన్నారు. ఇటీవలి వివిధ ప్రమాదాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ విద్యాసంస్థలకు చెందిన పలువురు విద్యార్థులను ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు అభినందించారు. శాలువాలతో సన్మానించారు. మహిళా సంఘాలకు మంజూరైన పలు చెక్కులను పంపిణీ చేశారు.

దివ్యాంగులకు మంజూరైన 95 వేల రూపాయల విలువగల స్కూటీలు, ల్యాప్ టాప్ లు పూర్తి సబ్సిడీతో అందించారు. అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు పడిగెల భూషణ్, లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సరి 'కొత్త' కోర్సుల సందడి

### ఉపాధికి పెద్దపీట: కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.విజయ్ కుమార్

కామారెడ్డి, మే 2
(వుదయం ప్రతినిధి):-







ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఆరునూతన కోర్సులను మంజూరు చేసింది. 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనికతలో భాగంగా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నిపుణులను తయారు చేసే లక్ష్యంతో ఈ కోర్సులను ప్రవేశపెట్టారు.వచ్చే విద్యా సంవత్సరం (202627) నుండి అమలులోకి రానున్న ఈ కోర్సుల్లో ఒక్కో విభాగానికి అరవై సీట్లు అందుబాటులో ఉండనున్నాయి.

బి.ఎస్సీ లైఫ్ సైన్సెస్ లో బయోటెక్నాలజీ, ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్, అప్లైడ్ న్యూట్రిషన్, బి.ఎస్సీ ఫిజికల్ సైన్సెస్ లో డేటా సైన్స్, ఎలక్ట్రానిక్స్, స్టాటిస్టిక్స్ ఉన్నాయి. కళాశాలలో ఇప్పటికే తొమ్మిది రకాల డిగ్రీ కోర్సులు, పదకొండు పీజీ కోర్సులు విజయవంతంగా నడుస్తున్నాయి. గత ఏడాది హెల్త్ కేర్ మేనేజ్మెంట్, బీబీఏ రిటైల్ ఆపరేటింగ్ కోర్సును ప్రారంభించారు. గత విద్యా సంవత్సరం రికార్డు స్థాయిలో వెయ్యికి పైగా ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కొత్తగా మంజూరైన ఈ ఆరు కోర్సులు ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ వంటి వృత్తి విద్యా కోర్సులతో సమానంగా అప్రెంటిస్షిప్ సౌకర్యాన్ని కలిగి ఉంటాయి. దీని వల్ల విద్యార్థులకు చదువుతో పాటే ఆయా రంగాల్లో ప్రత్యక్ష అనుభవం లభిస్తుంది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. విజయ్ కుమార్ మాట్లాడుతూ, "కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా రావడంతో పాటు, మార్కెట్ అవసరాలకు తగ్గట్టుగా కొత్త కోర్సులు మంజూరు కావడం శుభపరిణామం. ఇప్పటికే పలు ప్రముఖ సంస్థలతో ప్లేస్మెంట్ ఒప్పందాలు జరుగుతున్నాయి. విద్యార్థులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని కోరారు. దోస్త్ ద్వారా డిగ్రీ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు మొదటి విడత ఈ నెల 8వ తారీకు వరకు ఉండగా కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు విద్యార్థులు కళాశాలకు నేరుగా గాని, దగ్గరలో ఉన్న మీసేవ సెంటర్ సందర్శించి మొదటి ప్రాధాన్యతగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలని ఎంచుకోవాలని కోరారు.



## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### బాలల సంరక్షణ అధికారి మహేష్.

ఆసిఫాబాద్,(వుదయం ప్రతినిధి )

కోమురం బీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్ అవేర్నెస్ డ్రైవ్ నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించగా, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ రవికుమార్ డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలను వివరించారు. చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు డ్రగ్ వ్యసనం నివారణలో కౌన్సిలింగ్, కుటుంబ మద్దతు ప్రాధాన్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ పద్మ విద్యార్థులతో డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు.

## పదోన్నతులు పోలీసుల్లో బాధ్యతను పెంచుతాయి

### నిజాయితీతో కూడిన సేవలే పోలీసులకు గుర్తింపు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి, మే 2 (వుదయం ప్రతినిధి):-



జిల్లా పోలీస్ శాఖలో క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించే సిబ్బందికి తగిన గుర్తింపు, గౌరవం తప్పనిసరిగా లభిస్తాయని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర శనివారం తెలిపారు. సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న యన్. రామకృష్ణయ్య, గాంధారి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న యస్. రవికుమార్ కి అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏఎస్సై)గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అధికారులు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు సమర్పించారు.

అనంతరం జిల్లా ఎస్పీ వారికి ఏఎస్సై హోదా చిహ్నాలను అలంకరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు వ్యవస్థలో క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయన్నారు. పదోన్నతులు కేవలం హోదా మార్పు మాత్రమే కాదు, అది విధి నిర్వహణలో బాధ్యతను మరింత పెంచుతుందన్నారు.

పదోన్నతి పొందిన సిబ్బంది తమ జీవన శైలిని మెరుగుపరుచుకుంటూ, ప్రజలకు మరింత చేరువగా ఉండి నిజాయితీతో సేవలు అందించాలని, పదోన్నతి పొందిన అధికారులు తమ విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా, నిజాయితీతో వ్యవహరించడంతో పాటు ప్రజలకు చేరువగా ఉండి సేవలను అందించాలని, శాఖ ప్రతిష్ఠను కాపాడే విధంగా ప్రతి చర్యలో క్రమశిక్షణను పాటిస్తూ ఉన్నత ప్రమాణాలను నెలకొల్పాలని ఆదేశించారు.

ప్రజా భద్రత కోసం ఎన్నో ఏళ్లుగా చేసిన కృషికి ఈ పదోన్నతి ఒక గుర్తింపని, దీనిని ప్రేరణగా తీసుకుని భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

## విద్యార్థుల భవిష్యత్తును ఉపాధ్యాయులు బాధ్యతగా తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా మే 02
(వుదయం ప్రతినిధి)



ప్రభుత్వం విద్యా వ్యవస్థకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థుల భవిష్యత్తును ఉపాధ్యాయులు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ లతో కలిసి ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో విద్యార్థుల సంఖ్య, సౌకర్యాల కల్పన పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన పూర్తిస్థాయి సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు. పాఠశాలలలో ప్రహరీ గోడ, త్రాగు నీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర సదుపాయాలు కల్పించడంతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని తెలిపారు. లక్షెట్టిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ సంవత్సరం దాదాపు 1 వేయి మంది విద్యార్థులు చదువుతున్నారని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలలో చేరుతున్నారని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో బెంచీలు, విద్యుత్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని, అవసరం మేరకు బోధనేతర సిబ్బంది ఉన్నారని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో విద్యార్థులకు సదుపాయాలతో పాటు నాణ్యమైన విద్య బోధన అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఆసక్తిగా తరగతులకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు మంచి వాతావరణం కల్పించాలని, వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యా సంస్థలపై నమ్మకాన్ని కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, విద్యా వ్యవస్థలో పటిష్టం చేస్తూ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం రైసింగ్ 2047 లో అన్ని రంగాలలో ముందుండాలని తెలిపారు.. మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం జరిగిందని, మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బాధ్యత తీసుకున్నప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించబడతాయని, కాగితాలపై లెక్కలు కాకుండా క్షేత్రస్థాయిలో పురోగతి సాధించాలని తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ ఉపాధ్యాయుల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎన్నో నాణ్యత, అర్హత పరీక్షలను దాటుకొని ఉద్యోగం సాధిస్తారని, ఉపాధ్యాయులకు ఉన్న విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించి తీర్చిదిద్దాలని తెలిపారు. 2 వేల 500 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ పాఠశాల ద్వారా పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.



ఉపాధ్యాయులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో విద్యా వ్యవస్థ అభివృద్ధి కొరకు దాదాపు 100 కోట్ల రూపాయలు కేటాయించి పనులు చేపట్టడం జరిగిందని, వార్షిక పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించాలని తెలిపారు. నాణ్యమైన విద్యను అందించి సమాజ వ్యవస్థను అభివృద్ధి చేయాలని, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు సరైన మార్గదర్శకాలు అందించి పాఠశాలల ఫలితాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గోలిలింగలో ఉపాధి హామీ పనులపై ఎంపీడీవో విస్తృత తనిఖీ




నాగిరెడ్డిపేట్,వుదయం

నాగిరెడ్డిపేట్ మండలం గొల్లింగాల గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద జరుగుతున్న పనులను ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సమగ్రంగా తనిఖీ చేశారు. గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ, క్షేత్రస్థాయిలో అమలు పరిస్థితులపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికను పరిశీలించిన ఎంపీడీవో, హాజరు శాతం ఆశించిన స్థాయిలో ఉండాలని సూచించారు. పని చేసే ప్రతి కూలీ హాజరు నమోదు సక్రమంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి లోపాలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఫీల్డ్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం గ్రామంలో 141 మంది కూలీలు పనుల్లో పాల్గొంటున్నట్లు అధికారులు వెల్లడించారు. పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో పేర్కొన్నారు. ప్రతి పని కొలతల ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడాలని స్పష్టం చేశారు.

అలాగే పనుల వేగం పెంచడంతో పాటు, నాణ్యతలో రాజీ పడకూడదని హెచ్చరించారు.పథకం లక్ష్యం గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడమే కాకుండా, గ్రామాభివృద్ధిని సాధించడమని ఆయన అన్నారు. ఈ దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఫీల్డ్ అసిస్టెంట్, ఇతర సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

## వరి ధాన్యం సకాలంలో కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు తరలించాలి





### జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్

జగిత్యాల మే 02 (వుదయం ప్రతినిధి)

జిల్లాలోని కొడిమ్యాల మల్యాల మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పరిశీలించారు ఈ సందర్భంగా కొడిమ్యాల మండల కేంద్రం గంగారం తండా చెప్యాల గ్రామాలు అలాగే మల్యాల మండలంలోని ముత్యంపేట గ్రామాల్లో ఐకెపి పాక్స్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు ధాన్యం తూకం నిల్వ రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు ఈ పరిశీలనలో డీఎస్ఓ జితేందర్ రెడ్డి డిఎం జితేందర్ ప్రసాద్ మల్యాల కొడిమ్యాల మండల తహసిల్దార్లు జి శ్రీనివాస్ నరేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

### కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ మే 2 (వుద యం ప్రతినిధి)



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం గంగాధర మండలం ఇస్లాంపూర్ లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా ఆర్డిఓ మహేశ్వర్ తో కలిసి తనిఖీ చేశారు. గంగాధర మండలం ఇస్లాంపూర్ లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా ఆర్డిఓ మహేశ్వర్ తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్ ఇన్చార్జిని అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. తేమశాతం చూసే పద్ధతి, రిజిస్టర్ పరిశీలించారు. కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

## రైతుల సంక్షేమమే లక్ష్యం



### – మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి

ఆదిలాబాద్ ,
(వుదయం ప్రతినిధి):

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన బోరంచు శ్రీకాంత్ రెడ్డి శనివారం తన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా రైతుల అభివృద్ధి, మార్కెట్ యార్డ్ ఆధునీకరణకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మార్కెట్ యార్డ్‌లో తాగునీరు, షెడ్లు, తూకం సదుపాయాలు, గోదాములు, పారిశుధ్య వసతులు మెరుగుపరచడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించేలా చర్యలు చేపడతామని తెలిపారు.రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తానన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతుల అభ్యున్నతే తమ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, అభిమానులు పాల్గొని నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

వుదయం



# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు



## పేటలో ఘనంగా పూలే అంబేద్కర్ 4వ జాతర భీమ్ ర్యాలీ

- విశారదన్ మహరాజ్

**నారాయణపేట టౌన్, మే02 (వుదయం ప్రతినిధి):**

నారాయణ పేట జిల్లా కేంద్రంలో పూలే అంబేద్కర్ 4వ జాతర సందర్భంగా భారీ భీమ్ ర్యాలీని భారం భావి నుండి శీల గార్డెన్ వరకు జాతర కమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ దేశంలో అణగారిన వర్గాల కోసం కలలు కన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను నేటి యువత ఒనికిపుచ్చుకోవాలని ఆయన ఆశయ సాధన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. దేశంలో రాష్ట్రంలో పాలిస్తున్న పాలకులు ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల హక్కులను కాల రాస్తున్నారని ఆయన అన్నారు.అంబేద్కర్ జాతర అంటే ఆయన ఆశయాలను కోరుకున్న సిద్ధాంతాలను పాటించడం అన్నారు. యువత నారాయణపేటలో ప్రతి సంవత్సరం అంబేద్కర్ జాతర నిర్వహించడం గొప్ప విషయమని జాతర నిర్వహిస్తున్న జాతర కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.జాతర కమిటీ అధ్యక్షులు యు. మహేష్, ప్రధాన కార్యదర్శి చిన్నయ్య,కమిటీ నాయకులు మాట్లాడుతూ గత నెల నుండి జాతర నిర్వహణ కు జిల్లా లోని దామరగిద్ద, నారాయణపేట, మద్దూరు,కోస్గి,కొత్తపల్లి, ఉట్కూరు,ధన్వాడ,మక్తల్, మరికల్,మాగనూర్ మండలాల్లో గ్రామాల్లో కమిటీలు వేసి జాతర నిర్వహణ కు నాయకులు కృషి చేశారు.పూలే,అంబేద్కర్ ఆశయాలు సాధన,రాజ్యాంగం రక్షణ కోసం జాతర ను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు.ప్రజా నాట్యమండలి,కళాకారుల డప్పుల కార్యక్రమం ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని ర్యాలీని ఘనంగా విజయవంతంగా నిర్వహించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పూర్తి సహకారం

- నాణ్యతతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి
- తాడూరు మండలంలో ఇళ్ల నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్, మే 02 (వుదయం ప్రతినిధి):**



జిల్లా లోని తాడూరు మండలంలో అమలు అవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు మరింత వేగవంతం చేసి, నిర్ణీత గడువులో పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూరు మండల కేంద్రంలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇటీవల గృహప్రవేశం చేసిన లక్ష్మి లబ్ధిదారులు, గృహప్రవేశానికి సిద్ధం చేస్తున్న కుటుంబాల్ని లబ్ధిదారులను ఇందిరమ్మ ఇండ్లను జిల్లా సందర్శించి, నిర్మాణ నాణ్యత, సదుపాయాలు, ప్రభుత్వ సహాయం వినియోగం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ...., రాష్ట్ర ప్రభుత్వం పేదల స్వగృహ కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తోందని తెలిపారు. లబ్ధిదారుల ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని, నిర్మాణ పనులను మధ్యలో ఆపకుండా నిరంతరంగా కొనసాగించాలని, నిర్మాణాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టి, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రభుత్వం ప్రతి సోమవారం నిధులను జమ చేస్తున్నదని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని, లబ్ధిదారులు పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం కావాలని సూచించారు. నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక సమస్యలు, భూసంబంధిత సమస్యలు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో తరచూ పర్యటిస్తూ, పనుల పురోగతిని పర్యవేక్షించి, సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తాడూరు మండల పరిధిలో మొత్తం 515 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 419 ఇండ్లకు భూమి పూజ పూర్తి చేయడం జరిగిందని, 97 ఇండ్లు బేస్మెంట్ లెవెల్, 43 ఇండ్లు రూఫ్ లెవెల్, 135 ఇండ్లు స్లాబ్ లెవెల్, 65 ఇండ్లు పూర్తి చేసినట్లు, ఇంకా 1079 ఇండ్ల నిర్మాణానికి ప్రారంభం కావలెని పిడి హౌసింగ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తాడూరు మండలం లోని పలు గ్రామాల్లో జరుగుతున్న గృహ నిర్మాణాల వివరాలను పరిశీలించిన కలెక్టర్, కొంతమంది లబ్ధిదారులు పనులను ఆలస్యం చేస్తున్నారని గమనించి, అలాంటి వారు వెంటనే పనులను పునఃప్రారంభించి వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని, సమయానికి ఇళ్లు పూర్తి చేయడం ద్వారా కుటుంబ స్థిరత్వాన్ని సాధించుకోవాలని అన్నారు.

అంతకుముందు తాడూరు గ్రామ పరిధిలో నిర్మాణం మధ్యలో ఆగిపోయిన 104 డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి, ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకునేందుకు వారు సమ్మతంగా ఉన్నారా లేదా అనే వివరాలను తెలుసుకోవాలని కలెక్టర్ ఎంపీడీవోను ఆదేశించారు. గ్రామానికి దూరంగా ఉండటం గ్రామస్తులు ఇక్కడ ఇండ్లు నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదని ఈ నిర్మాణాలను ఏదైనా గురుకుల పాఠశాలలకు కేటాయించాలని సర్పంచ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్ సంగప్ప, స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, ఇంజనీరింగ్ సిబ్బంది, గ్రామ సర్పంచ్, గ్రామస్థాయి అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ అధికారులపై రాష్ట్ర సమాచార కమిషన్‌లో రెండవ అప్పీల్

**సంగారెడ్డి వుదయం**




సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద కోరిన సమాచారం ఇవ్వకపోవడంతో, సంగారెడ్డి పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ఎం. శ్రీధర్ తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌లో రెండవ అప్పీల్‌తో పాటు ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత సంవత్సరం డిసెంబర్ 29, 2025న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పరిధిలోని భూ కబ్జాలు, అక్రమంగా 59బి కింద భూముల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు నిర్వహించిన విచారణ నివేదికలు, వాటిపై తీసుకున్న చర్యలు, అలాగే లేఖ నంబర్లు LR No. E2/3375/2026, E2/1338/25 మరియు సీఎంఓ‌ఎల్‌కు చెందిన Reference No. CMRO II/3137932/2025 ఆధారంగా భూ పరిపాలన కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన లేఖలపై చేపట్టిన చర్యలు, పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల వివరాలను కోరుతూ దరఖాస్తు చేశానని తెలిపారు. అయితే, సమాచారం కోసం దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ, సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ప్రజా సమాచార అధికారి, పరిపాలన అధికారి (ఏఓ), మొదటి అప్పీలేట్ అధికారి అయిన జిల్లా రెవెన్యూ అధికారి స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, తాను కోరిన పూర్తి సమాచారాన్ని అందించేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఎం. శ్రీధర్ తన ఫిర్యాదులో కోరారు.

## అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

- నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల, మే 02(వుదయం ప్రతినిధి):**



మే 3వ తేదీ జరగనున్న నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. పరీక్ష నిర్వహణకు నలుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, నలుగురు అబ్జర్వర్లు, 80 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఇద్దరు ఎస్ఐలు, కానిస్టేబుళ్లను విధుల్లో నియమించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారన్నారు. నిర్ణీత సమయం దాటిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రం లోనికి వెళ్లేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. హాల్ టికెట్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్టుకార్డ్ సైజ్ ఫోటో తీసుకురావాలని సూచించారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ వంటి ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డులు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు వైకల్యాన్ని ధ్రువీకరించే సర్టిఫికెట్లను తీసుకురావాలన్నారు. పరీక్ష హాల్ లోనికి వెళ్లే ముందు బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, తనిఖీ వంటి ప్రక్రియలు చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు ముందస్తుగానే చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రానికి ఎలక్ట్రానిక్ ఉపకారణాలైన మొబైల్ ఫోన్లు, డిజిటల్ చేతి గడియారాలు, బ్లూటూత్ లు ఆభరణాలు వంటివి అనుమతించబడవని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలను అమర్చడం జరిగిందని, పకడ్బందీ నిఘా నడుమ సజావుగా పరీక్ష జరిగేలా చర్యలు తీసుకున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

## హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్దిపేట/హుస్నాబాద్, మే 02 (వుదయం ప్రతినిధి):**



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రూ. 250 కోట్ల రైతు భరోసా నిధుల పంపిణీ. మరణించిన 679 రైతు కుటుంబాలకు రూ. 49.96 కోట్ల రైతు బీమా అందజేత రూ. 150 కోట్లతో 3,515 ఇళ్ల మంజూరు. ఇప్పటికే రూ. 74 కోట్లు లబ్ధిదారులకు చెల్లింపు. కొత్తగా 13,000 రేషన్ కార్డుల మంజూరు. త్వరలోనే కొత్త పెన్షన్ల మంజూరుకు కసరత్తు కొత్తపల్లి హుస్నాబాద్ వరకు 4 లేన్ల రహదారి పనులు. హుస్నాబాద్ అక్కన్నపేట రోడ్డుకు టెండర్లు పూర్తి హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కాలేజీ భవన నిర్మాణం, 250 పడకల ఆసుపత్రి అభివృద్ధి, మెడికల్ కాలేజీ మంజూరు. కోహెడలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు వేగవంతం గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి బాధ్యత తనదేనని మంత్రి హామీ. వంగరలో నవోదయ విద్యాలయం స్థాపనకు కృషి.హుస్నాబాద్‌లో ఒంటిమామిడి తరహాలో హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేస్తాం. పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి అన్నారు. జూన్ 2 నుండి స్కూల్ విద్యార్థులకు అల్పాహారం, జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమవుతాయని తెలిపారు. రైతులు రసాయన ఎరువులు తగ్గించి ఆర్గానిక్ వ్యవసాయం చేయాలని కోరారు. 'సురక్ష నేత్ర' కింద మూడు నెలల్లో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని, భద్రత విషయంలో ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు .ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు రూ. 128 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కులను, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, నేతన్న బీమా చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. 1098 చైల్డ్ హెల్ప్ లైన్ మరియు మిషన్ వాత్సల్య పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైస్‌మిల్‌పై తప్పుడు ప్రచారం

- యజమాని మూడ సతీష్

**దుబ్బాక,వుదయం (మే 02):**




కొంతమంది కావాలనే తమ రైస్‌మిల్‌పై కక్షగట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుబ్బాక మండలం చీకోడ్ గ్రామానికి చెందిన లక్ష్మి వెంకటేశ్వర ఇండస్ట్రీస్ యజమాని సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఇలాంటి తప్పుడు ఆరోపణలు నమ్మవద్దని ఆయన కోరారు. రెండు రోజుల క్రితం దుబ్బాక మండలం రాజక్కపేట మధిర గ్రామమైన ఎల్లాపూర్ నుండి 903 బ్యాగుల వరి ధాన్యం తమ రైస్‌మిల్‌కు వచ్చాయని, అందులో చాలావరకు నూకలు, పాడైన వడ్లు ఉన్నాయని సతీష్ తెలిపారు. "అయినా ఎలాంటి కటింగ్ లేకుండానే తీసుకున్నాం. మళ్లీ తెచ్చేటప్పుడు మంచి ధాన్యం తీసుకురావాలని రైతులకు సూచించాం తప్ప వేరే ఉద్దేశం లేదు" అని వివరించారు. అయితే కొంతమంది తమ మిల్లుపై తప్పుడు ప్రచారం చేస్తూ కొన్ని మీడియాల్లో వార్తలు రాయించారని ఆయన ఆరోపించారు. "రైతులు అలాంటి వార్తలు పట్టించుకోవద్దు. రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఆదేశాల మేరకే వడ్లను కొనుగోలు చేస్తున్నాం" అని స్పష్టం చేశారు. రైతులు తప్పుడు ప్రచారాన్ని నమ్మి అపోహలకు గురికావద్దని, మిల్లుకు నేరుగా వచ్చి వాస్తవాలు తెలుసుకోవాలని మూడ సతీష్ కోరారు.

## సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**వికారాబాద్ మే 3( ఉదయం బ్యూరో)**



ప్రభుత్వ సంక్షేమ పథకాలూ ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు.99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వికారాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్గొన్నారు. గడ్డం ప్రసాద్ కుమార్

జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా SP స్నేహ మెహ్రా, అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ ఈ కార్యక్రమానికి హాజరు కాగా ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్ మాట్లాడుతూప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు రాష్ట్ర ప్రజలకు అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను ఇచ్చిందన్నారు. సమస్యల పరిష్కారంతో పాటుగా మన ప్రభుత్వం వచ్చాక మీకు అందిస్తున్న సంక్షేమ పథకాలను, చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటుగా అదే సమయంలో ప్రజల అవసరాలను స్థానికంగా తెలుసుకుని త్వరితంగా పరిష్కరించడం ఈ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లక్ష్యం అన్నారు.

మన ప్రజా ప్రభుత్వం వచ్చాక గత రెండున్నర సంవత్సరాలలో పనులు చేయలేదని ప్రతిపక్షాల నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు.గత ప్రభుత్వంలో ఒక్క రూపాయి పని చేసి పది రూపాయల ప్రచారం చేసుకున్నారని, మేము వంద రూపాయల పనిచేసి రూపాయ ప్రచారం చేసుకోవడం లేదన్నారుముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థుడు కాబట్టి ఈ అప్పులను తీర్చుతూ మరోవైపు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేస్తున్నాడన్నారు.గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూం ఇళ్ళు అంటూ పదేళ్ల పాటు పేదలను మోసం చేశారని,ఇప్పుడు మన ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు.డెబ్బై వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశారని, ప్రవేటు రంగంలో 15 లక్షల ఉద్యోగాలు వచ్చాయన్నారు.

ప్రభుత్వ హాస్టళ్ల పిల్లలకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామన్నారు.గత ప్రభుత్వం చేసిన అప్పులు లేకపోతే మన ప్రభుత్వంలో తులం బంగారం వచ్చేది, మా అక్కా చెల్లెల్లకు నెలకు 2,500 రూపాయలు వచ్చేవి, పెన్షన్లు పెరిగేమన్నారు.

కేవలం రెండున్నర సంవత్సరాలలోనే ఇన్ని పనులు చేశాం. ప్రజలు మంచి ఆలోచన పరులు, ఎవరు ప్రచారం చేసుకుంటారు, ఎవరు పనులు చేస్తారనేది తెలుసుకుని ఆదరిస్తారు. వచ్చేసారి కూడా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇది పదేళ్ళు ఉండే ప్రభుత్వం ఎన్నికల ప్రచార సమయంలో మేము ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తాం అని తెలిపారు

ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మీ గ్రామాలు, కాలనీలలోని ప్రజలకు తెలియజేయాలని గ్రామ సర్పంచ్ లకు, మున్సిపల్ కౌన్సిలర్లలకు నా సూచన. మనం చేస్తున్న పనుల గురించి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నది. ప్రజ పాలన ప్రగతి ప్రణాళిక ఇందుకు సరైన వేదిక అన్నారు.వికారాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తాను. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు అందరూ ప్రభుత్వ సమావేశాలకు హాజరు కావాలన్నారు. మన నియోజకవర్గంలో 200 కోట్లతో 20 ఎకరాలలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని, మెడికల్ కాలేజీ నిర్మాణం వేగంగా జరుగుతున్నధని, ప్రతి మండలంలో ఒక పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది, అందులో భాగంగా ఇప్పటికే మర్పల్లి మండల కేంద్రానికి ఒక పబ్లిక్ స్కూల్ మంజూరు అయిందన్నారు.

ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు, మిగిలిన సమయంలో పార్టీలకు అతీతంగా అందరిని కలుపుకుని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ZP CEO సుదీర్, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య గారు, వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి, వికారాబాద్, మర్పల్లి AMC చైర్మన్లు చాపల శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, సర్పంచ్ లు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు

## ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం

**వనపర్తి, మే 2 (వుదయం ప్రతినిధి):**

ప్రజా ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ల వంటివి, రెండింటిని సమానంగా ముందుకు తీసుకుపోవడమే ప్రభుత్వ లక్ష్యం : రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డిసీఎం రేవంత్ రెడ్డి నేతృత్వం లో అన్ని రంగాల్లోనూ మహిళలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం : వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డిప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కొత్త కాపు శివసేనారెడ్డి

వనపర్తి నియోజకవర్గంలో ఘనంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి కార్యక్రమం నిర్వహణ

ప్రజా ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ల వంటివని, రెండింటిని సమానంగా ముందుకు తీసుకుపోవడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితోపాటు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, జెడ్పి సీఈవో యాదయ్య, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

కార్యక్రమానికి ముందుగా తెలంగాణ గీతాన్ని ఆలపించి, సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని చదివి వినిపించారు. అనంతరం వనపర్తి నియోజకవర్గం లో ప్రజా ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను లబ్ధి పొందుతున్న వారి వివరాలను తెలియజేసారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గం లో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు రుణ మాఫీ పథకం ద్వారా 29,455 మంది రైతులకు రూ. 201 కోట్ల లబ్ధి చేకూర్చడం జరిగింది అన్నారు. రైతు భరోసా కింద 83,964 మంది రైతులకు రూ. 91 కోట్ల పెట్టుబడి సాయం అందించమన్నారు. 202526 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 26,678 మంది రైతుల నుంచి ధాన్యం సేకరించి రూ. 286కోట్లు వారి ఖాతాల్లో వేసినట్లు తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో 74,846 రేషన్ కార్డులు ఉండగా వాటిలో 35,837 కార్డులు ప్రజా ప్రభుత్వం లో కొత్తగా జారీ చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గం లో 30,812 లబ్ధిదారులకు గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు అందించి కరెంటు బిల్లుల భారం తగ్గించిందా న్నారు. అదేవిధంగా నియోజకవర్గం లో మొత్తం 3978 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి సొంతం ఇంటి కల నెరవేర్చమన్నారు.

నియోజకవర్గం లో మొత్తం 4600 స్వయం సహాయక సంఘాలకు రూ.14 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మహిళలకు 50,617 ఏక రూప చీరలు, 27,566 మందికి చేయూత పెన్షన్ లు అందించడం జరిగిందన్నారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేసి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గం లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం విస్తృతంగా చర్యలు చేపట్టిందని, రైతు భరోసా, పంటల కొనుగోలు వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే నిర్వహించిన అరైవ్ అలైవ్, ఆరోగ్య వారోత్సవాలు, వ్యవసాయం, గ్రామీణభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రుణాల పంపిణీ, ఉద్యాన శాఖ కార్యక్రమాలపై అధికారులు వివరాలను తెలియజేసారు. కార్యక్రమం అనంతరం ఫంక్షన్ హాల్ ఆవరణలో జిల్లా పోలీసు శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, జిల్లా ఉద్యాన శాఖ, జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వారు చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ ఏర్పాటుచేసిన స్టాల్స్ ను ముఖ్య అతిథులు సందర్శించి తిలకించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు రూ. 313 కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ రుణాల రెండు సంవత్సరాల సంబంధించిన చెక్కును, స్వయం సహాయక సంఘాలకు రూ.12.32 కోట్ల విలువైన వడ్డీ లేని రుణాలు చెక్కును ముఖ్య అతిథులు అందజేశారు. వనపర్తి మండల మహిళా సమాఖ్య విక్కి పౌల్ట్రీ యూనిట్ కోసం రూ. 3 లక్షల చెక్కును, మండల మహిళా సమాఖ్యలకు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎన్ ఆర్ ఎల్ ఎం గ్రాంట్ కింద రూ. 5.97 కోట్ల విలువైన చెక్కును అందజేశారు. గ్రామ సంఘాలకు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రూ. 4.42 కోట్ల కమిషన్ చెక్కును అందజేశారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమం లో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర, పెబ్బేరు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ప్రమోదిని, సిపిఓ హరికృష్ణ, డిఆర్డిఓ ఉమాదేవి, జిల్లా స్థాయి అధికారులు, కౌన్సిలర్లు ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ 2,4,6 సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్

**నారాయణపేట, మే02 (వుదయం ప్రతినిధి):**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రథమ,ద్వితీయ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 2,4,6 వ సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించుటకు చివరి తేదీ 19 మే 2026 వరకు చెల్లించగలరని స్టడీ సెంటర్ సమన్వయకర్త భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా పరీక్ష 6వ సెమిస్టర్14 జూన్ 2026 నుండి 19 జూన్ 2026 వరకు,4వ సెమిస్టర్21 జూన్ 2026 నుండి28 జూన్ 2026వరకు ,2వ సెమిస్టర్ 30 జూన్ 2026 నుండి06 జూలై 2026 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు తెలిపారు. మిగతా వివరాల కొరకు స్టడీ సెంటర్ నారాయణపేట నందు సంప్రదించాలని ఆయన కోరారు.



## రోడ్డు భద్రతకు సంబంధించిన పనులు వెంటనే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్ నగర్, మే02 (వుదయం ప్రతినిధి):**

జిల్లాలోని జాతీయ రహదారులపై పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి, రోడ్డు భద్రతకు సంబంధించిన పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి, రోడ్డు ప్రమాదాలను నివారించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోలీస్, ఆర్, బీ జాతీయ రహదారి అథారిటీ ,అధికారులు,ఇతర డిపార్ట్మెంటల తో పరస్పరం సమన్వయం చేసుకుని జిల్లాలోని రహదారుల పై, జరుగుతున్న, పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సైన్‌బోర్డులు, బ్యారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పోలీసు శాఖ, ట్రాఫిక్ సిబ్బంది, రహదారులపైన రోడ్డు మరమ్మతులు, నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్లు ఏర్పాటు చేసి, వాహన రాకపోకలు అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్ష చేసి, ప్రగతిని తెలుసుకున్నారు. ఎన్ హెచ్ ఎ ఐ అధికారులు గుర్తించిన బ్లాక్‌స్పాట్ల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే జాతీయ రహదారి ఎన్ హెచ్ 44 మీద బాలానగర్ ఫ్లైఓవర్, రాజాపూర్ ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణ పనులు గ్యాస్, డీజిల్ కొరత కారణంగా పనులు మందగించాయని చెప్పారు. బైపాస్ రోడ్డుపై కొత్తగా తెరిచిన డివైడర్ల వద్ద బ్యారికేడ్లు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆర్, బీ అధికారులకు సూచించారు. బైపాస్ రోడ్డుకు సంబంధించి మూడు ప్రాంతాల్లో సైన్‌బోర్డులు, జీబ్రా క్రాసింగ్స్ ఏర్పాటు కోసం ₹7.5 లక్షల ప్రతిపాదనలు సమర్పించామని, 10 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు కలెక్టర్ కు తెలిపారు.జిల్లాలోని జాతీయ రహదారులపై, పట్టణంలోని రహదారులపై, అలాగే బైపాస్ రోడ్డుపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి సైన్‌బోర్డులు, బ్యారికేడ్లు, లైటింగ్ వంటి అన్ని భద్రతా చర్యలు పూర్తి చేసి రోడ్డు ప్రమాదాలను నివారించే విధంగా రోడ్డు భద్రతను పటిష్టం చేయాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎస్.పి డి. జనకి, ఆర్, బీ ఈ.ఈ సంధ్య, రమేష్,పంచాయతీ రాజ్ ఈ.ఈ శ్రీనివాస్ రెడ్డి,సైట్ ఇంజనీర్ భాను మిశ్రా, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, రోడ్డు భద్రతా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- జిల్లా అదనపు నర్సింగరావు

**అలంపూర్, మే 02 (వుదయం ప్రతినిధి):**




మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతు భరోసా, తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అమలు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి కార్యక్రమంను అలంపూర్ క్రాస్ రోడ్ వద్ద నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, తెలంగాణ రాష్ట్ర గీత ఆలాపనతో, ముఖ్యమంత్రి సందేశంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందించనున్నట్లు చెప్పారు. అలాగే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారందరూ ఇందిరమ్మ ఇండ్లను పెద్ద ఎత్తున నిర్మించుకొని గృహప్రవేశాలు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈనెల నాలుగవ తేదీ నుంచి రైతు వారము వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జనాభా గణనలో భాగంగా ఏప్రిల్ 26వ తేదీ నుంచి మే 10 వరకు సెల్ఫ్ ఎన్యూమరేషన్ కు పెద్ద ఎత్తున ప్రచారం కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడారు. అలాగే ఆయా శాఖల అధికారులు వివిధ పథకాల గురించి అవగాహన కలిగించారు. అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ను అదనపు కలెక్టర్ పరిశీలించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతి, మున్సిపల్ చైర్మన్ జయరాములు, ఇతర ప్రజాప్రతినిధులు, పలువురు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## తీపి తినకుండా ఉండలేకపోతున్నారా?



ఆరోగ్యం కోసమో, ఫిట్‌నెస్ లక్ష్యాన్ని చేరుకోవడానికో లేదంటే పలు అనారోగ్యాల వల్లో.. ఇలా కారణమేదైనా చక్కెర, తీపి పదార్థాల్ని తమ డైట్‌లో నుంచి తొలగించుకునే వారు పెరిగిపోతున్నారు. అయితే ఉన్నట్లుండి ఒకేసారి దీన్ని మానేయాలంటే కష్టమే అని చెప్పాలి. ఈ క్రమంలో ఎంత వద్దనుకున్నా తీపి తినాలన్న కోరిక పెరుగుతుంటుంది. అసలు ఎందుకిలా జరుగుతుంది? ఇలాంటి ఆహారపు కోరికల్ని అదుపులో పెట్టుకోవాలంటే ఏం చేయాలి? దీనిపై నిపుణులేమంటున్నారో తెలుసుకుందాం రండి.. ఒక అలవాటుకు బానిసైతే.. దాన్ని దూరం చేసుకోవాలంటే ఎవరికైనా కష్టమే అని చెప్పాలి. చక్కెర తినకుండా నోరు కట్టేసుకోవడం కూడా ఇలాంటిదే! అందుకే 'రేపట్నుంచి మానేస్తాలే' అంటూ ఈ పనిని వాయిదా వేస్తుంటారు కొందరు. ఇక మరికొందరు కచ్చితంగా మానేయాలన్న పట్టుదలతో ఉంటారు. కానీ తీపి పదార్థాల్ని చూడగానే మనసును అదుపు చేసుకోలేకపోతారు. పైగా ఈ స్వీయ నియంత్రణ తీపి తినాలన్న కోరికను మరింతగా పెంచుతుందంటున్నారు నిపుణులు. అప్పటిదాకా చక్కెరకు బానిసైపోవడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. అందుకే ఒక్కసారిగా తీపి పదార్థాల్ని దూరం పెట్టడం కాకుండా.. కొద్దికొద్దిగా తగ్గిస్తూ నెమ్మదిగా దూరం చేసుకోవడం వల్ల శరీరం దీనికి అలవాటు పడి.. తీపి తినాలన్న కోరిక క్రమంగా తగ్గుతుందని చెబుతున్నారు. తద్వారా కొన్ని రోజుల్లోనే చక్కెర, చక్కెర సంబంధిత పదార్థాల్ని మన డైట్‌లో నుంచి తొలగించుకొని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని అంటున్నారు. తీపి తీసుకోవాలన్న కోరికకు అడ్డుకట్ట వేయాలంటే.. చక్కెరకు ప్రత్యామ్నాయాల్ని వెతుక్కోవడం ముఖ్యమంటున్నారు నిపుణులు. ఇందులో భాగంగా పండ్లు తీసుకోవాలి. వీటిలో ఉండే సహజ చక్కెరలు తీపి తినాలన్న కోరికను సంతృప్తిపరుస్తాయి. అలాగే వీటివల్ల శరీరానికి ఎలాంటి హానీ కలగదు. అయితే ఇవి కూడా మితంగా తీసుకోవడం ముఖ్యం. తీపి తినాలని మనసు లాగినప్పుడు ఓ చిన్న డార్క్ చాక్లెట్ ముక్కను నోట్లో వేసుకుంటే మనసు తృప్తి పడుతుంది. ఇది శరీరంలో ఎండార్ఫిన్లను విడుదల చేసి ఒత్తిడిని దూరం చేస్తుంది.

ఇంట్లో స్వీట్ల తయారీలో చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం.. వంటివి ఉపయోగించడం వల్ల తీపి తినాలన్న కోరిక అదుపులోకి వస్తుంది.. రక్తంలో చక్కెర స్థాయులు పెరగకుండా కూడా జాగ్రత్తపడచ్చు.. చక్కెరను దూరం పెట్టాలన్న లక్ష్యాన్నీ చేరుకోవచ్చు. భోజనం తర్వాత ఏదైనా స్వీట్ తినడం కొందరికి అలవాటు. దీన్ని దూరం చేసుకోవాలంటే భోజనానికి ముందు సూప్, సలాడ్.. వంటివి తీసుకోమంటున్నారు నిపుణులు. తద్వారా మితంగా ఆహారం తీసుకోవడంతోనే కడుపు నిండిపోతుందని, ఆపై స్వీట్లు తినాలన్న కోరిక కూడా కలగదని అంటున్నారు. స్వీట్ల వైపు మనసు లాగినప్పుడు డ్రైఫ్రూట్స్, నట్స్, పీనట్ బటర్ రాసిన యాపిల్ ముక్కలు, పెరుగు–బెర్రీస్.. వంటివి తీసుకోవడం వల్ల ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. బేకింగ్ ఉత్పత్తుల్లో చక్కెరకు బదులుగా కోకొనట్ షుగర్, పండ్ల గుజ్జు.. వంటివి ఉపయోగించడం మంచిదట!

ఇక స్నాక్స్‌లోనూ బెల్లంతో తయారుచేసిన గ్రానోలా బార్స్, పల్లీ పట్టీ, నువ్వుల పట్టీ.. వంటివి ఎంచుకుంటే మేలని చెబుతున్నారు నిపుణులు.

## వెన్నతో.. ఇలా కూడా!



వివిధ రకాల ఆహార పదార్థాలకు రుచిని అందించడానికి మనం వెన్నను ఉపయోగిస్తాం. అయితే ఇదే కాదు...

దైనందిన జీవితంలో వెన్న వల్ల ఇతరత్రా ఉపయోగాలెన్నో ఉన్నాయంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి.. చాలా సందర్భాల్లో తలుపు వేస్తున్నప్పుడు, తీస్తున్నప్పుడు శబ్దం వస్తూ ఉంటుంది. దీన్ని పోగొట్టడానికి కొద్దిగా బటర్‌ని మడత బందులకు రాస్తే.. ఇక శబ్దం రాకుండా ఉంటుంది.

ప్లాస్టిక్ వస్తువులపై అయిన మరకలు వదలగొట్టాలంటే కష్టమే. ఇలాంటి సందర్భాల్లో బటర్‌ని ఉపయోగిస్తే వాటిని చాలా సులభంగా పోగొట్టచ్చు అంటున్నారు నిపుణులు. దీనికోసం మరక ఏర్పడిన చోట కొద్దిగా వెన్న రాసి కొద్దిసేపు అలాగే ఉంచేయాలి. ఆ తర్వాత వస్త్రంతో తుడిచేస్తే మరక వదిలిపోతుంది. చేతులకు అంటుకున్న జిగురు(గ్లూ)ని వదలగొట్టడం అంత సులభమేమీ కాదు. ఇలాంటప్పుడు చేతులను శుభ్రం చేసుకొనే ముందు బటర్ రాసుకోవడం ద్వారా గ్లూని సులభంగా వదిలించుకోవచ్చు. చేపలు శుభ్రం చేసిన తర్వాత వాటిని ఉంచిన పాత్రల నుంచి వచ్చే నీచు వాసన ఓ పట్టాన పోదు. ఇలాంటప్పుడు వాసన వచ్చే పాత్రలను కొద్దిగా వెన్నతో తోమాలి. ఆ తర్వాత సబ్బు ఉపయోగించి గోరువెచ్చని నీటితో శుభ్రం చేయాలి. ఇలా చేస్తే పాత్రల నుంచి నీచు వాసన రాకుండా ఉంటుంది. రోజూ రాత్రి నిద్రపోయే ముందు గోళ్లకు కొద్దిగా బటర్ రాసుకుంటే అవి ఆరోగ్యంగా పెరుగుతాయి. పొడిబారిన చర్మాన్ని వెన్న తిరిగి తేమగా మారుస్తుంది. ఇందుకోసం కొద్దిగా బటర్‌ని చర్మానికి రాసుకొని.. కాసేపయ్యాక గాఢత తక్కువగా ఉండే సబ్బుతో రుద్ది శుభ్రం చేసుకోవాలి. కొన్ని సందర్భాల్లో వేలికి ఉన్న ఉంగరాలు బిగుతుగా మారుతుంటాయి. ఇలాంటప్పుడు వేళ్లకు కొద్దిగా వెన్న రాసి తీస్తే ఉంగరాలు సులభంగా వచ్చేస్తాయి. సగం కోసిన ఉల్లిపాయలు పాడవకుండా ఉండాలంటే దానిపై కొద్దిగా వెన్న రాయాలి.

## వేసవిలో సబ్జా గింజలతో ఆరోగ్య ప్రయోజనాలు

ఏప్రిల్ ప్రారంభం నుంచే ఎండలు మండిపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలకు ప్రజలు విలవిలలాడిపోతున్నారు. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చాలామంది వేసవి తాపాన్ని తట్టుకోలేక రకరకాల పానీయాలు తాగుతుంటారు. అయితే, ప్రకృతి సిద్ధంగా లభించే సబ్జా గింజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవిలో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండాలంటే సబ్జా ఉత్తమమైన మార్గం అని నిపుణులు చెబుతున్నారు. ఆయుర్వేదంలో కూడా వీటికి ప్రత్యేక స్థానం ఉంది. కేవలం చలవ కోసమే కాకుండా, బరువు తగ్గడానికి, సంపూర్ణ ఆరోగ్యానికి ఇవి ఎలా ఉపయోగపడతాయో తెలుసుకుందాం. సబ్జా గింజల్లో సహజంగానే శరీర ఉష్ణోగ్రతను తగ్గించే గుణం ఉంటుంది. ఎండలో తిరిగి వచ్చినప్పుడు లేదా వడదెబ్బ తగిలినప్పుడు, గ్లాసు నీటిలో నానబెట్టిన సబ్జా గింజలను కలుపుకుని తాగితే తక్షణ ఉపశమనం లభిస్తుంది. అధిక బరువుతో బాధపడేవారికి సబ్జా గింజలు ఒక అద్భుతమైన డైట్ టిప్. ఇందులో పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల వీటిని తీసుకున్నప్పుడు కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. ఇది అనవసరమైన ఆకలిని తగ్గించి, తక్కువ ఆహారం తీసుకునేలా చేస్తుంది, తద్వారా బరువు తగ్గడం సులభమవుతుంది. ప్రస్తుత కాలంలో చాలామంది ఎదుర్కొనే ప్రధాన సమస్య మలబద్ధకం, అసిడిటీ. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు పాలలో లేదా నీటిలో నానబెట్టిన సబ్జా గింజలను తీసుకుంటే, మరుసటి రోజు ఉదయం జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. ఇది కడుపులో మంట, గ్యాస్ సమస్యలను నివారిస్తుంది. మధుమేహం ఉన్న రోగులకు సబ్జా గింజలు చాలా మేలు చేస్తాయి. ఇవి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా అడ్డుకుంటాయి. టైప్–2 డయాబెటిస్ ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్యుల సలహాతో వీటిని తీసుకోవడం మంచిది. సబ్జా గింజల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ముడతలు పడకుండా, మొటిమలు రాకుండా నిరోధి స్తాయి. వీటిలో ఉండే ప్రోటీన్లు, విటమిన్లు జుట్టు కుదుళ్లను బలోపేతం చేసి, జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి. సబ్జా గింజలను ఎప్పుడూ పచ్చిగా తినకూడదు. ఒక స్పూన్ సబ్జా గింజలను ఒక గ్లాసు నీటిలో వేసి 15–20 నిమిషాల పాటు నానబెట్టాలి. అవి జెల్లీలా ఉబ్బిన తర్వాత వాటిని నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ లేదా పండ్ల రసాలలో కలుపుకుని తాగవచ్చు.

ఉదయం ఖాళీ కడుపుతో లేదా ఎండలో నుండి రాగానే తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.



## షుగర్ ఉన్నవాళ్లు ఉదయాన్నే నల్ల శనగలు తినవచ్చా?

ఉదయాన్నే ఖాళీ కడుపుతో నానబెట్టిన నల్ల శనగలను తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. షుగర్ ఉన్నవాళ్లు నల్ల శనగలు తినవచ్చా? తింటే షుగర్ కంట్రోల్ అవుతుందా? అనే విషయాలను తెలుసుకుందాం..

మీ రోజువారీ ఆహారంలో నానబెట్టిన నల్ల శనగలను చేర్చుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఇవి తక్కువ ఖర్చుతో సులభంగా లభించే మంచి పోషకాహారం. నల్ల శనగల్లో ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. వీటిని రాత్రంతా నానబెట్టి ఉదయం ఖాళీ కడుపుతో తింటే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. నానబెట్టడం వల్ల ఇవి మెత్తగా మారి, జీర్ణం సులభంగా అవుతుంది. అలాగే శరీరానికి అవసరమైన పోషకాలు బాగా అందుతాయి. ఇవి శరీరానికి శక్తిని ఇస్తాయి. కండరాల బలానికి సహాయపడతాయి. ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండటానికి కూడా ఉపయోగపడతాయి. అందుకే బరువు తగ్గాలనుకునేవారికి ఇవి మంచివి. మధుమేహం ఉన్నవారికి కూడా నానబెట్టిన నల్ల శనగలు ఉపయోగకరంగా ఉంటాయి. ఇవి షుగర్‌ను కంట్రోల్ చేయడంలో సహాయపడతాయి. ఇందులో ఉండే ఫైబర్, తక్కువ గ్లైసెమిక్ విలువ వల్ల షుగర్ అకస్మాత్తుగా పెరగకుండా ఉంటుంది. అందుకే ఇది ఆరోగ్యకరమైన ఆహారంగా పరిగణిస్తారు. నల్ల శనగల్లో మెగ్నీషియం, పొటాషియం, కాల్షియం వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మంచివి. రక్తపోటును నియంత్రించడంలో కూడా సహాయపడతాయి. ఇందులో ఉండే ఐరన్ రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది. హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచి బలహీనత, అలసట తగ్గిస్తుంది.

అంతేకాకుండా నల్ల నల్లశనగలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అలాగే కంటి ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. వీటిని తయారు చేయడం చాలా సులభం. రాత్రి శుభ్రమైన నీటిలో నానబెట్టి, ఉదయం బాగా కడిగి తినాలి. రుచి కోసం కొద్దిగా నిమ్మరసం, ఉప్పు కలిపి తీసుకోవచ్చు. ఆరోగ్యంగా ఉన్నవారు రోజుకు ఒక గుప్పెడు (30–50 గ్రాములు) నానబెట్టిన నల్ల శనగలు తింటే సరిపోతుంది. సరైన విధంగా తీసుకుంటే ఇవి శరీరానికి శక్తిని ఇచ్చి మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి.



## పిల్లలు డీహైడ్రేషన్‌కి గురి కాకుండా..!

ఎండాకాలంలో చిన్నారులు ఆటల్లో పడి ఎండ తీవ్రత తమపై పడుతుందన్న విషయాన్ని పట్టించుకోరు. ఫలితంగా డీహైడ్రేషన్‌కి గురవుతారు. అలాగని చిన్నారుల మానసిక వికాసానికి తోడ్పడే ఆటల నుంచి వారిని దూరం చేయలేం కదా.. అందుకే ఎండ ప్రభావం వారిపై పడకుండా.. వారు డీహైడ్రేషన్‌కి గురి కాకుండా.. కొన్ని జాగ్రత్తలు పాటించాలంటున్నారు నిపుణులు. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు శరీరం చల్లగా ఉండేందుకు చర్మం అధిక మొత్తంలో చెమటను ఉత్పత్తి చేస్తుంది. అయితే ఇలా చెమట ద్వారా శరీరంలోని నీరు, లవణాలు అధికమొత్తంలో బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్‌కి గురయ్యే అవకాశం ఉంటుంది. వేసవిలో చిన్నారులు డీహైడ్రేషన్‌కి గురవుతున్నారనే విషయాన్ని మనం ముందుగానే గుర్తించవచ్చు. నీరసం గా కనిపించడం, నోరు పొడిగా తయారవడం, మూత్ర విసర్జన తక్కువగా ఉండడం, వాంతులు చేసుకోవడంతో పాటు చిరాగ్గా ఉన్నట్టు కనిపిస్తే.. వారు డీహైడ్రేషన్‌కి గురవుతున్నట్లుగా గుర్తించాలంటున్నారు నిపుణులు. ఈ సమయంలో వారిని ఆటలకు కాస్త బ్రేక్ ఇవ్వమని చెప్పి నీరు, మజ్జిగ, పండ్లు వంటివి వారికి అందించాలి. అవసరమైతే వైద్యుడిని సంప్రదించాల్సి ఉంటుంది. శరీరం నుంచి చెమట ద్వారా బయటకు వెళ్లిపోయిన నీటి లోటును ఎప్పటికప్పుడు భర్తీ చేయాల్సి ఉంటుంది. లేదంటే డీహైడ్రేషన్ సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే ఈకాలంలో చిన్నారులకు తక్కువ మొత్తంలో ఎక్కువసార్లు నీళ్లు అందించాలంటున్నారు నిపుణులు. ఎప్పుడూ నీటిని తాగడానికి చిన్నారులు అంత ఆసక్తి చూపించకపోవచ్చు. అందుకోసం మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, కీరా, వివిధ రకాల పండ్ల ముక్కల్ని నీటిలో వేసి అందించడం.. వంటివి కూడా అవసరం. అలాగే నీటిశాతం ఎక్కువగా ఉండే పుచ్చ, తర్బూజా లాంటి పండ్లను కూడా వారికి అందించాలని చెబుతున్నారు. వేసవిలో ఎక్కువ సమయం ఆటల్లోనే గడిపే చిన్నారుల వస్త్రధారణ విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వీలైనంత వరకు వారికి లేత రంగుల్లో ఉండే నూలు వస్త్రాలనే తొడగాలి. అవి కూడా వదులుగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వారిపై పడకుండా ఉంటుందంటున్నారు నిపుణులు.



## వెల్లుల్లి పొట్టు సులువుగా వచ్చేస్తుంది...



కూరల్లోకీ, అల్లం వెల్లుల్లి పేస్ట్ చేయడానికీ, ఆవకాయ వంటి పచ్చళ్లు పట్టేందుకు వెల్లుల్లి అవసరం. కానీ, వాటిని ఒలవడం మాత్రం చాలా కష్టం. మీదీ ఇదే పరిస్థితా? అయితే, మీకోసమే ఈ చిట్కాలు. వేడి నీళ్లలో... వెల్లుల్లి రెబ్బలను వేణ్నీళ్లలో వేసి 15 నిమిషాల పాటు నాననివ్వండి. ఇలా నీటిలో నానడం వల్ల వెల్లుల్లి పొట్టు మెత్తబడి సులువుగా ఊడిపోతుంది. ఆపై తడి లేకుండా ఆరనిచ్చి వాడుకోవచ్చు.

షేక్ చేసి... ఓ డబ్బాలో చిన్న కాయిన్ వేసి అందులో వెల్లుల్లి రెబ్బలను వేసి వేగంగా ఊపండి. ఇలా చేయడం వల్ల కలిగే ఘర్షణకు పొట్టు దానంతట అదే విడిపోతుంది. ఇది పెద్ద మొత్తంలో వెల్లుల్లి ఒలవడానికి ఉత్తమ మార్గం.

ఎండలో పెడితే... వెల్లుల్లి రెబ్బలకి నూనె రాయండి. వాటికి గుప్పెడు ఉప్పు కలిపి ఓ మూడు గంటలు ఎండనివ్వండి. ఆపై వాటిని మెత్తటి కాటన్ వస్త్రంలోకి తీసుకుని ముడివేసి... నెమ్మదిగా నేలకేసి కొడితే సరి. పొట్టు రాలిపోతుంది.

మైక్రోవేవ్‌లోనూ: వెల్లుల్లిపాయలను మైక్రోవేవ్‌లో 15 నుండి 20 సెకన్ల పాటు వేడి చేయండి. లోపల ఉండే తేమ పోయి పొట్టు వదులైపోతుంది. బయటకు తీశాక రెబ్బలను నొక్కితే పొట్టు త్వరగా వచ్చేస్తుంది. ఇవి కాకుండా మార్కెట్లోకి వెల్లుల్లి పొట్టు తీసే పీలర్లూ వచ్చేశాయి. మీ అవసరానికి తగ్గట్లు చూసి ఎంచుకోవడమే తరువాయి.

## ముంజలతో మేలెంతో..!

తాటి ముంజలు... వేసవిలో మాత్రమే దొరికే ఇవి దాదాపు తొంభైశాతం నీటితో నిండి ఉంటాయి. పిల్లలు, పెద్దలు ఏ వయసు వారికైనా మేలు చేస్తాయి. ఫైబర్, విటమిన్ ఎ, కె పుష్కలంగా ఉంటాయి. సహజ ఎలక్ట్రోలైట్స్‌గానూ పని చేస్తాయి. దాంతో డీహైడ్రేషన్ ఎదురుకాదు. ముంజల్లో పొటాషియం అధికంగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అంతేకాదు, శరీరంలోని వ్యర్థాల్ని తొలగించడంలోనూ సాయపడతాయి. వీటిల్లోని పీచు పదార్థాలు జీవక్రియను మెరుగుపరుస్తాయి. మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. అజీర్తి, గ్యాస్ సమస్యలకు చెక్ పెడతాయి. విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు ఇమ్యూనిటీని పెంచుతాయి. తక్కువ కెలోరీలు ఉండటం వల్ల కడుపు నిండుగా అనిపిస్తుంది. త్వరగా ఆకలి వేయదు. బరువు తగ్గాలనుకునే వాళ్లకి ఇవి చక్కని ఎంపిక. గర్భిణులకు అవసరమయ్యే విటమిన్లు, ఖనిజాలు దీనిలో ఎక్కువ. దీంతో ఈ సమయంలో వచ్చే ఒత్తిడి, అలసట, వికారం, వాంతుల్ని తగ్గించడంలోనూ ఇవి సాయపడతాయి. గ్లైసమిక్ ఇండెక్స్ తక్కువ కాబట్టి మధుమేహులు వీటిని తినడం వల్ల చక్కెర స్థాయులు అదుపులో ఉంటాయి. అంతేకాదు, వీటిని మెత్తని పేస్టులా చేసి ముఖానికి పట్టిస్తే చర్మానికి తేమ అంది కాంతిమంతంగా కనిపిస్తుంది. మొటిమల వల్ల వచ్చే మచ్చలూ, చెమటకాయల్ని దూరం చేస్తాయివి.



## కొత్త ఆర్థిక సంవత్సరాన్ని బలంగా ఆరంభించిన వాహన కంపెనీలు



ఏప్రిల్ 1తో మొదలైన కొత్త ఆర్థిక సంవత్సరాన్ని (2026-27)) వాహన తయారీ సంస్థలు ఉత్సాహంగా ఆరంభించాయి. గత నెలలో ఈ సంస్థలన్నీ కలిపి 4.5 లక్షల కార్లను తమ డీలర్లకు సరఫరా చేశాయన్నది అంచనా. 2025 ఏప్రిల్‌లో కంపెనీలు టోకుగా విక్రయించిన 3.54 లక్షల వాహనాలతో పోలిస్తే, ఈసారి 27% అధికంగా సరఫరా చేశాయి. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, కియా రికార్డు స్థాయి అమ్మకాలు నమోదుచేయడం ఇందుకు తోడ్పడింది. జీఎస్‌టీ – ఆదాయపు పన్ను రేట్ల కోత, కీలక వడ్డీ రేట్ల తగ్గింపు వల్ల, అమ్మకాల పరంగా వాహన పరిశ్రమపై సానుకూల ప్రభావం కొనసాగుతోందని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి (మార్కెటింగ్, విక్రయాలు) పార్థో బెనర్జీ తెలిపారు.




# ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నా దేశ వృద్ధిరేటు జోరు



పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఆర్థిక ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, దేశ వృద్ధిరేటు జోరును కొనసాగించడానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించిన రూ.12.22 లక్షల కోట్ల మూలధన వ్యయాలను తగ్గించబోమని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. రాబోయే త్రైమాసికాల్లో, ఏడాది కాలంలో చాలా ఒత్తిళ్లు ఎదురుకావొచ్చని వ్యయ కార్యదర్శి వి.వుల్నామ్ తెలిపారు. చమురు ధరలు పెరగడం, పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలు తగ్గించడం వల్ల ప్రభుత్వానికి పన్ను రాబడిపై ప్రభావం పడొచ్చన్నారు. 2026-27 మూలధన వ్యయాల్లో జాతీయ రహదారులు, రైల్వేలు, షిప్పింగ్, పోర్టులు, పట్టణాభివృద్ధి రంగాలపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ సవాళ్లతో ఇబ్బందే: ప్రస్తుత అంతర్జాతీయ అనిశ్చితులు, మన దేశానికి సవాళ్లు విసురుతున్నాయని, ప్రభుత్వం వీటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని వుల్నామ్ స్పష్టం చేశారు. ఇటువంటి కఠిన సమయాన్ని ఎదుర్కొనేందుకు భారత ఆర్థిక స్థిరత్వం దోహద పడుతుందని తెలిపారు. ఇరాన్‌పై అమెరికా – ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమయ్యాక..బ్యారెల్ ముడిచమురు ధర 73 డాలర్ల నుంచి నాలుగేళ్ల గరిష్ఠమైన 126 డాలర్లకు చేరింది. కొత్త సిరీస్ కింద సవరణ కారణంగా, జీడీపీలో 4.3 శాతంగా అంచనా వేసిన ద్రవ్యలోటు, ఇప్పుడు 4.5 శాతానికి పెరిగే అవకాశం ఉంది.

# యాపిల్ లాభం రూ.2.78 లక్షల కోట్లు



అమెరికాకు చెందిన ఐఫోన్ల తయారీ సంస్థ యాపిల్, ఈ ఏడాది జనవరి – మార్చిలో 29.57 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2.78 లక్షల కోట్ల) లాభాన్ని ఆర్జించింది. గతేడాది ఇదే కాల లాభం 24.78 బి.డాలర్ల (సుమారు రూ.2.33 లక్షల కోట్ల)తో పోలిస్తే ఇది 19.36% ఎక్కువ. ఇదే సమయంలో ఆదాయం 95.35 బి.డాలర్ల నుంచి 17% వృద్ధి చెంది 111.2 బి.డాలర్లకు చేరింది. ఐఫోన్ల విక్రయంపై వచ్చే ఆదా యం 22% పెరిగి 57 బి.డాలర్లుగా నమోదైంది. భారత్‌లో భారీ అవకాశం.. టిమ్ కుక్: భారత మార్కెట్‌లో యాపిల్ స్థిరంగా రెండంకెల వృద్ధి నమోదుచేస్తోందని, ఈ ఫలితాలపై చాలా సంతోషంగా ఉన్నట్లు యాపిల్ సీఈఓ టిమ్ కుక్ తెలిపారు. ప్రపం చంలో రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌గా, మూడో అతిపెద్ద పీసీ మార్కెట్‌గా ఉన్న భారత్‌లో యాపిల్‌కు ప్రస్తుతం తక్కువ మార్కెట్ వాటా ఉందని.. భవిష్యత్తులో తమకు గొప్ప అవకాశాలను ఇది సూచిస్తోం దని పేర్కొన్నారు. దేశంలో మధ్యతరగతి ప్రజల సంఖ్య వేగంగా పెరుగుతోందని.. ప్రస్తుతం ఐఫోన్, మ్యాక్, ఐప్యాడ్, వాచ్ కొనుగోలు చేస్తున్న వారిలో ఎక్కువ మంది మొదటిసారి ఆ ఉత్పత్తులను వాడుతున్న వారేనని వెల్లడించారు. యాపిల్ సీఈఓగా సుదీర్ఘకాలం పాటు పనిచేసిన టిమ్ కుక్, ఈ ఏడాది సెప్టెంబరు 1న ఈ బాధ్యతల నుంచి వైదొలగి, సంస్థకు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా మారతారు. సీఈఓగా జాన్ టెర్నస్ బాధ్యతలు చేపట్టనున్నారు.

# సామాన్యులకూ అందుబాటులో బీమా ఉండాలి..



'జీవిత బీమా అధిక ఆదాయ వర్గాలకే పరిమితం అనే భావన ఉంది. 2047 నాటికి అందరికీ బీమా పాలసీలుండాలనే భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) లక్ష్యం నెరవేరాలంటే.. గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్యులకూ ధీమా కల్పించాల్సిన అవసరం ఉంది' అని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కాస్పరస్ జె.హెచ్.క్రోమ్‌హౌట్ తెలిపారు. దేశంలో జీవిత బీమా పరిశ్రమ 14-15% వార్షిక వృద్ధి రేటుతో సాగుతోందని వివరించారు. 'పరిశ్రమ ప్రధానంగా అధిక ఆదాయ వర్గాలపైనే దృష్టి సారిస్తుండటంతో, సగటు ప్రీమియం రూ.97,000గా నమోదవుతోంది. దేశంలో కేవలం 2.7 శాతంగా ఉన్న బీమా వ్యాప్తిని పెంచేందుకు, ఈ రంగంలోకి 100% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)కు అవకాశం కల్పించినా, గ్రామీణ ప్రాంతాల నుంచి పరిశ్రమకు వస్తున్న వ్యాపారం 20 శాతమే. సులభంగా అర్థమయ్యే మ్యూచువల్ ఫండ్స్ వంటి పెట్టుబడి సాధనాలపై చూపిస్తున్న ఆసక్తిని, విపత్కర పరిస్థితుల్లో ఆర్థిక రక్షణ కల్పించే బీమాపై ప్రజలు చూపకపోవడమే సవాలుగా ఉంది' అని విశ్లేషించారు. ఇటీవల అమల్లోకి వచ్చిన స్పెషల్ సరెండర్ వాల్యూ (ఎస్ఎస్‌వీ), జీఎస్‌టీ నిబంధనల మార్పులు బీమా రంగం లాభదాయకతపై తీవ్ర ప్రభావం చూపుతున్నందున, బీమా సంస్థలు ఇప్పుడు టర్మ్ పాలసీల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నాయన్నారు. మధ్యతరగతి వారిపైనే తమ సంస్థ దృష్టి పెట్టిందని, సగటు ప్రీమియం రూ.27,000 వరకే ఉందని చెప్పారు. రూ.15 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న వారి నుంచే 60% వ్యాపారం వస్తోందన్నారు. సాంకేతికతను ఉపయోగించుకుంటూ, 98.57% క్లెయిం సెటిల్‌మెంట్ నిష్పత్తితో సాగుతున్నట్లు తెలిపారు.

# సర్వీసులు నిలిపేసిన స్పిరిట్ ఎయిర్‌లైన్స్



ఇంధన కొరత, పెరుగుతున్న జెట్ ఇంధన ధరల కారణంగా పలు విమానయాన సంస్థలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నాయి. కొన్ని విమానయాన సంస్థలు తమ సర్వీసులను తగ్గించుకుంటుండగా.. మరికొన్ని టికెట్ల రేట్లు పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా (USA)కు చెందిన విమానయాన సంస్థ స్పిరిట్ (Spirit Airlines) కీలక నిర్ణయం తీసుకుంది. తమ సర్వీసులను శాశ్వతంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని తక్షణమే అమలుచేయనున్నట్లు వెల్లడించింది. అన్ని విమాన సర్వీసులను రద్దు చేశామని.. ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు డబ్బు తిరిగి చెల్లిస్తామని తెలిపింది. అయితే ఇతర విమానయాన సంస్థల్లో ప్రయాణ బుకింగ్‌లకు ఎలాంటి సాయం చేయబోమని స్పష్టం చేసింది. 34 ఏళ్లుగా స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తక్కువ ఛార్జీలతో ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందిస్తోంది. రోజూ వందలాది సర్వీసులను నడుపుతూ సుమారు 17,000 మందికి ఉపాధి కల్పించింది. కొవిడ్ తర్వాత పెరిగిన నిర్వహణ ఖర్చుల వల్ల ఈ ఎయిర్‌లైన్స్ పలు ఆర్థిక సమస్యలు, అప్పులతో ఇబ్బందులు పడుతోంది. ఇరాన్ యుద్ధం వల్ల జెట్ ఇంధన ధరలు ఆకాశాన్నంటడంతో.. ప్రస్తుతం ఈ విమానయాన సంస్థ దివాలా తీసే పరిస్థితికి వచ్చింది. ఆగస్టు 2025 నాటికి స్పిరిట్ ఎయిర్‌లైన్స్‌కు 8.1 బిలియన్ డాలర్ల అప్పులు, 8.6 బిలియన్ డాలర్ల ఆస్తులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి నుంచి రక్షణ కల్పించాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ఎటువంటి ఆర్థికసాయం అందకపోవడంతో సర్వీసులను నిలిపివేయాలని నిర్ణయించుకుంది. తమ ఎయిర్‌లైన్స్ మూసివేత వల్ల సుమారు 17వేల మంది ఉద్యోగులపై ఈ ప్రభావం పడుతుందని స్పిరిట్ న్యాయవాది మార్షల్ హ్యూబ్నర్ పేర్కొన్నారు. ఇదీ చదవండి: విమాన ఇంధన ధర పెరిగింది




# క్లాసెన్.. ఆటోలో అలా..



సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసక బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ నగర వీధుల్లో సందడి చేశాడు. ఐపీఎల్‌లో విరామం లభించడంతో తన కుమార్తె లాయాతో కలిసి హైదరాబాద్‌లో చక్కర్లు కొట్టాడు. క్లాసెన్, లాయా సాధారణ ప్రయాణికుల్లా ఆటోలో ప్రయాణిస్తూ నగర అందాల్ని వీక్షించారు. మైదానంలో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగే క్లాసెన్.. కుమార్తెతో కలిసి అతి సాధారణ వ్యక్తిలాగా ఆటోలో తిరుగుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

# ఈ జట్లు పుంజుకోగలవా?

ఐపీఎల్‌లో 19వ సీజన్లో సగానికి పైగా మ్యాచ్‌లు పూర్తయ్యాయి. కొన్ని జట్లు తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తూ పాయింట్ల పట్టికలో పైపైకి దూసుకెళ్తుంటే.. కొన్ని జట్లు పేలవ ప్రదర్శనతో అట్టడుగు స్థానం కోసం పోటీ పడుతున్నాయి. కొన్ని జట్లు పడుతూ లేస్తూ సాగుతున్నాయి. ప్లేఆఫ్స్ స్థానాలపై ఇప్పటికే ఒక స్పష్టత వచ్చినట్లు కనిపిస్తున్నా.. విపరీతమైన పోటీ ఉండే, ఎప్పటికప్పుడు అనూహ్య ఫలితాలు వచ్చే ఐపీఎల్‌లో ముందే ఒక అంచనాకు వచ్చేయలేం. పట్టికలో కొంచెం కింద ఉన్న జట్లలో ఒకటో రెండో పైకి వస్తే ఆశ్చర్యమేమీ లేదు. ఈ సీజన్లో తడబడుతూ సాగుతున్న చెన్నై సూపర్‌కింగ్స్, ముంబయి ఇండియన్స్ శనివారం తలపడనుండగా.. ఈ మ్యాచ్‌లో ఓడే జట్టు పరిస్థితి సంక్లిష్టం కానుంది. గత ఏడాది ఛాంపియన్‌గా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రన్నరప్ పంజాబ్ కింగ్స్.. ఈ ఐపీఎల్‌లోనూ సత్తా చాటుతున్నాయి. వీటికి తోడు రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా అదరగొడుతున్నాయి. పంజాబ్ 8 మ్యాచ్‌ల్లో ఆరు నెగ్గి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. వర్షం వల్ల రద్దవడం వల్ల వచ్చిన ఒకటితో కలిపి మొత్తం ఆ జట్టు 13 పాయింట్లు సాధించింది. ఇక బెంగళూరు 9 మ్యాచ్‌ల్లో 6 నెగ్గి 12 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. సన్‌రైజర్స్ 9 మ్యాచ్‌లాడి 12 పాయింట్లతో, రాజస్థాన్ రాయల్స్ 10 మ్యాచ్‌ల్లో 12 పాయింట్లతో వరుసగా 3, 4 స్థానాల్లో ఉన్నాయి. వీటికీ ప్లేఆఫ్స్ చేరడానికి మెరుగైన అవకాశాలు ఉన్నాయి. గుజరాత్ 9 మ్యాచ్‌లాడి 5 విజయాలు, 4 ఓటములతో మొత్తం 10 పాయింట్లు సాధించి అయిదో స్థానంలో ఉంది. 3, 4 స్థానాల్లో ఉన్న జట్లకు.. జీటీకి ఒక విజయమే తేడా కాబట్టి దాని అవకాశాలను కొట్టిపారేయలేం. మిగతా అయిదు జట్ల పరిస్థితి మాత్రం బాగా లేదు. 9 మ్యాచ్‌ల్లో నాలుగు నెగ్గిన దిల్లీ, 8 మ్యాచ్‌లాడి మూడు విజయాలు సాధించిన చెన్నై జట్ల పరిస్థితి కాస్త నయం. ఈ జట్లు ఇకపై ఆడబోయే మ్యాచ్‌ల్లో ఒకటికి మించి ఓటములు చవిచూస్తే ప్లేఆఫ్స్ రేసులో వెనుకబడిపోతాయి. దిల్లీ మెరుగ్గానే ఆడుతున్నప్పటికీ.. త్రుటిలో ఓడిపోతోంది. గెలవాల్సిన కొన్ని మ్యాచ్‌లను ఆ జట్టు దూరం చేసుకుంది. ఇక ఈ సీజన్‌ను పేలవంగా ఆరంభించిన చెన్నై.. తర్వాత పుంజుకున్నట్లే కనిపించినా, మళ్లీ తడబడుతోంది. మరోవైపు కోల్‌కతా (8 మ్యాచ్‌ల్లో 5 పాయింట్లు), ముంబయి (8 మ్యాచ్‌ల్లో 4 పాయింట్లు), లఖ్‌నవూ (8 మ్యాచ్‌ల్లో 4 పాయింట్లు) పుంజుకుని ప్లేఆఫ్స్ రేసులోకి రావడం చాలా కష్టంగానే ఉంది. వరుసగా అయిదు మ్యాచ్‌లు ఓడి అట్టడుగు స్థానంలో కొనసాగుతున్న ఎల్‌ఎస్‌జీ.. ఈ సీజన్ మీద ఆశలు వదులుకోవాల్సిందే అనిపిస్తోంది. తన కంటే ఘోరమైన ప్రదర్శన చేస్తున్న కోల్‌కతా చేతిలో కూడా ఆ జట్టు ఓడిపోయింది. ఆ మ్యాచ్‌లో గెలిచేందుకు లఖ్‌నవూకే ఎక్కువ అవకాశాలు కనిపించాయి. కానీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆ ఓటమి తర్వాత కెప్టెన్ పంత్ జావగారిపోయాడు. తమ జట్టుకు కాస్త విరామం కావాలని వ్యాఖ్యానించాడు. ఏమాత్రం స్ఫూర్తినివ్వలేని పంత్ కెప్టెన్సీనే ఆ జట్టుకు పెద్ద ప్రతిబంధకంగా మారింది. ఇక కోల్‌కతా ఈ సీజన్లో అతి కష్టం మీద రెండు విజయాలు సాధించగలిగింది.



## బీసీసీఐ శిబిరానికి అనన్య

తెలుగమ్మాయి దండు అనన్య మరో ఘనత సాధించింది. బీసీసీఐ అండర్-15 మహిళల ఎలైట్ క్రికెట్ టోర్నీలో అత్యధిక వికెట్లతో రాణించిన అనన్య.. వీవీఎస్ లక్ష్మణ్ సారథ్యంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ- బీసీసీఐ)కి ఎంపికైంది.



ఈనెల 18 నుంచి జూన్ 11 వరకు భారత హై పర్ఫార్మెన్స్ అండర్-15 శిక్షణ శిబిరంలో 13 ఏళ్ల అనన్యకు చోటు లభించింది. ఇటీవల ముగిసిన జాతీయ అండర్-15 టోర్నీలో అనన్య 16 వికెట్లతో దేశంలోనే అత్యుత్తమ బౌలర్‌గా నిలిచింది. కుడిచేతి వాటం ఆఫ్ స్పిన్‌తో సంచలన ప్రదర్శనతో మెరిసింది. హైదరాబాద్‌లోని రామానాయుడు క్రికెట్ అకాడమీలో బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరినాథ్ దగ్గర అనన్య శిక్షణ తీసుకుంటోంది. "ప్రతిభావంతులైన క్రికెటర్లకు రామానాయుడు అకాడమీలో ఉచితంగా అత్యున్నత స్థాయి శిక్షణ ఇస్తున్నాం. తల్లిదండ్రుల మీద ఎలాంటి భారం పడకుండా పేద, మధ్య తరగతి క్రికెటర్లకు అన్ని రకాల వసతులు అందిస్తున్నాం. మమత మదివాడ (ఎమర్జింగ్ ఇండియా), ధృతి కేసరి (అండర్-19 ప్రపంచకప్), ప్రణవి చంద్ర (సౌత్‌జోన్), ప్రతీక (హైదరాబాద్ జట్టు), సంధ్య గోరా (అండర్-19 ఎన్‌సీఏ శిబిరం), వల్లి (ఆంధ్ర అండర్-19), జనిక్ష (హైదరాబాద్ అండర్-15, అండర్-19) ఈ అకాడమీ నుంచి వెలుగులోకి వచ్చినవారే" అని చాముండేశ్వరినాథ్ తెలిపారు.

# గెలుపు బాటలో ఢిల్లీ



ఒక మ్యాచ్‌లో సన్‌రైజర్స్ బ్యాటర్ల దెబ్బకు బెంబేలెత్తింది. మరో మ్యాచ్‌లో పంజాబ్‌పై 264 పరుగులు చేసినా ఓటమి తప్పలేదు. ఇంకో పోరులో బెంగళూరు మీద దారుణమైన ప్రదర్శనతో 75 పరుగులకే కుప్పకూలి ఓటమి కొనితెచ్చుకుంది. ఇలా హ్యాట్రిక్ ఓటములతో ప్లేఆఫ్స్ రేసులో వెనుకబడ్డ దిల్లీ క్యాపిటల్స్.. మళ్లీ గెలుపు బాట పట్టింది. రాజస్థాన్ రాయల్స్ 226 భారీ లక్ష్యాన్ని నిలిపినా వెరవని డీసీ.. ఓపెనర్లు కేఎల్ రాహుల్, నిశాంక మెరుపులతో అలవోకగా విజయాన్నందుకుంది. రియాన్ పరాగ్ ఎట్టకేలకు ఫామ్ అందుకుని కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడినా రాజస్థాన్‌ను గెలిపించలేకపోయాడు.

ఐపీఎల్-19లో హ్యాట్రిక్ ఓటముల తర్వాత దిల్లీ క్యాపిటల్స్ అత్యావశ్యక విజయాన్నందుకుంది. శుక్రవారం ఆ జట్టు 7 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించింది. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (75; 40 బంతుల్లో 6×4, 5×6), నిశాంక (62; 33 బంతుల్లో 6×4, 3×6)తో పాటు నితీశ్ రాణా (33; 17 బంతుల్లో 3×4, 2×6) మెరుపులు మెరిపించడంతో 226 పరుగుల లక్ష్యాన్ని డీసీ.. 19.1 ఓవర్లలో 3 వికెట్లే కోల్పోయి ఛేదించింది. మొదట రాజస్థాన్ 6 వికెట్లకు 225 పరుగులు చేసింది. పరాగ్ (90; 50 బంతుల్లో 8×4, 5×6), ఫెరీరా (47 నాటౌట్; 14 బంతుల్లో 2×4, 6×6) విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడారు. సీజన్లో తొలి మ్యాచ్ ఆడిన మిచెల్ స్టార్క్ (3/40) సత్తా చాటాడు. దిల్లీకి 9 మ్యాచ్‌ల్లో ఇది నాలుగో విజయం కాగా.. పదో మ్యాచ్ ఆడిన రాజస్థాన్ నాలుగో ఓటమిని ఖాతాలో వేసుకుంది.

ఇద్దరే తేల్చేశారు: గత మ్యాచ్‌లో 75 పరుగులకే కుప్పకూలిన దిల్లీ.. ఈ పోరులో 226 పరుగుల లక్ష్యం ముందున్నా ఏమాత్రం తడబడలేదు. ఓపెనర్లు నిశాంక, రాహుల్ శతక భాగస్వామ్యం నమోదు చేయడంతో ఆ జట్టు విజయానికి బలమైన పునాది పడింది. వరుస వైఫల్యాల నుంచి బయటపడుతూ నిశాంక ఈ మ్యాచ్‌లో విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. అవతలి ఎండ్ నుంచి రాహుల్ సహకరిస్తుండగా.. అతను చెలరేగిపోయాడు. ఆర్చర్, బర్గర్ లాంటి మేటి బౌలర్ల బౌలింగ్‌లో భారీ షాట్లు ఆడుతూ 23 బంతుల్లోనే నిశాంక అర్ధశతకం బాదేశాడు. పవర్‌ప్లేలో దిల్లీ 70/0తో నిలిచింది. 8 ఓవర్లు ముగిసేసరికి 26 పరుగులే చేసిన రాహుల్‌కు.. రవి బిష్ణోయ్ వేసిన తర్వాతి ఓవర్లో ఒక ఫోర్, రెండు సిక్సర్లతో రెచ్చిపోయాడు.

## వైభవ్ క్లీన్‌బౌల్డ్‌పై అతిగా సంబరాలు..

ఈ ఐపీఎల్ సీజన్‌లో అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్న యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ దిల్లీతో జరిగిన మ్యాచ్‌లో విఫలమయ్యాడు. కేవలం 4 పరుగులకే పేసర్ జేమీసన్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయి వెనుదిరిగాడు. అయితే, వైభవ్ ఔట్ అయిన తర్వాత దిల్లీ బౌలర్ అతిగా సంబరాలు చేసుకోవడం ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశమైంది. జేమీసన్ తీరుపై క్రికెట్ అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. రాజస్థాన్ ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో దిల్లీ బౌలర్ జేమీసన్ వేసిన ఐదో బంతికి వైభవ్ (4) బౌల్డ్ అయ్యాడు. అప్పటికే తొలి ఓవర్‌లో యశస్వీ వికెట్ కోల్పోయిన ఆర్‌ఆర్‌కు జేమీసన్ రూపంలో మరో షాక్ తగిలినట్లయ్యింది. ఈ క్రమంలోనే వైభవ్ ఔటైన వెంటనే ఈ దిల్లీ పేసర్ కాస్త అతిగా సంబరాలు చేసుకున్నాడు. వైభవ్‌ను చూస్తూ గట్టిగా అరిచాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీంతో జేమీసన్ ప్రవర్తనను నెటిజన్లు విమర్శించారు. 'అతడు కేవలం 15 ఏళ్ల ఆటగాడే.. కాస్త సహనంగా ఉండు. నీ అహాన్ని తగ్గించుకుంటే మంచిది' అంటూ దిల్లీ బౌలర్‌కు నెటిజన్లు చురకలంటించారు. దీనిపై మాజీ క్రికెటర్ ప్రియాంక్ పంచల్ స్పందించాడు. "ఈ తరహా సంబరాలు చూడటానికి అంతగా బాలేదు. అయితే, ఈ వయసులోనే వైభవ్ ప్రత్యర్థులకు ఎలాంటి భయం కలిగించాడో.. అతడి ఆటతీరు సీనియర్లపై ఎలాంటి ప్రభావం చూపించిందో మనం అర్థం చేసుకోవచ్చు" అని ప్రియాంక్ రాసుకొచ్చాడు.



# వుదయం సినిమా

MOVIE TIME!

## జెట్లీ రెస్పాన్స్ ఆనందాన్ని ఇచ్చింది

### రోరింగ్ టేక్ అఫ్ మీట్‌లో హీరో సత్య

**వుదయం సినిమా :** సత్య, రితేష్ రానా సమ్మర్ బ్లాక్ బస్టర్ 'జెట్లీ'. క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మించిన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సమర్పించింది. మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా కథానాయికగా తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేసింది. వెన్నెల కిషోర్, అజయ్ కీలక పాత్రలు పోషించారు. మే 1న గ్రాండ్ గా థియేటర్స్ లో రిలీజైన చిత్రం బ్లాక్ బస్టర్ విజయంతో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతుంది. ఈ సందర్భంగా మేకర్స్ రోరింగ్ టేక్ అఫ్ మీట్ నిర్వహించారు.



## మే 22న పోలీస్ కంప్లైంట్



**వుదయం సినిమా :** విలనిజం అయినా, క్యారెక్టర్ రోల్ అయినా.. తనదైన పవర్‌ఫుల్ నటనతో స్క్రీన్‌పై మ్యాజిక్ చేసే నటి వరలక్ష్మి శరత్‌కుమార్. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ టాలీవుడ్‌లో వెర్సటైల్ హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు నవీన్ చంద్ర. ఇప్పుడు వీరిద్దరూ కలిసి ఓ సరికొత్త, భిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో డైరెక్టర్ సంజీవ్ మేగోటి తెరకెక్కించిన తాజా చిత్రం 'పోలీస్ కంప్లైంట్'. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మిస్తున్న ఈ మూవీ మే 22న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కాబోతోంది.

## సతీ లీలావతి ట్రైలర్ లాంచ్





**వుదయం సినిమా :** లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'సతీ లీలావతి'. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని మే 8న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. ఈ క్రమంలో శనివారం నాడు మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.
లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ.. "సతీ లీలావతి' కోసం మేం పెట్టిన శ్రమ, మా ప్రేమ, మా కష్టం అంతా తెరపై ఆడియెన్స్ చూస్తారు. సత్య గారు, ఉదయ్ గారు మంచి కథను నా వద్దకు తీసుకు వచ్చారు. 'సతీ లీలావతి' అద్భుతంగా వచ్చింది. ఈ చిత్రం కోసం నాగ మోహన్ గారు చాలా కష్టపడ్డారు. నేను చిత్రీకరణ సమయంలో ప్రెగ్నెంట్ అని తెలిశాక టీం మొత్తం సపోర్ట్ చేసింది. దేవ్ గారు సొంతంగా డబ్బింగ్ చెప్పారు. మా ట్రైలర్‌ను రిలీజ్ చేసిన మా బావ గారు రామ్ చరణ్‌కి థాంక్స్. ఆయన రిలీజ్ చేయడం వల్ల మా ట్రైలర్‌కి, మా సినిమాకు రీచ్ పెరిగింది. మా ట్రైలర్‌ని అందరూ చూసి సపోర్ట్ చేయండి. మే 8న మా సినిమాని చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు.
లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ.. "సతీ లీలావతి' కోసం మేం పెట్టిన శ్రమ, మా ప్రేమ, మా కష్టం అంతా తెరపై ఆడియెన్స్ చూస్తారు. సత్య గారు, ఉదయ్ గారు మంచి కథను నా వద్దకు తీసుకు వచ్చారు. 'సతీ లీలావతి' అద్భుతంగా వచ్చింది. ఈ చిత్రం కోసం నాగ మోహన్ గారు చాలా కష్టపడ్డారు. నేను చిత్రీకరణ సమయంలో ప్రెగ్నెంట్ అని తెలిశాక టీం మొత్తం సపోర్ట్ చేసింది. దేవ్ గారు సొంతంగా డబ్బింగ్ చెప్పారు. మా ట్రైలర్‌ను రిలీజ్ చేసిన మా బావ గారు రామ్ చరణ్‌కి థాంక్స్. ఆయన రిలీజ్ చేయడం వల్ల మా ట్రైలర్‌కి, మా సినిమాకు రీచ్ పెరిగింది. మా ట్రైలర్‌ని అందరూ చూసి సపోర్ట్ చేయండి. మే 8న సినిమాని చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు.

## #గోపీచంద్34 అనౌన్స్ మెంట్



**వుదయం సినిమా :** హీరో టీ గోపీచంద్ వరుసగా ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లతో ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం 'భరత వర్ష' అనే పీరియాడిక్ యాక్షన్ డ్రామా చేస్తున్న ఆయన, ఇప్పుడు తన 34వ చిత్రాన్ని ప్రకటించారు. ప్రముఖ ఫైట్ మాస్టర్ వివెంకట్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాణంలో 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ భారీ బడ్జెట్ యాక్షన్ డ్రామా రూపొందుతోంది. వినూత్న కథలతో కమర్షియల్ ఎలిమెంట్స్ కలిపి సినిమాలు చేయడంలో పేరు గాంచిన ఈ బ్యానర్, మరోసారి భారీ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రాజెక్ట్ ను తీసుకువస్తోంది.
అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో కనిపించిన విజువల్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. అగ్ని వర్ణంలో ఆకాశం, సూర్యుడు, ఒక కొండపై గర్వంగా నిలబడి ఉన్న నల్ల పాంథర్.. ఇవన్నీ కలిసి సినిమా టోన్‌ను ఇంటెన్స్, మైథికల్‌గా చూపిస్తున్నాయి. ఈ చిత్రం పూజా కార్యక్రమం రేపు జరగనుందని మేకర్స్ ప్రకటించారు.

## బెల్లంకొండ దంపతులకు ఆశీర్వాదం





**వుదయం సినిమా :** ఏప్రిల్ 29న తిరుమలలో నటుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ - కావ్యల వివాహం జరిగిన సంగతి తెలిసిందే. వీరి వెడ్డింగ్ రిసెప్షన్ హైదరాబాద్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై, నూతన దంపతులను ఆశీర్వదించారు.

## వంద దేవుళ్ళు నుంచి అమ్మా అమ్మేగా సాంగ్



**వుదయం సినిమా :** విజయ్ ఆంటోని, శశి దర్శకత్వంలో వచ్చిన 'బిచ్చగాడు', అందులోని అమ్మ పాటకు ఉన్న క్రేజ్ అందరికీ తెలిసిందే. ఇప్పటికీ అమ్మ పాట అంటే అందరూ ఆ పాటనే ఎంచుకుంటారు. మళ్లీ అలాంటి ఓ ఎమోషనల్ మదర్ సాంగ్‌తో విజయ్ ఆంటోని, శశి ఆడియెన్స్ ముందుకు వచ్చారు. వీరి కాంబోలో 'బిచ్చగాడు' తరువాత 'వంద దేవుళ్ళు' అనే సినిమా రాబోతోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్‌తో సినిమా మీద అంచనాలు ఆకాశన్నంటాయి. ఇక తాజాగా 'వంద దేవుళ్ళు' నుంచి 'అమ్మ అమ్మేగా' అంటూ అమ్మ గొప్పదనం గురించి చెప్పే పాటను విడుదల చేశారు. వంద దేవుళ్లే దిగివచ్చినా అని భాష్యశ్రీ ఎలాంటి సంచలనాలు క్రియేట్ చేశారో.. మళ్లీ ఇప్పుడు 'అమ్మ అమ్మేగా' అని అందరినీ మెప్పించేందుకు వచ్చారు. 'అమ్మ అమ్మేగా' అనే ఈ పాటకి భాష్యశ్రీ సాహిత్యం, బాలాజీ శ్రీరామ్ బాణీ, శ్రీకాంత్ హరిహరణ్ గాత్రం అన్నీ అద్భుతంగా కుదిరాయి. ఈ పాటను వింటే అమ్మ విలువ ఏంటో మరోసారి అర్థం అయ్యేలా ఉంది.

## జూన్ 11న సింగ్ గీతం



**వుదయం సినిమా :** లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ తో ముందుకు వస్తున్నారు. దశాబ్దాల పాటు సాగిన తన కెరీర్‌లో, పలు భాషల్లో దాదాపు అరవై చిత్రాలతో ఇండియన్ సినిమాని రీడిఫైన్ చేసిన సంగీతం, 94 ఏళ్ల వయసులో డైరెక్టర్ చైర్ లోకి తిరిగి వస్తూ, సృజనాత్మకతకు హద్దులు లేవని మరోసారి నిరూపిస్తున్నారు. ఐకానిక్ మూకీ చిత్రం 'పుష్పక్' నుంచి విజనరీ సైన్స్ ఫిక్షన్ క్లాసిక్ 'ఆదిత్య 369' వరకు ఆయన క్రియేటివిటీకి పర్యాయపదంగా నిలిచారు. కమల్ హాసన్‌తో ఆయన చేసిన 'విచిత్ర సహోదరులు', 'మైఖేల్ మదన కామరాజన్' బెంచ్ మార్క్ సినిమాలుగా నిలిచాయి. ఇప్పుడు, భారతదేశపు మొట్టమొదటి మ్యూజికల్ ఫాంటసీగా రూపొందించబడిన 'సింగ్ గీతం'తో అలరించబోతున్నారు. ఈ చిత్రం సంగీతం, మ్యాజికల్ రియలిజంను మేళవించి ఓ యూనిక్ అనుభూతిని అందిస్తుంది. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా వంటి ప్రతిష్టాత్మక బ్యానర్ల పై నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్, ఒక దిగ్గజ దార్శనికుడిని, లెజెండరీ నిర్మాణ సంస్థను ఒకచోట చేర్చింది.

## అత్యంత వైభవంగా దాసరి లెజెండ్రీ అవార్డ్స్



**వుదయం సినిమా:** ప్రఖ్యాత దర్శకులు దాసరి నారాయణరావు మరణానంతరం ఆయన పేరిట ప్రతి ఏటా ఘనంగా అవార్డ్స్ ఫంక్షన్ నిర్వహిస్తున్న ప్రముఖ నిర్మాత తుమ్మలపల్లి రామసత్యానారాయణ ఈ ఏడాది కూడా ఆయన 79వ జయంతిని పురస్కరించుకొని "దాసరి లెజెండరీ అవార్డ్స్" పేరిట అవార్డ్స్ ఫంక్షన్ అత్యంత ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్ లో జరిగిన ఈ వేడుకకు ప్రముఖ నటులు మాజీ పార్లమెంటు సభ్యులు మురళీమోహన్, సీనియర్ నటీమణి రోజారమణి, సీనియర్ హీరో సుమన్, ప్రముఖ దర్శకులు రేలంగి నరసింహారావు, ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, దర్శకుల సంఘం అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య, దూరదర్శన్ డైరెక్టర్ శ్రీమతి కామేశ్వరి, వంశీ రామరాజు, సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ ప్రభు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు!!
2025 26 సంవత్సరాలలో టాలీవుడ్ లో వివిధ శాఖలలో విశేష ప్రతిభ కనబరిచిన ప్రతిభావంతులకు ఈ వేడుకలో పట్టం కట్టారు. ఈ అవార్డులు అందుకున్న వారిలో ప్రముఖ దర్శకులు బోయపాటి శ్రీను, సీనియర్ దర్శకులు పి.ఎన్. రామచంద్రరావు, మెగా డాటర్ సుస్మిత కొణిదల, సాహు గారపాటి, ప్రముఖ నటి లయ, ప్రముఖ దర్శకులు గుణశేఖర్, ప్రముఖ నటుడు శివాజీ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ త్రయం "నాగబైరు సుబ్బారావు ప్రదీప్ ఓం ప్రకాష్ నారాయణ", ప్రముఖ రచయిత భారతిబాబు, ప్రముఖ కొరియోగ్రాఫర్ ఆట సందీప్, "రాకాస" దర్శకురాలు మానస శర్మ తదితరులు ఉన్నారు!!



## గోదారి గట్టుపైన

### అందరూ రిలేట్ అయ్యే కథ : సుభాష్ చంద్ర

**వుదయం సినిమా:** యంగ్ హీరో సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా 'గోదారి గట్టుపైన'తో అలరించబోతున్నారు. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. టీజర్, ట్రైలర్ పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ చిత్రం మే 8న వరల్డ్‌వైడ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ సుభాష్ చంద్ర విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీ నేపథ్యం గురించి?**
మాది రేలంగి. మా నాన్నగారు బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. నేను బీటెక్ చదువుతున్నప్పటి నుంచే షార్ట్ ఫిలిమ్స్ చేయడం ప్రారంభించాను. దాదాపు 80 షార్ట్ ఫిలిమ్స్ చేసిన తర్వాత చెన్నైలో ఎల్‌వీ ప్రసాద్ ఫిలిం ఇన్స్టిట్యూట్‌లో ఫిలిం మేకింగ్ కోర్స్ చేశాను. ఆ తర్వాత ఫీచర్ ఫిలిమ్స్‌లోకి వచ్చాను. నేను ఎక్కువగా రాజ్ తరుణ్‌తో షార్ట్ ఫిలిమ్స్ చేశాను.

**మీరు దాదాపుగా వంద షార్ట్ ఫిలిమ్స్ చేశారు.. డైరెక్టర్‌గా మీ నుంచి సినిమా రావడానికి ఇంత సమయం పట్టడానికి కారణం?**
నేను ఎప్పుడూ ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఒక సినిమా ప్రీప్రొడక్షన్ మొత్తం పూర్తి చేసి షూటింగ్‌కు వెళ్లే సమయానికి ఆగిపోయింది. మరో సినిమా పూర్తయింది కానీ రిలీజ్ కాలేదు. ఆ సినిమా విడుదల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. దేనికైనా ఒక సమయం రావాలని నేను నమ్ముతాను. ఆ సమయం 'గోదారి గట్టుపైన' సినిమాతో వచ్చిందని భావిస్తున్నాను.

**గోదారి గట్టు కోసం సుమంత్ ప్రభాస్ గారిని ఎంపిక చేయడానికి కారణం?**
ముందుగా సునీల్ నారంగ్, జాన్వి నారంగ్ గారికి థాంక్స్ చెప్పాలి. వారే సుమంత్ గారిని రిఫర్ చేశారు. వాళ్లు మా ప్రొడ్యూసర్ గారి పార్ట్నర్స్. సుమంత్ గారికి కథ చెప్పగానే ఆయనకి చాలా నచ్చింది. ఇది ఆయనకు పర్ఫెక్ట్‌గా సరిపోయే కథ. ఈ సినిమాలో సుమంత్ గారిది గోదావరి అబ్బాయి పాత్ర. గోదారి యాసను పర్ఫెక్ట్‌గా పలికారు. అందుకోసం చాలా ట్రైనింగ్ తీసుకున్నారు. అలాగే ప్రమోషన్స్ సుమంత్ గారి సపోర్ట్ ని మర్చిపోలేను.

**టెక్నీషియన్స్ గురించి?**
ఇప్పటివరకు నాతో పని చేసిన టెక్నీషియన్స్‌నే ఈ సినిమాకి తీసుకున్నాను. కలిసి పని చేశాం కాబట్టి సక్సెస్ కూడా కలిసి పొందాలని అనుకున్నాను. నా టీమ్ నాకు చాలా బలం. నా ఆలోచనలు వాళ్లకు చాలా క్లియర్‌గా అర్థమవుతాయి.

**ఈ ప్రేమ కథ ఎంత కొత్తగా ఉంటుంది?**
ఈ కథ మన జీవితాల్లో చూసినదే. ప్రతి ఇంట్లో తండ్రి-కూతురు ఉంటారు, వారి మధ్య ప్రేమ ఉంటుంది. అలాగే ఇద్దరు ప్రేమికుల మధ్య ప్రేమ కూడా ఉంటుంది. ఈ రెండింటినీ ట్రయాంగిల్ ఫార్మ్‌లో చూపించాను. సినిమా అందరూ రిలేట్ చేసుకునేలా ఉంటుంది.



## బుద్ధుని పుట్టినరోజును సెలవుగా ప్రకటించాలి

### గరికపాటికి వార్నింగ్ ఇచ్చిన కింగ్ బుద్ధ డైరెక్టర్ సత్యారెడ్డి

ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా బుద్ధ జయంతిని సంపూర్ణ నేషనల్ హాలిడేగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్నాలో "కింగ్ బుద్ధ" హాలీవుడ్ మూవీ డైరెక్టర్ సత్యారెడ్డి గారు తీవ్రంగా స్పందించారు. గతంలో గౌతమ బుద్ధుడిని పిరికివాడిగా వ్యాఖ్యానించిన ప్రవచనకర్త గరికపాటికి ఆయన కఠినమైన హెచ్చరిక జారీ చేశారు. "ఇకనుంచి ఎవరైనా గౌతమ బుద్ధుని గురించి తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదు. బుద్ధుని అవమానించే ప్రయత్నాలు ఏవైనా జరిగితే వాటిని తీవ్రంగా ఖండిస్తాం" అని సత్యారెడ్డి గారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,
"గౌతమ బుద్ధుడు సాధారణ వ్యక్తి కాదు, ఆయన 'శాక్య సింహం'. ఆయన జీవితం పిట్ట కథలు, చేపల కథలు కాదు, అది ఒక మహా వీరగాథ, శాంతి సందేశం. భావితరాలకు బుద్ధుని నిజమైన చరిత్ర, తత్వం. ఆయన చూపిన మార్గం తెలియజేయడం మన బాధ్యత," అని అన్నారు.
అంతేకాక బుద్ధుని జీవితంలో ఒక విశేష ఘటనను కూడా ఆయన ప్రస్తావించారు. "బుద్ధుడిగా మారిన తర్వాత కపిలవస్తు రాజ్యంలో అడుగు పెట్టిన రోజు, ఆయన భార్య యశోదర పట్టణాన్ని దీపాలతో అలంకరించి అపూర్వ స్వాగతం పలికింది. ఆ మహత్తర సందర్భమే తర్వాత 'బుద్ధ దీపావళి'గా మారింది" అని సత్యారెడ్డి గారు వివరించారు.
ప్రపంచవ్యాప్తంగా బుద్ధుని మార్గాన్ని అనుసరిస్తున్న దాదాపు 25 దేశాలు శాంతి, అభివృద్ధి, సమానత్వంలో ముందంజలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. "ఆ దేశాల పురోగతిని చూసి భారతదేశం కూడా మరోసారి బుద్ధిజం వైపు పయనించాలి. అదే నిజమైన శాంతి, అభివృద్ధి దారి" అని సత్యారెడ్డి గారు అభిప్రాయపడ్డారు.
ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు మద్దతుదారులు కూడా బుద్ధ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని గట్టిగా డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఈ డిమాండ్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సత్యారెడ్డి గారు తెలిపారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.